శనివారం
14•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 259
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE







# పన్నుల పెంపు తప్పదు

**జవాబుదారీతనం పెంచేందుకే కొత్త చట్టాలు**

- అమలు చేయగలిగేవే చెప్తాం.. ఓట్లకోసం భయపడేది లేదు
- పల్లె, పట్టణప్రగతి కార్యక్రమాలతో ప్రజాప్రతినిధులపై పెరిగిన బాధ్యత
- ప్రతి గ్రామంలో డంపింగ్‌యార్డ్, శ్మశానవాటిక, నర్సరీలు ఉన్న రాష్ట్రం దేశంలో మనదే
- 'పల్లెప్రగతి' పై అసెంబ్లీలో చర్చ సందర్భంగా సీఎం కేసీఆర్
- ప్రతి గిరిజన పంచాయతీకి రేషన్ అందేలా చర్యలకు ఆదేశం



చిన్న పంచాయతీలకు ఏటా రూ.5 లక్షలు

సీఎం కేసీఆర్ ప్రకటన
వెంటనే జీవో విడుదల

## పేదలపై భారం పడదు

### స్థోమత ఉన్నవాళ్ల నుంచే వసూలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

వ్యవస్థలను ఆర్థికంగా బలోపేతం చేసేలా విద్యుత్ చార్జీలు, మున్సిపల్, గ్రామ పంచాయతీ పన్నులు కొంతమేర పెంచక తప్పదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. పేదలపై ఎలాంటి భారం లేకుండా.. చెల్లించే స్థోమత ఉన్నవారి నుంచే వసూలు చేసేలా ఈ పెంపు ఉండబోతున్నదని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో వ్యవస్థలు ప్రజలు కట్టే పన్నులమీదే పని చేస్తాయని అన్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్తామని.. వారికి ప్రభుత్వంపై నమ్మకం ఉన్నదని పేర్కొన్నారు. గతంలో సాధ్యంకాని హామీలిచ్చిన వాళ్లను ఎక్కడుంచాలో అక్కడ్నే ఉంచారని గుర్తుచేశారు. శుక్రవారం అసెంబ్లీలో పల్లెప్రగతిపై స్వల్ప వ్యవధి చర్చలో ముఖ్యమంత్రి కేసీఆర్ పలు అంశాలపై సవివరంగా మాట్లాడారు. గత 70 ఏండ్లలో పల్లెలు ఎలాంటి దుస్థితికి చేరాయి.. వాటిని బాగుచేసేందుకు ఇప్పుడు ఎలాంటి కార్యాచరణతో రాష్ట్రప్రభుత్వం ముందుకెళుతున్నదో సీఎం కేసీఆర్ వివరించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని.. దానిని ఇస్తున్న సంస్థ బతకాలంటే కరంట్ చార్జీలు పెంచాలని, పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం పన్నుల రూపంలో కొంత భారం వేయాలని నిర్ణయించామని చెప్పారు. ఈ నిర్ణయాన్ని ముందే ధైర్యంగా చెప్తున్నామని, వసూలైన పన్నుల్లో

మిగతా 2వ పేజీలో



శుక్రవారం అసెంబ్లీలో రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహాచార్యులుకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న టీఆర్ఎస్ అభ్యర్థులు కే కేశవరావు, సురేశ్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు కేటీఆర్, తలసాని, ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా ఉన్నారు.

## కేకే, సురేశ్‌రెడ్డి ఎన్నిక లాంఛనమే!

రాజ్యసభకు నామినేషన్ వేసిన టీఆర్ఎస్ అభ్యర్థులు

16న పత్రాల పరిశీలన.. 18న అధికారిక ప్రకటన 2



## కరోనా రోగి ఇంటికి

వ్యాధిని నయంచేసి పంపిన గాంధీ దవాఖాన వైద్యులు



శుక్రవారం బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా-2020 ప్రదర్శన సందర్భంగా విమానాల వద్దకు బ్యాటరీ కారులో వెళ్తున్న మంత్రి కే తారకరామారావు

విశ్వాస పరీక్షకు

## సిద్ధమే

మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ వెల్లడి
గవర్నర్‌తో భేటీ
రాజకీయ సంక్షోభంపై వినతిపత్రం
బీజేపీ కనుసన్నల్లోనే కుట్ర జరుగుతున్నదని ఫిర్యాదు 4



## హమ్మయ్య!

భీకర నష్టాల నుంచి కోలుకున్న స్టాక్ మార్కెట్లు
అమ్మకాల ఒత్తిడితో 45 నిమిషాలపాటు ట్రేడింగ్ నిలిపివేత
12 ఏండ్ల తర్వాత ఇదే తొలిసారి

దిగొస్తున్న బంగారం 8
1,100 తగ్గిన తులం ధర
1,500 చవకైన వెండి

## దేశంలో రెండో కరోనా మరణం

ఢిల్లీలో వైరస్ సోకి వృద్ధురాలు మృతి
మొత్తం 81కి చేరిన కరోనా కేసులు 5

వికారాబాద్‌లో క్వారంటైన్ కేంద్రం
విదేశాల నుంచి వచ్చేవారికి హరిత రిసార్ట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

ఐపీఎల్ వాయిదా
షెడ్యూల్‌ను ఏప్రిల్ 15కు మార్చిన బీసీసీఐ
భారత్, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్ రద్దు

## కొత్తగా ఆరు ఎయిర్‌పోర్టులు

మూడు గ్రీన్‌ఫీల్డ్, మూడు బ్రౌన్‌ఫీల్డ్
త్వరలో వరంగల్ ఎయిర్‌పోర్ట్ సేవలు
వింగ్స్ ఇండియా-2020 ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్ 3



## కొత్తిండ్ల సంబురం

తునికిబొల్లారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గృహప్రవేశాలు
తరలొచ్చిన కొండపోచమ్మ ముంపు గ్రామాల ప్రజలు
తాజాగా బైలంపూర్ వాసుల రాక
కేసీఆర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీగా నామకరణం 7

కేంద్ర ఉద్యోగులకు

## 4 శాతం డీఏ పెంపు

పెన్షనర్లకు కూడా పెరిగిన డీఆర్ 4
కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | |
|---|---|
| ఫారం ధర- 15.00 | రిటైల్ లైవ్ -54.00 |
| డ్రెస్‌డ్- 37.00 | స్కిన్‌లెస్- 61.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | |
|---|---|
| హైదరాబాద్- 295.00 | రంగారెడ్డి-295.00 |
| మెదక్- 295.00 | కరీంనగర్- 298.00 |
| వరంగల్ - 298.00 | డజన్ ధర-54.00 |









శుక్రవారం టీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలుచేసిన అనంతరం అసెంబ్లీలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసిన కే కేశవరావు, కేఆర్ సురేశ్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఈటల రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్ కూడా ఉన్నారు.



శుక్రవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన నూతనంగా ఎన్నికైన డీసీఎమ్మెస్ చైర్మన్లు. చిత్రంలో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా ఉన్నారు.

## స్థిరంగా ఉపరితలద్రోణి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దక్షిణ తమిళనాడు దానిని ఆనుకొని ఉన్న కొమోరిన్ ప్రాంతం నుంచి ఉత్తర ఇంటీరియర్ కర్ణాటకవరకు 0.9 కిలోమీటర్ల ఎత్తువద్ద ఉపరితల ద్రోణి స్థిరంగా కొనసాగుతున్నది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిశాయి. సిద్దిపేట అర్బన్‌లో 44.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ చౌడాపూర్‌లో అత్యధిక ఉష్ణోగ్రత 38.1 డిగ్రీలుగా, హైదరాబాద్‌లో 34.9 డిగ్రీలుగా రికార్డయ్యాయి. ద్రోణి ప్రభావంతో రాగల 24 గంటల్లో అక్కడక్కడ తేలికపాటి వానలు కురిసే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.



# పన్నుల పెంపు తప్పదు

మొదటిపేజీ తరువాయి...

ప్రతిపైసా ప్రజలకోసమే ఖర్చుచేస్తామని తెలిపారు. పన్నులు పెంచకుండానే పనులు చేస్తామని ప్రజలను మభ్యపెట్టలేమని.. పేదలకు భారం కలుగకుండా పెంపు ఉంటుందని సీఎం చెప్పారు. ఉదాహరణకు విద్యుత్‌చార్జీలనే తీసుకుంటే ఎస్సీ, ఎస్టీలకు 101 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని.. వారికి రూపాయి కూడా చార్జీ పెంచేదిలేదని చెప్పారు. పన్ను చెల్లించే సామర్థ్యం ఉన్నవారికి మాత్రం చార్జీలు పెంచుతామని పేర్కొన్నారు.



రూ.5 లక్షలలోపు గ్రాంటు మాత్రమే వచ్చే చిన్న గ్రామాలకు కూడా అవసరం మేరకు అదనపు నిధులు కేటాయిస్తూ శుక్రవారమే ఆర్డర్ జారీచేస్తామని కేసీఆర్ ప్రకటించారు. తక్కువ జనాభా ఉన్నాసరే ప్రతి పంచాయతీకి ట్రాక్టర్ తప్పక ఉండాలని ఆదేశించినట్టు తెలిపారు. ములుగు జిల్లా డిమాండ్ వచ్చినప్పుడు ఛత్తీస్‌గఢ్ సీఎస్ సలహా తీసుకున్నామని.. గిరిజనప్రాంతా లు కలిపి జిల్లాగా ఉంటే అధికారయంత్రాంగం దృష్టి పెరిగి మేలు జరుగుతుందని సలహా వచ్చిందన్నారు.

### దృఢ సంకల్పంతోనే కొత్త పంచాయతీరాజ్‌చట్టం

'అధికారుల్లో జవాబుదారీతనం పోయింది. తనిఖీల్లేవు, ఆడిట్లు లేవు.. అడిగేవాడు లేకుండాపోయింది. తప్పుచేసిన సర్పంచ్‌ను కలెక్టర్ తీసేస్తే, మధ్యాహ్నం కల్లా ఎమ్మెల్యేను పట్టుకుని మంత్రి దగ్గరి నుంచి స్టే తెచ్చుకోవడం.. మళ్లీ అదే కలెక్టర్ ముందు కూర్చుని ఆ సర్పంచ్ వెకిలి నవ్వులు నవ్వే పరిస్థితి వచ్చింది. ఎక్కడో ఒకచోట దీనిని బ్రేక్‌చేయాలి. మంచిపేరో.. చెడ్డపేరో ఏదో ఒకటి రానీ.. కానీ ఆ సంకల్పం గట్టిగా తీసుకోకపోతే పరిస్థితి ఎక్క డ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంటది. అందుకే దృఢసంకల్పంతో నూతన చట్టాన్ని తెచ్చాం. నూరుశాతం అమలుచేసి తీరతాం' అని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు.

### ఎమ్మెల్యేల జీతం కట్‌చేసైనా నిధులిస్తాం

గ్రామపంచాయతీలకు నిధుల కేటాయింపును బడ్జెట్‌లో స్పష్టంగా పేర్కొన్నామని కేసీఆర్ తెలిపారు. కేంద్రం రాబోయే ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థికసంఘం నుంచి గ్రాంటుగా రూ.1,847 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించిందని, అందుకు సమానంగా రూ.1,847 కోట్లను రాష్ట్రం నుంచి చరిత్రలోనే మొదటిసారిగా పంచాయతీలకు ఇవ్వనున్నామని చెప్పారు. అవసరమైతే ఎమ్మెల్యేల జీతాలు కట్ చేస్తాం కానీ.. పంచాయతీలకు నిధులు ప్రతినెలా విడుదల చేస్తామని తెలిపారు. ఆ డబ్బును పంపే బాధ్యతను సైతం తానే తీసుకుంటానని ప్రకటించారు. టీఆర్ఎస్ సర్కార్ దేశంలోనే తిలిసారిగా రాష్ట్రంలో మూడువేల గిరిజన పంచాయతీలను ఏర్పాటు చేసిందని చెప్పారు. అక్కడ ప్రజలందరికీ రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని సివిల్‌సప్లైశాఖ మంత్రిని ఆదేశించారు. ఐదొందలు, అంతకంటే తక్కువ జనాభా ఉన్న గ్రామపంచాయతీలు 899 ఉన్నాయని వీటిని ప్రత్యేక పరిస్థితుల్లో ఏర్పాటుచేశామన్నారు. ఏడాదికి

### వందశాతం ట్యాక్స్‌లు వసూలు చేయాల్సిందే..

పన్నులు వసూలుచేయని సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శి ఉద్యోగాలు తీసేలా చట్టం ఉన్నదని, దాన్ని వందశాతం అమలుచేస్తామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ప్రాపర్టీట్యాక్స్‌ల విషయంలో ప్రజలకే అధికారమిస్తూ.. సెల్ఫ్‌సర్టిఫై చేసుకోవాలని చెప్పామని, అదేరీతిలో పంచాయతీల్లోనూ సెల్ఫ్ డిక్లరేషన్ విధానం పెడతామని చెప్పారు. కానీ తప్పు చేస్తే మాత్రం 25 రెట్లు జరిమానా, రెండేండ్ల జైలుశిక్ష విధిస్తామన్నారు. 60 ఏండ్లుగా ప్రేమగా చెప్తే గ్రామాలన్నీ పెంటకుప్పల్లా మారాయని, అందుకే పక్కాగా చట్టాల అమలుతో భయంతేవాలని నిర్ణయించామని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో వైకుంఠధామాలను దేవాలయాల మాదిరిగా అద్భుతంగా నిర్మించారని తెలిపిన సీఎం కేసీఆర్.. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, స్థానిక అధికారులు, ప్రజలకు అభినందనలు తెలిపారు.

### అందరికీ బాధ్యత

గ్రామ, పట్టణ అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరిపై బాధ్యత పెట్టిందని సీఎం కేసీఆర్ తెలిపారు. సర్పంచ్, కౌన్సిలర్, వార్డు సభ్యుడితోపాటు, ప్రజలపై, ప్రజాప్రతినిధులపైనా బాధ్యతనుంచిందన్నారు. కచ్చితంగా వార్డు, గ్రామంకోసం పనిచేయాలని, మొక్కలు పెంచాలని, పరిశుభ్రత పాటించేలా చూడాలని, నీళ్లు వస్తున్నయా, లేదా అన్న విషయాలపై రోజూవారీ మానిటరింగ్ ఉండేలా చట్టాలుతీసుకొచ్చామన్నారు. ఇటీవల నిర్వహించిన పల్లెప్రగతిలో గణనీయమైన ప్రగతిని సాధించామని వివరించారు.

### 300 గ్రామాలకు సామూహిక శ్మశానవాటిక

1986లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మూడు రాష్ట్రాల్లో మూడు గ్రామాలను సందర్శించానని సీఎం కేసీఆర్ గుర్తుచేసుకొన్నారు. నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌కు వెళ్లి వారితో రోజంతా ఉండి వ్యవసాయంపై సిద్దిపేట రైతులకు శిక్షణ ఇప్పించానని తెలిపారు. ఆ తర్వాత సినీగాయని లతా మంగేష్కర్ గ్రామం బందార్కర్, అన్నాహజారే గ్రామం మాలేగావ్‌కు వెళ్లామని, ఆ తర్వాత మహారాష్ట్రలోని ఓ ప్రాంతంలో సుమారు 300 గ్రామాలకు ఒకేచోట సామూహిక శ్మశానవాటికలను నిర్మించారని, ఆ నిర్మాణాలు ఎంతో ఆకట్టుకొన్నాయని వెల్లడించారు. ఈ విధమైన మార్పు అన్ని రాష్ట్రాల్లోనూ రావాలన్నారు. చనిపోయిన వాళ్లను సంస్కారంతో పంపించాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని ప్రతిగ్రామంలో శ్మశానవాటికలు నిర్మిస్తున్నామని తెలిపారు. పరిశుభ్రతకు డంపింగ్ యార్డులు, మొక్కల పెంపకానికి నర్సరీలు ఏర్పాటు చేశామని, ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్లను కూడా ఇచ్చామన్నారు. జూనియర్ పంచాయతీ అధికారుల నుంచి డీపీవో, ఎంపీవో, జెడ్పీ సీఈవో వరకు పోస్టులన్నీ భర్తీ చేశామని వివరించారు. గ్రామాల్లో అత్యవసర పనులకోసం కూడా కలెక్టర్ల దగ్గర రూ.కోటి పెట్టినట్టు చెప్పారు. నాటిన మొక్కల్లో 86 శాతం బతికాయన్నారు.

### దయాకర్‌రావు నంబర్‌వన్

**ఈ** మధ్య చేసిన ఇంటర్నల్ సర్వేల్లో పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నంబర్‌వన్‌గా ఉన్నారని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారు. పనిచేస్తుంటే ప్రశంసలు వస్తుంటాయని, ఎర్రబెల్లి పనితీరు బాగున్నదని, తన శాఖ ఉద్యోగులతో మంచిగా పనిచేస్తున్నారని అభినందించారు. పల్లెప్రగతిలో చాలా మందిని భాగస్వామ్యం చేయించారని, అందుకే ప్రగతి కార్యక్రమం సక్సెస్ అయిందని చెప్పారు. మంత్రి ఎర్రబెల్లిని, ఆయన శాఖ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు సీఎం చెప్పారు.

### చిన్న పంచాయతీకీ రూ.5 లక్షలు

'రాష్ట్రంలోని శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి ఆగకూడదు. ప్రతిపల్లే పరిశుభ్రంగా ఉండాలని కొత్త గ్రామాలను ఏర్పాటుచేసుకున్నాం. కొన్ని గ్రామాల్లో ఐదొందల కంటే తక్కువ జనాభా ఉన్నది. ఆ గ్రామాలకు కూడా కనీసం రూ.5లక్షలకు తక్కువ కాకుండా ప్రతియేడు నిధులు రావాలి. ఆ విధంగా చర్యలు తీసుకోవాలి' అంటూ సీఎం కేసీఆర్ శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. దాన్ని అమల్లోకి తీసుకువస్తూ పంచాయతీరాజ్‌శాఖ సాయంత్రానికే జీవో విడుదల చేసింది.

### కరోనా అయినా గజ్జున వణకాలె

ఎక్కడెక్కడో ఏవేవో వ్యాధులు, అంటురోగాలు వస్తున్నాయని, కానీ తెలంగాణకు కరోనా అయినా ఎలాంటి అంటురోగమైనా రావాలంటే రోగాలే గజ్జున వణకాలె అని సీఎం కేసీఆర్ అన్నారు. గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని, ఏ రోగాలు దరికి రావని చెప్పారు. ప్రజాప్రతినిధులకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని, పల్లె, పట్టణప్రగతిపై ప్రత్యేక దృషి పెట్టాలని విజ్ఞప్తిచేశారు. కలెక్టర్లు. డీపీవోలు గ్రామాల్లో పల్లె నిద్రలు చేయాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ఎస్డీఎఫ్ నుంచి నిధులు అత్యవసరంగా మంజూరుచేస్తానని ప్రకటించారు. దీనికోసం రూ.3,500 కోట్లు ఉన్నాయని సీఎం చెప్పారు.

### ఏజెన్సీ ప్రాంతాలపై నిర్ణయం తీసుకొంటాం

నోటిఫై (ఏజెన్సీ) ప్రాంతాల్లో సాంకేతికమైన ఇబ్బందులతో ఎన్నికలు జరుగలేదని, ఆ ప్రాంతాల్లో పల్లె, పట్టణప్రగతి జరుగలేదని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకొంటామని సీఎం కేసీఆర్ వెల్లడించారు. భద్రాచలంలో ఎన్నికలు లేవని, పల్లెప్రగతి జరుగలేదని ఎమ్మెల్యే పొదెం వీరయ్య చెప్పడంతో సీఎం కేసీఆర్ పలుఅంశాలను వెల్లడించారు. గవర్నర్ సిఫారసుతో మణుగూరు, మందమర్రి, ఆసిఫాబాద్, భద్రాచలం, సారపాకపై నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి పంపించామని చెప్పారు. అయినప్పటికీ.. ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా లేదా ఐటీడీఏ నుంచి నిధులు ఇచ్చేందుకు త్వరలో నిర్ణయిస్తామన్నారు.

### పంచాయతీ నిధుల నుంచి జీతాలు ఇవ్వరాదు

కొన్ని ప్రాంతాల్లో పంచాయతీల నిధుల నుంచి మండల పరిషత్తులో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, బోర్‌వెల్ ఇంచార్జిలకు వేతనాలిస్తున్నారని.. సీఎల్పీ నేత భట్టి అనటంపై స్పందించిన సీఎం కేసీఆర్.. రాష్ట్రంలో అలాంటి పరిస్థితి లేదని, ఒకవేళ ఉంటే దృష్టికి తీసుకురావాలన్నారు. పంచాయతీ నిధుల నుంచి జీతాలు ఇవ్వరాదని స్పష్టంచేశారు. చిరుద్యోగుల వేతనాలను పెంచిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని, ఎక్కడ పనిచేస్తున్నారో అక్కడినుంచే వేతనాలు తీసుకోవాలని చెప్పారు. నరేగా నుంచి గ్రామ పంచాయతీల్లో వివిధ పనుల కోసం రూ.4 వేల కోట్లు వినియోగించుకొనే అవకాశం ఉన్నదని సూచించారు.

## మీ స్ఫూర్తికి వందనం..

**వర్ధన్నపేట** నియోజకవర్గంలోని దమ్మన్నపేటకు చెందిన కాంట్రాక్టర్ కామిడి నర్సింహారెడ్డి తన గ్రామాభివృద్ధి కోసం రూ.25 కోట్లు విరాళం ఇచ్చారని.. ఆయనను సభికులంతా అభినందించాలని సీఎం కేసీఆర్ సూచించారు. హుస్నాబాద్ నియోజవర్గంలోని గట్ల నర్సింగాపూర్‌కు చెందిన భాస్కర్‌రావు రూ.3 కోట్లు, నల్లగొండ నియోజకవర్గంలో కంచర్ల కృష్ణారెడ్డి గ్రామాభివృద్ధికి రూ.కోటి విరాళాలు ఇచ్చారని, నర్సంపేట నియోజకవర్గం నల్లబెల్లి మండలంలో దాతలు ఉచితంగా ట్రాక్టర్లు అందజేశారని, కాపులకనపర్తికి చెందిన ఉద్యోగులంతా వారి గ్రామం కోసం అర్నెళ్ల జీతాన్ని విరాళంగా ఇచ్చారన్నారు. గజ్వేల్ నియోజకవర్గం మల్క్యాపూర్, పరకాల నియోజకవర్గం గీసుకొండ మండలం మరియాపూర్, యాదాద్రి భువనగిరిలో పాఠశాలల స్వరూపాన్నే మార్చేసిన వైనం.. పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాల్లో ఇంటింటికీ ఇంకుడు గుంతల ఏర్పాటు, జగిత్యాల జిల్లా హిమ్మత్‌రావుపేటలో కోతుల కోసం ఫుడ్‌కోర్టుతోపాటు పలు గ్రామాల్లో దాతలు విరాళాలు అందజేశారని చెప్పారు. ప్రజలు రోజుల తరబడి స్వచ్ఛందంగా శ్రమదానంలో పాల్గొనడం వారిలో వస్తున్న సానుకూల ధోరణికి నిదర్శనమని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. 'ఈ దాతలందరికీ నేను చేతులెత్తి రాష్ట్ర ప్రజలందరీ పక్షాన దండం పెట్టి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నా.. మీరిచ్చే డబ్బు కంటే మీరిచ్చిన స్ఫూర్తి ఎంతో గొప్పది. అది మనందరినీ ముందుకు తీసుకెళ్తుంది' అని సీఎం కేసీఆర్ అన్నారు.



టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా అసెంబ్లీలో నామినేషన్ దాఖలుచేస్తున్న కేఆర్ సురేశ్‌రెడ్డి. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, బాజిరెడ్డి గోవర్ధన్, బలాల



టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా అసెంబ్లీలో నామినేషన్ దాఖలుచేస్తున్న కే కేశవరావు. చిత్రంలో మంత్రులు ఈటల, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

## కేకే, సురేశ్‌రెడ్డి ఎన్నిక లాంఛనమే!

**రాజ్యసభకు నామినేషన్ వేసిన టీఆర్ఎస్ అభ్యర్థులు**

**16న నామినేషన్ పత్రాల పరిశీలన.. 18న అధికారిక ప్రకటన**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులుగా కే కేశవరావు, కేఆర్ సురేశ్‌రెడ్డి నామినేషన్లు దాఖలుచేశారు. శుక్రవారం అసెంబ్లీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహాచార్యులుకు వారు రెండుసెట్ల చొప్పున నామినేషన్ పత్రాలు అందజేశారు. కేకే నామినేషన్ పత్రాలపై మంత్రులు కే తారకరామారావు, ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్, పలువురు ఎమ్మెల్యేలు సంతకాలుచేశారు. సురేశ్‌రెడ్డి నామినేషన్‌పత్రాలపై మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్, పలువురు ఎమ్మెల్యేలు సంతకాలుచేశారు. నామినేషన్ల దాఖలుకుముందు కేకే, సురేశ్‌రెడ్డి.. ఎంపీ సంతోష్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో కలిసి గన్‌పార్క్ అమరవీరుల స్థూపంవద్ద నివాళి అర్పించారు. ఈ నెల 16న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. శాసనసభలో టీఆర్ఎస్‌కు పూర్తి మెజారిటీ ఉండటంతో వీరి ఎన్నిక లాంఛనమే. ఈ నెల 18న వారి ఎన్నికను ప్రకటించనున్నారు. కేకే, సురేశ్‌రెడ్డిని మాజీ ఎంపీ కవిత అసెంబ్లీ ఆవరణలో కలిసి అభినందించారు. నామినేషన్ అనంతరం ఎంపీలు సంతోష్, బండ ప్రకాశ్, బడుగుల లింగయ్యతోపాటు రాజ్యసభ అభ్యర్థులు సీఎం కేసీఆర్‌ను కలిశారు. పెద్దలసభలో రాష్ట్రవాణిని బలంగా వినిపించాలని కేసీఆర్ ఈ సందర్భంగా వారికి సూచించారు.

## డ్రోన్ ప్రయోగం రాజకీయకుట్ర

**పక్కా ఆధారాలతోనే రేవంత్‌పై కేసు: లోక్‌సభలో నామా**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిబంధనలను తుంగలోతొక్కిన కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి రాజకీయ కుట్రతో మంత్రి కేటీఆర్ ఫాంహౌజ్‌పై డ్రోన్ కెమెరాను ప్రయోగించారని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వరరావు ఆరోపించారు. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్‌కు విరుద్ధంగా వ్యవహరించి ప్రైవేట్ ఆస్తిపై డ్రోన్‌ను ప్రయోగించినందుకే ఆయనపై చట్టపరంగా కేసులు నమోదు చేశారని తెలిపారు. గురువారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యుడు రేవంత్‌రెడ్డి అరెస్ట్ అంశాన్ని లేవనెత్తడంతో నామా తీవ్రంగా స్పందించారు. రేవంత్ ఎంపీగా తన బాధ్యతను విస్మరించి ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులు, స్థలాల్లోకి అక్రమంగా ప్రవేశించి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్‌ను ఉల్లంఘించి డ్రోన్‌తో చిత్రీకరించడం సమంజసమా అని ప్రశ్నించారు. దీనిపై నార్సింగి ఠాణాలో కేసు నమోదైందని తెలిపారు. కేసులో ఏ1గా ఉన్న రేవంత్‌రెడ్డిపై కీలక ఆధారాలున్నాయని, పూర్తి ఆధా రాలతోనే కేసు నమోదుచేశారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు మరింత పెంచాలని నిధుల అంశంపై చర్చలో నామా కోరారు. ఆయా వర్గాలకు కేంద్రం రూ.10వేల కోట్లు కేటాయిస్తే, తెలంగాణ రూ.1,600 కోట్లు కేటాయించిందన్నారు.

### లోకం పోకడ




### ముహూర్తం

సూర్యోదయం: 6.24 గంటలకు

సూర్యాస్తమయం: 6.19 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం పంచమి ఉదయం 6.18 వరకు, తదుపరి షష్ఠి ఆదివారం తె. ఝా 4.26 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: విశాఖ మధ్యాహ్నం 12.21 వరకు, తదుపరి అనురాధ, అమృత ఘుడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 9.23 నుంచి 10.53 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.24 నుంచి 7.59 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.11 నుంచి 5.42 వరకు.

# మన పల్లెలు దేశానికి ఆదర్శం

**దశలవారీగా గ్రామవికాసం • ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి • పటిష్ఠ గ్రామీణ ఆర్థికవ్యవస్థ**

**ప్రజల జీవన ప్రమాణాల పెంపు, పల్లెప్రగతి కార్యక్రమం, లక్ష్యాలపై అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటన**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పల్లెప్రగతి కార్యక్రమం వల్ల గ్రామగ్రామాన అద్భుతమైన ప్రగతి కనిపిస్తున్నదని సీఎం కే చంద్రశేఖర్‌రావు అన్నారు. పల్లెప్రగతి నిరంతర కార్యక్రమమని చెప్పారు. శుక్రవారం అసెంబ్లీలో పల్లెప్రగతికి సంబంధించి సీఎం కేసీఆర్ ప్రకటన ఇచ్చారు. తెలంగాణ గ్రామాలు దేశంలోనే ఆదర్శంగా రూపుదిద్దుకోవాలనే సదుద్దేశంతో ప్రభుత్వం సమగ్ర గ్రామీణ విధానం అమలు చేస్తున్నదని చెప్పారు. పల్లెల్లో పచ్చదనం.. పరిశుభ్రతతోపాటు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం ప్రకటన ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.. రాష్ట్ర గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చడానికి ప్రభు త్వం ఇప్పటికే అనేక చర్యలు తీసుకొన్నది. ఇందులో భాగంగా రెండు విడుతలుగా పల్లెప్రగతి ప్రత్యేక అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించింది. గ్రామాల వికాసానికి ప్రభుత్వం దశలవారీగా ప్రయత్నం చేస్తున్నది. మొదటిదశలో పల్లె ప్రజలకు జీవనభద్రత కల్పించడం, నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించడం, మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగుచేయడం, చేతి, కులవృత్తులకు చేయూతనివ్వడం ద్వారా గ్రామీణ ఆర్థికవ్యవస్థను పటిష్ఠం చేయడం, రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి రైతుసంక్షేమ పథకాలు, ఆసరా పింఛన్ల లాంటి ప్రజాసంక్షేమ పథకాల ద్వారా గ్రామీణప్రజలకు భవిష్యత్తుపై ఆశావహ దృక్పథాన్ని కల్పించింది. మిషన్ భగీరథ, 24 గంటల కరంట్, రోడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలాంటి మౌలిక వసతుల కల్పనతో ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి కృషిచేసింది.

### పంచాయతీరాజ్ బలోపేతానికి చర్యలు

తెలంగాణ గ్రామీణ ముఖచిత్రం మారాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సంస్కరణలు అమలుచేసింది.



శుక్రవారం అసెంబ్లీలో పల్లెప్రగతి కార్యక్రమం, లక్ష్యాలపై ప్రకటన చేస్తున్న సీఎం కేసీఆర్

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ఆశాఖ స్వరూపాన్నే మార్చేసింది. రాష్ట్రంలో 8,690 గ్రామపంచాయతీలు ఉంటే వాటి సంఖ్యను 12,751కి పెంచింది. గిరిజనులు, ఆదివాసీలు ఎప్పట్నుంచో కోరుతున్నవిధంగా ఎస్టీ ప్రాంతాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటుచేసింది. దీనివల్ల రాష్ట్రంలో 3,146 గ్రామాల్లో ఎస్టీలు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. డీపీవోల సంఖ్యను 9నుంచి 32కు, డీఎల్పీవోలను 28 నుంచి 68కి, మండల పంచాయతీ అధికారులను 438 నుంచి 539కి ప్రభుత్వం పెంచింది. గతంలో 3,396 మంది గ్రామ కార్యదర్శులుండే వారు. ప్రతి గ్రామానికి కచ్చితంగా ఒక గ్రామ కార్యదర్శి ఉండాలన్న ఉద్దేశంతో ఒకేసారి 9,355 మందిని నియమించింది. పంచాయతీ సిబ్బంది వేతనాలు రూ.8,500కు పెంచింది. వారికి రూ.2 లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది.

### కొత్త పంచాయతీరాజ్‌చట్టం

గ్రామాభివృద్ధిలో పంచాయతీల పాత్రను ప్రభుత్వం క్రియాశీలం చేసింది. అధికారులు, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, కర్తవ్యాలను స్పష్టంగా పేర్కొంటూ కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తెచ్చింది. కొత్త చట్టంద్వారా ఎవరి గ్రామాన్ని వారు గొప్పగా తీర్చిదిద్దుకొనేందుకు వార్షిక, పంచవర్ష ప్రణాళికలు రూపొందించుకొనే కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించింది. నిధుల వినియోగంలో పారదర్శకత పాటించడానికి చర్యలు తీసుకుంటున్నది. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలకు కూడా చట్టంలో కఠిన నిబంధనలు పొందుపరచడంద్వారా పరిపాలనలో జవాబుదారీతనాన్ని పెంచింది.

### 'పల్లెప్రగతి' సాధించిన విజయాలు

**ప్రజలు** సంఘటితంగా ఉండి గ్రామాలను తీర్చిదిద్దుకొనే ఒరవడి అలవాటుకావడానికి రాష్ట్రంలో రెండు విడుతలుగా.. గత ఏడాది సెప్టెంబర్ 6 నుంచి అక్టోబర్ 5 వరకు 30 రోజులు, ఈ ఏడాది జనవరి 2 నుంచి 12 వరకు పదిరోజులు పల్లెప్రగతి కార్యక్రమం జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, శ్రమదానం చేసి గ్రామా ల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచే పనుల్లో భాగస్వాములయ్యారు. ఏ ఊరికి ఆ ఊరిప్రజలు తమ గ్రామ అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యాలు నిర్ణయించుకుని వార్షిక, పంచవర్ష ప్రణాళికలు, హరిత ప్రణాళిక తయారుచేసుకున్నారు. పారిశుద్ధ్యపనులు నిర్వహించారు.

### ప్రతి గ్రామానికి వైకుంఠధామం

**దేశంలో** మరెక్కడాలేని విధంగా ప్రతి గ్రామానికి వైకుంఠధామం, నర్సరీ, డంప్‌యార్డు, ట్రాక్టర్ ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. పల్లెప్రగతిలో వీటి ఏర్పాటుకు గట్టి ప్రయత్నం జరిగింది. వైకుంఠధామాల నిర్మాణానికి 11,982 గ్రామాల్లో ఇప్పటికే స్థలాల గుర్తింపు జరిగింది. 11,828 గ్రామాల్లో నిర్మాణం ప్రారంభమైంది. మిగతా 154 గ్రామాల్లో త్వరలో వైకుంఠధామాల నిర్మాణం ప్రారంభమవుతుంది. కొద్దిరోజుల్లోనే రాష్ట్రంలోని వందశాంత గ్రామాలు వైకుంఠధామాలు కల్గి ఉంటాయి.

- 12616 గ్రామాల్లో డంప్‌యార్డుల ఏర్పాటుకు స్థలాల గుర్తింపు జరిగింది. 12,124 గ్రామాల్లో నిర్మాణ పనులు మొదలయ్యాయి. 492 గ్రామాల్లో త్వరలోనే స్థలాలు గుర్తిస్తారు. ప్రతిఇంటినుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, దాన్ని డంప్‌యార్డుకు తరలించి ఆ చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- 12738 గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు పూర్తయింది. మిగిలిన 13 గ్రామాలు వివిధ సాగునీటి ప్రాజెక్టులకింద ముంపునకు గురవుతున్నందున అక్కడ నర్సరీలు ఏర్పాటుచేయలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో 10.90 కోట్ల మొక్కలు నాటి 86% సంరక్షించడం జరిగింది. పల్లెల్లో పచ్చదనం పెంచడానికి ఈ ఏడాది రూ.237 కోట్లు ఖర్చయింది. గ్రామబడ్జెట్‌లో 10% పచ్చదనానికి కేటాయించాలన్న నిబంధన వల్ల 2020-21లో రూ.369 కోట్లు గ్రీన్ బడ్జెట్‌గా ఏర్పడుతుంది.
- మొక్కలకు నీళ్లుపోయడం, చెత్త సేకరణ కోసం 12,331 గ్రామాల్లో ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. మిగతా 420 గ్రామాలకు త్వరలోనే ట్రాక్టర్లు చేరుకొంటాయి.
- పల్లెప్రగతిలో అన్ని గ్రామాల్లో విద్యుత్ సంబంధ సమస్యలు తొలగిపోయాయి. దేశంలోనే తొలిసారిగా 12,751 గ్రామాల్లో ప్రభుత్వం ప్రజాభాగస్వామ్యంతో నాలుగు స్టాండింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది. వీటిలో 8,20,727 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వ లక్ష్యసాధన దిశగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించేందుకు 45 మంది సీనియర్ అధికారులతో ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశాం.



సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా బొకేలు, శాలువలు, పూలకుండీలకు బదులుగా సీఎం సహాయనిధికి ప్రజలు అందజేసిన విరాళాలు రూ.6,71,396 చెక్కులను శుక్రవారం సీఎం కేసీఆర్‌ను కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అందజేశారు.
- నమస్తే తెలంగాణ, రామంతాపూర్



శుక్రవారం అసెంబ్లీలో సీఎం కే చంద్రశేఖరరావును కలిసి తన కుమారుడి వివాహ ఆహ్వానపత్రికను అందజేస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



సీఎం కే చంద్రశేఖరరావును కలిసి తన తమ్ముడి వివాహ ఆహ్వానపత్రికను అందజేస్తున్న విద్యార్థి నాయకుడు దూదిమెట్ల బాలరాజు

## 150 రోజుల 'ఉపాధి'

■ దివ్యాంగ కూలీలకు ప్రత్యేక పని రోజులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో దివ్యాంగ కూలీలకు ప్రత్యేక పనిరోజులను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. ప్రత్యేక నిబంధనల కింద ఈ నిర్ణయం తీసుకొంటూ పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు శుక్రవారం మార్గదర్శకాలను జారీ చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి దీనిని అమలులోకి తీసుకురానున్నారు. దివ్యాంగ కూలీలకు ఇప్పటివరకు ఉపాధిహామీలో 100 రోజుల పని కల్పిస్తున్నారు. రాష్ట్రంలో ఈ నిబంధనను దివ్యాంగ కూలీల విషయంలో ఎత్తివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. జాబ్‌కార్డు ఉన్న దివ్యాంగుల కుటుంబాలకు 150 రోజుల పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. పని ప్రదేశానికి కనీస దూరంతో సంబంధం లేకుండా 5 కిలోమీటర్ల వరకు రూ.10, ఆపై ఎక్కువ దూరం ఉంటే కూలీ రేటులో 10 శాతం అదనంగా దివ్యాంగ కూలీలకు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది.



## ఒక ఉద్యోగం వదులుకోండి!

■ బేవరేజస్ కార్పొరేషన్‌కు ఎంపికైన వారికి రేపటివరకు గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్‌లో రెండు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఒకటి వదులుకొనేందుకు టీఎస్‌పీఎస్సీ ఆదివారం వరకు గడువు ఇచ్చింది. పూర్తివివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించింది.



విదిశ, గేట్ 4వ ర్యాంకు



దక్ష్ పల్‌మార్, గేట్ 12వ ర్యాంకు

## గేట్ ఫలితాలు విడుదల

■ వరంగల్ నిట్ విద్యార్థులకు 4, 12 ర్యాంకులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గేట్-2020 పరీక్ష ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. ఫలితాలను గేట్ అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టారు. ఎన్‌ఐటీ వరంగల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించారని నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణరావు తెలిపారు. ఇందులో విదిశ (ఎంఎంఈ) 4, దక్ష్ పల్‌మార్ (బయోటెక్) 12, దినేశ్‌రెడ్డి (ఈఈఈ) 66, విష్ణుతేజ (ఈఈఈ) 179, దీపక్ కార్తికేయ (ఎంఎంఈ) 181, వివేక్ శ్రీవాస్తవ (సీఈ) 110, అబ్బాస్ దాస్‌గుప్త (సీఎస్‌ఈ) 22, శశిధర్ గంగవరపు (ఎంఎంఈ) 30వ ర్యాంకులు సాధించారని వెల్లడించారు.

## న్యాక్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు

**మాదాపూర్:** న్యాక్‌లో జీహెచ్‌ఎంసీ చేపట్టే ప్రాజెక్టుల్లో పనిచేసేందుకు 13 మంది అసిస్టెంట్ ఎంటామాలజిస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించనున్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ నిర్వాహకులు కోరారు.

# కొత్తగా ఆరు ఎయిర్‌పోర్టులు

మూడు గ్రీన్‌ఫీల్డ్, మూడు బ్రౌన్‌ఫీల్డ్ ■ త్వరలో వరంగల్ ఎయిర్‌పోర్ట్ సేవలు ■ రాష్ట్రంలో ఐదు ఏరోస్పేస్ పార్కులు ■ ఏరోస్పేస్‌రంగానికి హైదరాబాద్ అనువు

అత్యంతవేగంగా తెలంగాణ అభివృద్ధి ■ వింగ్స్ ఇండియా-2020ప్రారంభోత్సవంలో ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కొత్తగా ఆరు ఎయిర్‌పోర్టులు ఏర్పాటుచేయనున్నట్టు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. అతిత్వరలో వరంగల్ ఎయిర్‌పోర్టు సేవలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. శుక్రవారం వింగ్స్ ఇండియా-2020ను లాంఛనంగా ప్రారంభించిన అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, 2018-19లో 14.9% జీఎస్డీపీ వృద్ధిరేటును నమోదుచేసుకున్నదని తెలిపారు. టీఎస్‌ఐపాస్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ప్రపంచనగరాలపై చేసిన సర్వేలో గత ఐదేండ్లుగా అత్యంత నివాసయోగ్యమైన నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా ఉండటం గర్వకారణమని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న ఆరు కొత్త ఎయిర్‌పోర్టులలో నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం, మహబూబ్‌నగర్ జిల్లా గుడిబండలో గ్రీన్‌ఫీల్డ్.. వరంగల్ జిల్లా మామునూరు, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్, ఆదిలాబాద్‌లో బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా టెక్నో ఫీజబిలిటీపై అధ్యయనం చేసి నివేదిక తయారుచేసిందని పేర్కొన్నారు. వరంగల్‌లో పారిశ్రామికంగా, ఐటీ పరంగా అనేక అవకాశాలున్నాయని, ఎయిర్‌పోర్టు సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ సహకారంతో ఇక్కడి విమానాశ్రయాన్ని బీదర్ తరహాలో నిర్వహిస్తామన్నారు. ఉడాన్ స్కీంలో వరంగల్ విమానాశ్రయాన్ని చేర్చాలని కేంద్ర పౌరవిమానయానశాఖ అధికారులను కోరుతామని తెలిపారు. నిర్వహణ, మరమ్మతు, ఓవరాల్ (ఎమ్మార్వో) కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణ అనువైన ప్రాంతమని చెప్పారు. ఇప్పటికే జీఎమ్మార్, ఎయిర్‌ఇండియా ఎమ్మార్వో కేంద్రాలు ఉన్నాయని, వీటిద్వారా తెలంగాణకు మంచి పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. డ్రోన్ టెక్నాలజీని వాడుతున్న రాష్ట్రం తెలంగాణ అని.. వ్యవసాయం, వైద్యం, మైనింగ్‌శాఖల్లో డ్రోన్లను వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో రాష్ట్రం మొదటిస్థానంలో ఉన్నదని చెప్పారు.




వింగ్స్ ఇండియా-2020 ని లాంఛనంగా ప్రారంభించిన ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు, ఏఏఐ చైర్మన్ అర్వింద్‌సింగ్, ఫిక్కీ జాతీయ అధ్యక్షురాలు సంగీతారెడ్డి, ఫిక్కీ సివిల్ ఏవియేషన్ కమిటీ చైర్మన్ ఆనంద్‌స్టాన్లీ తదితరులు ఉన్నారు.

### ఏరోస్పేస్ రంగానికి అనువైన వేదిక

వింగ్స్‌ఇండియా ఏషియాలోనే అతిపెద్ద ఎయిర్‌షో అని మంత్రి కేటీఆర్ అన్నారు. ఏరోస్పేస్, ఏవియేషన్ రంగానికి హైదరాబాద్‌లో అనువైన వాతావరణం ఉన్నదని చెప్పారు. కరోనాతో సదస్సు రద్దయ్యే అవకాశాలున్నప్పటికీ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకొన్నారని ప్రశంసించారు. ఏటీఎఫ్‌పై వ్యాట్‌ను 16 నుంచి 1 శాతానికి తగ్గించామని, ఇది ఏవియేషన్ పరిశ్రమకు ప్రోత్సాహకరంగా ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ ఉత్తమ ఎయిర్‌పోర్ట్‌గా అవార్డు గెలుచుకున్నదని తెలిపారు. లాక్‌హీడ్ మార్టిన్, జీఈ, సఫ్రాన్, రాఫెల్, ఎల్‌బిట్ వంటి విదేశీ కంపెనీలతోపాటు, అదాని, కల్యాణి వంటి దేశీయకంపెనీలు హైదరాబాద్‌లో యూనిట్లను స్థాపించాయని చెప్పారు. టాటా గ్రూప్ 90% ఏరోస్పేస్ ఉత్పత్తులను ఇక్కడే తయారుచేస్తున్నదని అన్నారు. ఏరోస్పేస్ రంగంలో 25 భారీ, వెయ్యి ఎమ్మెస్‌ఎంఈ పరిశ్రమలు నగరంలో ఉన్నాయని తెలిపారు. ఏరోస్పేస్ రంగంకోసం ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కులను ఏర్పాటుచేశామని, 50 జనరల్ ఇంజినీరింగ్ పార్కుల్లో ప్రిసిషన్ ఇండస్ట్రీ, ఆదిభట్ల ఏరోస్పేస్ సెజ్, నాదర్‌గుల్, జీఎమ్మార్ ఏరోస్పేస్ పార్క్, అదానీ ఏరోస్పేస్ పార్క్, రెండు హార్డ్‌వేర్‌పార్క్‌లను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎగ్జిబిటర్ డైరెక్టరీ, నాలెడ్జ్ పేపర్‌ను మంత్రి కేటీఆర్ విడుదల చేశారు.

#### తెలంగాణ సేవలకు అవార్డు

వింగ్స్ ఇండియా-2020 సందర్భంగా శుక్రవారం హోటల్ తాజ్‌కృష్ణాలో పౌర విమానయానరంగంలో అందించిన సేవలకు అవార్డులను మంత్రి కేటీఆర్ అందజేశారు. ఏరోస్పేస్ రంగంలో చేస్తున్న కృషికి తెలంగాణ రాష్ట్రం స్పెషల్ క్యాటగిరీ అవార్డు దక్కించుకున్నది.

### మౌలిక సదుపాయాల విస్తరణకు విదేశీ రుణాలు

#### ఏఏఐ చైర్మన్ అర్వింద్ సింగ్

దేశంలో వైమానికరంగంలో మౌలిక సదుపాయాల విస్తరణ కోసం వచ్చే ఆర్థిక సంవత్సరంలో 300 మిలియన్ డాలర్ల విదేశీ రుణాలు (ఈసీబీ) తీసుకోనున్నట్టు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చైర్మన్ అర్వింద్‌సింగ్ వెల్లడించారు. ప్రస్తుతం దేశంలోని వైమానికరంగానికి ఏటా 34.5 కోట్ల మంది ప్రయాణికులకు సరిపోయే నిర్వహణ సామర్థ్యం ఉన్నదని.. దీనిని రెట్టింపు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఫిక్కీ సివిల్ ఏవియేషన్ కమిటీ చైర్మన్ ఆనంద్ స్టాన్లీ మాట్లాడుతూ.. యూరప్‌లోని అనేక దేశాల కంటే తెలంగాణ జీడీపీ ఎంతో ఎక్కువగా ఉంటుందని తెలిపారు. తెలంగాణ ప్రగతిశీల రాష్ట్రంగా అభివర్ణించారు. కార్యక్రమంలో పుదుచ్చేరి పర్యాటక, పీడబ్ల్యూడీశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు, కేంద్ర పౌరవిమానయానశాఖ కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఖరోలా, ఫిక్కీ జాతీయ అధ్యక్షురాలు సంగీతారెడ్డి, కేంద్ర పౌరవిమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉష పాది తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 3 నుంచి 78 ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రద్దీ నేపథ్యంలో సికింద్రాబాద్- చెన్నై సెంట్రల్ మధ్య 52, విల్లుపురం- సికింద్రాబాద్ మధ్య 26 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ప్రకటించింది. ఈ రైళ్లు ఏప్రిల్ 3 నుంచి జూన్ చివరివారం వరకు నడుస్తాయని పేర్కొన్నది. నిర్వహణపరమైన కారణాలతో బోధన్-మహబూబ్‌నగర్ ప్యాసింజర్ 16 నుంచి ఏప్రిల్ 15 వరకు షాద్‌నగర్- మహబూబ్‌నగర్ మధ్య పాక్షికంగా రద్దుచేస్తున్నట్టు తెలిపింది.

## మోడల్‌స్కూల్ ప్రవేశాలకు 1.02 లక్షల దరఖాస్తులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కొనసాగుతున్న 194 మోడల్ స్కూళ్లలో 2020-21 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు కోరుతూ 1,02, 270 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకొన్నారు. 6వ తరగతి 54,640 మంది, 7-10 వరకు 47,630 మంది దరఖాస్తు చేసుకొన్నారని మోడల్‌స్కూల్ సొసైటీ డైరెక్టర్ ఏ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్19న నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నామని చెప్పారు.

## ఏప్రిల్ 14న సీఏఏ వ్యతిరేకసభ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌కు వ్యతిరేకంగా, అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14న బహిరంగసభ, ప్రదర్శన నిర్వహించాలని వివిధ రాజకీయ పక్షాలు పిలుపునిచ్చాయి. హిమాయత్‌నగర్‌లోని మఖ్దూంభవన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం సీఏఏకు వ్యతిరేకంగా చేసిన ప్రకటనలు ఆచరణలోకి తెచ్చేందుకు శాసనసభ, మండలి అధ్యక్షులను కలిసి వినతిపత్రాలను ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్, కోదండరాం, చాడ వెంకటరెడ్డి, తమ్మినేని వీరభద్రం, గోవర్ధన్, అజీజ్‌పాషా, ప్రొఫెసర్ విశ్వేశ్వర్, విమలక్క పాల్గొన్నారు.



సమన్వయ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అదనపు డీజీ జితేందర్, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా తదితరులు

## రోడ్డుప్రమాదాల నివారణపై దృష్టి

■ పంచాయతీరాజ్‌శాఖతో పోలీసుల సమన్వయ సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో రోడ్డుప్రమాదాల నివారణపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టిపెట్టింది. ప్రమాదాల నియంత్రణలో భాగస్వాములైన అన్నిశాఖలతో సమన్వయ సమావేశాలను నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా శుక్రవారం డీజీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అడిషనల్ డీజీ జితేందర్, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, అదనపు డీజీ సందీప్‌శాండిల్య, నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డి పాల్గొన్నారు. ప్రమాదాల్లోనూ మూడోవంతు పంచాయతీరాజ్ రోడ్లపైనే జరుగుతున్నాయని గుర్తించారు. ప్రమాదాలు జరిగే స్థలాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై రెండు విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని నిర్ణయించారు.

# పిగ్ బ్రీడింగ్ పాలసీ అవసరం

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను కోరిన కెనడా, తెలంగాణ ప్రతినిధులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం పిగ్ బ్రీడింగ్ పాలసీని రూపొందించేలా చర్యలు తీసుకోవాలని కెనడా, తెలంగాణ ప్రతినిధులు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్‌ను కోరారు. కెనడాకు చెందిన పోలార్ జెనెటిక్స్ అధ్యక్షుడు అల్ఫ్రెడ్ వాల్, తెలంగాణ రాష్ట్ర సౌజన్య ఫార్మ్స్ అధినేత సాగర్ శుక్రవారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పిగ్ ఫార్మింగ్‌కు తెలంగాణ ఎంతో అనువైన ప్రదేశమని చెప్పారు. ఫార్మింగ్ చేపట్టి వాటి మాంసాన్ని ఎగుమతి చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. పిగ్ బ్రీడింగ్ పాలసీని ఖరారుచేసి కేంద్రానికి పంపేలా చర్యలు తీసుకోవాలని కెనడా, తెలంగాణ ప్రతినిధులు వినోద్‌కుమార్‌ను కోరారు. దీనిపై స్పందించిన వినోద్‌కుమార్.. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాశారు. సత్వరమే పిగ్ బ్రీడింగ్ పాలసీని రూపొందించాలని సూచించారు.



ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్‌తో సమావేశమైన కెనడాలోని పోలార్ జెనెటిక్స్ అధ్యక్షుడు అల్ఫ్రెడ్ వాల్, తెలంగాణ సౌజన్య ఫార్మ్స్ అధినేత సాగర్

## ఇద్దరు ఏఈవోలపై వేటు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కందుల కొనుగోళ్లకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన జరుపకుండా పంట ధ్రువీకరణపత్రాలు ఇచ్చిన ఇద్దరు వ్యవసాయ విస్తరణాధికారులపై సస్పెన్షన్ వేటుపడింది. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు జరిపి చేసిన సూచనల మేరకు సూర్యాపేట జిల్లా చివ్వెంల ఏఈవో సాయిప్రసాద్, నల్లగొండ జిల్లా జీకే అన్నారం ఏఈవో మౌనికను సస్పెండ్ చేయాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు.

### 'క్లోరాంత్రనిలిప్రోల్'పై నిషేధం

వ్యవసాయశాఖ నుంచి మార్కెటింగ్ అనుమతి లేకుండా మెసర్స్ ఎఫ్‌ఎంసీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ విక్రయిస్తున్న క్లోరాంత్రనిలిప్రోల్ 18.5శాతం పురుగుమందును వ్యవసాయశాఖ నిషేధించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. ఈ పురుగుమందుకు రాష్ట్రంలో ఆరునెలల మార్కెటింగ్ అనుమతులను సస్పెండ్‌చేశారు.

## 'దోస్త్'లో మరింత పారదర్శకత

■ ఫీజు చెల్లింపునకు గూగుల్ పే, పేటీఎం, యూపీఐ

■ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న అధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను మరింత పారదర్శకంగా నిర్వహించడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొనేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విధానంతో దోస్త్-2020 ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇకపై దోస్త్ రిజిస్ట్రేషన్‌తోపాటు అన్ని ఫీజులను క్రెడిట్, డెబిట్ కార్డులతో గూగుల్‌పే, పేటీఎం, యూపీఐ ద్వారా చెల్లించే వెసులుబాటును కల్పించనున్నారు. అదేవిధంగా ప్రవేశాల సమాచారాన్ని ఎస్సెమ్మెస్, ఈమెయిల్‌తోపాటు వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల నుంచి కూడా అందించాలని నిర్ణయించారు. దోస్త్ ప్రవేశాలలో తొలిసారి యాజమాన్యకోటా విధానం అమలుకు చర్యలు తీసుకొంటున్నారు. కన్వీనర్ కోటా కింద 70 శాతం, యాజమాన్యకోటా కింద 30 శాతం సీట్లు కేటాయించారు. డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలపై విద్యార్థులకు ఎలాంటి సందేహాలు తలెత్తినా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగిస్తున్నట్టు దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి చెప్పారు. ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల సమాచారాన్ని చేర్చి.. విద్యార్థులు, ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొంటామన్నారు. గ్రామీణ డిగ్రీ కాలేజీలు మాత్రం 100 శాతం సీట్లు కన్వీనర్ ద్వారా భర్తీ చేసుకోవడానికి సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తున్నది.





నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల ప్రాంతంలో నూతనంగా నిర్మించిన హరిత టూరిజం తదితర విషయాలను శుక్రవారం పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. నల్లమల ప్రాంతంలోని మన్ననూర్, ఈగలపెంట, ఉమామహేశ్వరాలయంలో దాదాపు రూ.50 కోట్లతో రిసార్ట్‌లు నిర్మించి ఇటీవల ప్రారంభించిన ఫొటోలను చూపించి వాటి గురించి వివరించారు. నల్లమల ప్రాంత అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న సీఎం కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

- అచ్చంపేట, నమస్తే తెలంగాణ

# దశలవారీగా గ్రామాల అభివృద్ధి

- శాసనమండలిలో పల్లెప్రగతిపై స్వల్పకాలిక చర్చ
- సమాధానమిచ్చిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నదని, పల్లెప్రగతి కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. శుక్రవారం శాసనమండలిలో పల్లెప్రగతిపై స్వల్పకాలిక చర్చకు ఆయన సమాధానమిస్తూ.. పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరియాలని, గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పల్లెప్రగతి కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ రూపొందించి, అమలుచేస్తున్నారని చెప్పారు. పల్లెప్రగతిపై నివేదికను మండలికి సమర్పించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 12,616 గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటుచేశామని, మిగిలిన 491 గ్రామాల్లో త్వరలోనే స్థలాలు సేకరించి నిర్మిస్తామని తెలిపారు. 2020-21లో గ్రామాల్లో 23.54 కోట్ల మొక్కలను నాటుతామని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ఎన్నారైలు, పూర్వ విద్యార్థులు, దాతల నుంచి విరాళాలు సేకరించాలన్నారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి స్పందిస్తూ.. గ్రామాల్లో ఇంకుడుగుంతలు ఏర్పాటుచేయాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యాలయాల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ట్రాక్టర్ల కొనుగోలు సమయంలో అన్ని పేపర్లు ఉండాలని, డ్రైవర్లకు లైసెన్స్‌లు కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పల్లెప్రగతి బాగుందని, పల్లెలకు వెళ్లే దారుల్లో కంప, చెట్లను తొలగించే ప్రయత్నంచేస్తే మంచిదన్న అభిప్రాయాన్ని సభ తరఫున మంత్రికి విజ్ఞప్తిచేశారు. విప్ కర్నె ప్రభాకర్, సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, జాఫ్రీ, జీవన్‌రెడ్డి, రాచందర్‌రావు మాట్లాడారు.





## కుదుటపడుతున్న ఆర్టీసీ

- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మూడు నెలలుగా అమలుచేస్తున్న సంస్కరణల వల్ల టీఎస్ఆర్టీసీ కుదుటపడుతున్నదని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యే అబ్రహం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. గతంలోనెలకు రూ.11కోట్లుగా ఉన్న ఆ దాయం ప్రస్తుతం రూ.12.5 కోట్లకు పెరిగిందని వెల్లడించారు. నిర్వహణ వ్యయాన్ని తగ్గించడానికి ఆర్టీసీలో 1,334 అద్దెబస్సులను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు.

## 1685 మందికి ఓవర్సీస్ స్కాలర్‌షిప్

- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



ముఖ్యమంత్రి విదేశీ ఉపకార వేతన పథకం కింద 1,685 మంది మైనార్టీ విద్యార్థులు లబ్ధిపొందినట్టు సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఎమ్మెల్యేలు షకీల్, డాక్టర్ మెతుకు ఆనంద్, స్టీఫెన్‌సన్ ఎల్విస్, కౌసర్ మొయినుద్దీన్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. షెడ్యూల్ కులాలు, మైనార్టీ సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.

## నల్లమలలో పగటిపూట సఫారీ

- పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నల్లమల అటవీప్రాంతాన్ని పర్యావరణ, పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాటేజీలు నిర్మించినట్టు పర్యాటకశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. పగటిపూట సఫారీపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకొంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. కేంద్రం స్వదేశ్ దర్శన్ పథకం కింద అచ్చంపేటలో అభివృద్ధికి రూ.56.84కోట్లు ఇచ్చిందన్నారు.

## 18,501 మందికి శిక్షణ

- కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి



రాష్ట్రంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద మొత్తం 18,501 మంది యువతకు శిక్షణ ఇచ్చినట్టు కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. మొత్తం శిక్షణ పొందినవారిలో 5,964 మందికి ఉపాధి కల్పించినట్టు పేర్కొన్నారు. ఈ పథకం కింద రూ.22.94 కోట్లు వ్యయంచేసినట్టు వెల్లడించారు.

# కేంద్రం నుంచి కోతలే

- ప్రత్యేకంగా నిధుల కేటాయింపుల్లేవు
- విద్యాశాఖకు ఇతరశాఖల నిధులు
- పీఆర్సీపై త్వరలో సీఎం కేసీఆర్ నిర్ణయం
- శాసనమండలిలో మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రానికి వచ్చేవాటిలో మినహాయింపులు, రద్దు వంటివాటిని వెంటనే అమలుచేస్తున్న కేంద్రప్రభుత్వం.. నిధుల విషయంలో మాత్రం తాత్సారం చేస్తున్నదని ఆర్థికమంత్రి హరీశ్‌రావు అన్నారు. కేంద్రనుంచి కోతలు తప్ప.. నిధులు రావడం లేదని తెలిపారు. బడ్జెట్ సమావేశంలో భాగంగా మండలిలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు శుక్రవారం మంత్రి హరీశ్‌రావు సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించామని, ఆర్థికమాంద్యాన్ని అధిగమించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్నదన్నారు. బడ్జెట్‌పై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తుంటే..ప్రతిపక్షాలకు మాత్రం నిరాశాజనకంగా కన్పిస్తున్నదని విమర్శించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధుల్లో కోత పెడుతున్నదని, ఫిబ్రవరి నెలకు సంబంధించిన జీఎస్టీ బకాయిలు రూ.9,033 కోట్లు రావాల్సి ఉన్నదన్నారు. రాష్ట్ర అప్పులను జీఎస్డీపీని దృష్టిలోపెట్టుకొని చూడాలని సూచించారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధి 21.3 శాతానికి లోబడే అప్పులు తీసుకున్నామన్నారు. ఢిల్లీ తరహాలో రాష్ట్రంలో పాఠశాలల అభివృద్ధి చేయాలనేది సీఎం కేసీఆర్ యోచిస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీల నిధులను పాఠశాలల అభివృద్ధికి ఖర్చుచేయనున్నట్టు తెలిపారు. విద్యారంగానికి 9.4శాతం నిధులు కేటాయించారనడంలో వాస్తవం లేదని, అనేక శాఖల నుంచి విద్యారంగానికి బడ్జెట్‌లో 12.4శాతం నిధులు ఖర్చుచేస్తున్నట్టు వివరించారు. తెలంగాణ ఏర్పడ్డాక లక్షా 23వేల మంది కొత్తగా ఉద్యోగాల్లో నియమించినట్టు చెప్పారు. పీఆర్సీపై సీఎం కేసీఆర్ అతి త్వరలో నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. మండల, జిల్లా పరిషత్‌లకు కూడా గ్రామపంచాయతీ తరహాలో నిధులు కేటాయిస్తామని.. 15వ ఆర్థికసంఘం ఈమేరకు రాష్ట్రాలకు అవకాశం కల్పించిందని హరీశ్‌రావు తెలిపారు. కొత్త పంచాయతీల్లో రేషన్‌దుకాణాలను ఏర్పాటు చేసే అంశంపై సివిల్‌సప్లై శాఖ కసరత్తు చేస్తున్నదని.. ఈ ఏడాది రూ.18 వేల కోట్లతో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసినట్టు చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డాక నాలుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటుచేశామని, అన్ని ఉమ్మడి జిల్లాకేంద్రాల్లో దశలవారీగా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## వేగంగా డబుల్ ఇండ్లు:మంత్రి వేముల



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి కేంద్రం 14 శాతమే నిధులు ఇస్తున్నదని, మిగతావి రాష్ట్రం భరిస్తున్నదని గృహ నిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. 2 లక్షల ఇండ్లకు టెండర్లు పిలువగా,40 వేల ఇండ్లు పూర్తయ్యాయని, 1.1 లక్షల ఇండ్లు తుదిదశలో ఉన్నాయన్నారు.

## 1.7 లక్షల బీసీలకు గురుకుల విద్య



ఉమ్మడిరాష్ట్రంలో 19 గురుకులాలే ఉండగా, స్వరాష్ట్రంలో 2015-16లో 119 గురుకులాలను ఒకేసారి ప్రారంభించామని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో 6,500 మంది బీసీ విద్యార్థులు చదువుకొంటే తెలంగాణలో 1.7 లక్షల మంది చదువుతున్నారన్నారు.

## రిజర్వేషన్లపై గతంలోనే తీర్మానం



గిరిజన ఆదివాసీ రిజర్వేషన్ల పెంపుపై గతంలోనే అసెంబ్లీ తీర్మానంచేసి కేంద్రానికి పంపిందని, అది కేంద్రం పరిశీలనలో ఉన్నదని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ఎస్సీ, మైనార్టీ, గిరిజన, బీసీ, మహిళా శిశు సంక్షేమశాఖల పద్దులపై అసెంబ్లీలో సభ్యులు చర్చించారు. మంత్రుల వివరణ అనంతరం సభ ఆమోదించింది.

# చరిత్రలో నిలిచేలా మైనార్టీ సంక్షేమం

**మరే రాష్ట్రంలోనూ ఈస్థాయి పథకాలు లేవు**

- కచ్చితంగా టీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తాం
- మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ
- శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ



అక్బరుద్దీన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తాను 1999లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని.. ఆ సమయంలో మైనార్టీ సంక్షేమానికి అప్పటి ప్రభుత్వం రూ.26 కోట్లు కేటాయిస్తే ఎంతో సంతోషపడ్డామని.. ఉమ్మడి రాష్ట్రంలో మైనార్టీ సంక్షేమానికి గరిష్ఠంగా రూ.36 కోట్ల కేటాయింపుల కోసం పోరాడాల్సి వచ్చిందని శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో మైనార్టీ సంక్షేమానికి ఏకంగా రూ.1,500 కోట్లు కేటాయించడమే కాకుండా గతేడాది ప్రకటించిన రూ.1,020 కోట్లను ఖర్చుచేయడం అభినందనీయమన్నారు. శుక్రవారం శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ మొదలుపెట్టారు. సంక్షేమ పద్దులపై స్పీకర్ చర్చ చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ, గృహ నిర్మాణ శాఖల పద్దులను మంత్రులు సభలో ప్రవేశపెట్టారు.కాంగ్రెస్ సభ్యుడు పొదెం వీరయ్య పద్దులపై చర్చ ప్రారంభించారు. అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. ఆరేండ్లలోనే సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో, అన్నిప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపారని తెలిపారు. ముఖ్యంగా సంక్షేమరంగంలో దేశంలోని ఏ రాష్ట్రం కూడా ఈస్థాయిలో పథకాలను చేపట్టిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. టీఆర్ఎస్‌కు ఎందుకు మద్దతిస్తున్నారని తనను చాలామంది అడిగారని, కొంతమంది విమర్శలు చేశారని, కానీ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మైనార్టీ సంక్షేమాన్ని చేపడుతున్న ప్రభుత్వానికి కచ్చితంగా తాము అండగా నిలుస్తామని స్పష్టంచేశారు. హైదరాబాద్‌లోని పాతబస్తీతోపాటు మైనార్టీ సంక్షేమానికి టీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన 54 అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గణాంకాలతో వివరించారు. రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పాటుపడుతున్నందునే ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు ఆ పార్టీకి పట్టం కడుతున్నారని స్పష్టంచేశారు.

### వక్ఫ్ బోర్డులో సమగ్ర విచారణ చేయించాలి

వక్ఫ్ బోర్డులో భారీ ఎత్తున నిధుల దుర్వినియోగం అవుతున్నదని, అర్హతలేని వారికి పదోన్నతులు వస్తున్నాయని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఆ వివరాలను సభ ముందు ఉంచారు. వేలఎకరాల వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆ వివరాలను చదివి వినిపించారు. ప్రభుత్వం సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్‌చేశారు. మైనార్టీల సంక్షేమానికి ఇంకా చర్యలు తీసుకొంటే సీఎం కేసీఆర్ చరిత్రలో చిరస్థాయిగా ఉంటారన్న అక్బరుద్దీన్.. వాటిని వివరించారు. ఎమ్మెల్యేలు అబ్రహం, దుర్గం చిన్నయ్య, అనసూయ, శంకర్‌నాయక్ మాట్లాడారు.

## ఘనంగా మాజీ ఎంపీ కవిత జన్మదిన వేడుకలు



తన చాంబర్‌లో మాజీఎంపీ కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు. చిత్రంలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్, ఎమ్మెల్యేలు ఉన్నారు

**సికింద్రాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత నిర్వహించిన పాత్ర చిరస్మరణీయంగా నిలుస్తుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. ఉద్యమ నాయకురాలు కవిత జన్మదిన వేడుకలను డిప్యూటీ స్పీకర్ ఆధ్వర్యంలో అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో ఘనంగా జరిపారు. కేక్‌ను కచ్‌చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతిని కవిత అంతర్జాతీయస్థాయిలో చాటిచెప్పారని, బతుకమ్మ ప్రత్యేకతను, బోనాల విశిష్టతను అందరూ గుర్తించేలా కృషిచేశారని ప్రశంసించారు. మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



అసెంబ్లీలో టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులు కేకే, సురేశ్‌రెడ్డిని మాజీ ఎంపీ కవిత అభినందించగా, అమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిత్రంలో ఎంపీలు సంతోష్, బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు ఉన్నారు.

## 'వెలుగు' కథనంతో మానసిక క్షోభకు గురయ్యా

- ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే హరిప్రియానాయక్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తాను దందాలకు పాల్పడుతున్నట్టు ఈ నెల 10వ తేదీన వెలుగు దినపత్రిక ప్రచురించిన అవాస్తవ కథనంతో తీవ్ర మానసికక్షోభకు గురయ్యానని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియానాయక్ తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ.. మరుసటిరోజే ఆ వార్త అవాస్తమంటూ సదరు పత్రికలోనే ప్రచురించినప్పటికీ.. ఈ విధంగా చేయడం తనకు ఎంతోబాధ కలిగించిందని ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజన బిడ్డనైన తనపై ఇలాంటి అసత్య ప్రచారంచేయడం మానసికంగా కుంగదీసిందన్నారు. అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ప్రచురితమైనందున ఈ విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే అయిన తర్వాత అనేక అక్రమాలకు తాను అడ్డుకట్ట వేశానని.. ముందస్తుగా విచారించకుండా అసత్య కథనాలు ప్రచురించడం బాధాకరమని చెప్పారు. మీడియారంగంపై ఉన్న గౌరవంతో ఇప్పటివరకూ ఆ పత్రికపై ఎలాంటి కేసు పెట్టలేదని, మళ్లీ ఇలాంటివి జరిగితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడానికి కూడా వెనుకాడనని హెచ్చరించారు. ఆమె వెంట ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, ఆత్రం సక్కు ఉన్నారు.

# ఫరూఖ్‌కు విముక్తి

- ఏడు నెలల అనంతరం విడుదలైన ఎన్సీ అధినేత
- ఆయనపై నమోదు చేసిన పీఎస్‌ఏను ఎత్తేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటన
- మిగతా వాళ్లు విడుదలైన తర్వాతే భవిష్యత్‌పై ప్రకటన: ఫరూఖ్



**శ్రీనగర్, మార్చి 13:** జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) అధినేత ఫరూఖ్ అబ్దుల్లా గృహ నిర్బంధం నుంచి విడుదలయ్యారు. ఫరూఖ్‌పై ప్రయోగించిన ప్రజా భద్రతా చట్టాన్ని(పీఎస్‌ఏ) ప్రభుత్వం ఉపసంహరించడంతో ఏడు నెలలపాటు నిర్బంధంలో గడిపిన ఆయన శుక్రవారం విడుదలయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఫరూఖ్ నిర్బంధంలో ఉన్న తన కుమారుడు, జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఓమర్ అబ్దుల్లా, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ, ఇతర రాజకీయ నాయకుల్ని కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఫరూఖ్‌ను అధికారులు గతేడాది అగస్టు 5న గృహనిర్బంధంలోకి తీసుకున్నారు. తదనంతరం సెప్టెంబర్ 15న ఆయనపై పీఎస్‌ఏను ప్రయోగించారు. డిసెంబర్ 13న దానిని మరో మూడు నెలల పాటు పొడిగించారు. శుక్రవారం అర్ధరాత్రితో ఆ గడువు తీరిపోయింది. దీంతో ఆయనపై మరో మూడు మాసాల పాటు పీఎస్‌ఏను పొడిగిస్తున్నట్టు బుధవారం అధికారులు తెలిపారు. అయితే, ఆయనపై ఉన్న ప్రజా భద్రతా చట్టాన్ని ఎత్తివేస్తున్నట్టు ప్రభుత్వం శుక్రవారం మధ్యాహ్నం ప్రకటించింది. కాగా ఓమర్ అబ్దుల్లా, జమ్ముకశ్మీర్ మాజీ సీఎం మెహబూబ్ ముఫ్తీపై ఈ ఏడాది ఫిబ్రవరి 6న ప్రభుత్వం పీఎస్‌ఏను ప్రయోగించింది. అంతకు ముందు ఆరు నెలలుగా వాళ్లిద్దరూ నిర్బంధంలో ఉన్నారు. ఫరూఖ్‌ను విడుదల చేయడాన్ని వివిధ రాజకీయ పార్టీ నేతలు స్వాగతించారు.

### అప్పటి వరకూ మాట్లాడను

220 రోజుల గృహ నిర్బంధం అనంతరం శుక్రవారం విడుదలైన 82 ఏండ్ల ఫరూఖ్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడారు. నిర్బంధంలో ఉన్న మిగతా నాయకులందరూ విడుదలైన తర్వాతే తాను భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానన్నారు.

# విశ్వాస పరీక్షకు సిద్ధమే

- మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ వెల్లడి
- గవర్నర్‌తో భేటీ
- రాజకీయ సంక్షోభంపై వినతిపత్రం



**భోపాల్:** అసెంబ్లీలో విశ్వాస పరీక్షకు సిద్ధమేనని మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ శుక్రవారం చెప్పారు. తమ పార్టీకి చెందిన 22 మంది అసమ్మతి ఎమ్మెల్యేలు రాజీనామా చేయడం, దీంతో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆయన గవర్నర్ లాల్జీటాండన్‌ను కలిశారు. సుమారు అరగంటపాటు గవర్నర్‌తో భేటీ అయిన ఆయన రాజకీయ సంక్షోభం తలెత్తడానికి గల కారణాలు, ఇందులో బీజేపీ పాత్ర గురించి గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు మూడు పేజీల వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులకు మూల కారణం బీజేపీనేనని, ఆ పార్టీ తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నదని వినతి పత్రంలో పేర్కొన్నారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం కమల్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ కనుసన్నల్లోనే ఎమ్మెల్యేల రాజీనామా ప్రక్రియ జరిగిందని, విశ్వాస పరీక్షకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. మరోవైపు కమల్‌నాథ్ సూచనమేరకు కాంగ్రెస్ మాజీ నేత జ్యోతిరాదిత్య సింధియా వర్గానికి చెందిన ఆరుగురు మంత్రులను పదవుల నుంచి గవర్నర్ తొలగించారు. ఇంకోవైపు జ్యోతిరాదిత్య శుక్రవారం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు కాంగ్రెస్ అసమ్మతి ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసేందుకు తొలుత సిద్ధమైనప్పటికీ, చివరికి తమప్రయత్నాన్ని విరమించుకున్నారు.

### అత్యవసర కేసులపైనే విచారణ: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** కోర్టుల పైనా వైరస్ ప్రభావం పడింది. ఈ నెల 16 నుంచి అత్యవసర పిటిషన్లనే విచారించాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎస్‌ఏ బోబ్డే అధ్యక్షతన జరిగిన ఓ సమావేశం నిర్ణయించింది. కరోనా నేపథ్యంలో భారీ జన సమీకరణలు చేయవద్దని ఈ నెల 5న కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. సుప్రీంకోర్టు పరిధిలోని కోర్టు హాళ్లలోకి న్యాయవాదులను మాత్రమే అనుమతించాలని ఓ నోటిఫికేషన్‌లో తెలిపింది.

### రైల్వేలో ప్రైవేటు టికెట్ బుకింగ్ రద్దు?

**న్యూఢిల్లీ:** రైల్వేలో ప్రైవేట్ టికెట్ బుకింగ్ రద్దు చేసే యోచనలో ఉన్నట్లు రైల్వే మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. లోక్‌సభలో శుక్రవారం రైల్వే నిధులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు సెల్‌ఫోన్ల ద్వారా టికెట్లు పొందే వీలు ఉన్నందున ప్రైవేట్ ఏజెంట్ల అవసరం లేదన్నారు. గ్రూప్ సీ పోస్టుల కోసం 2018లో 1.41 లక్షల ఖాళీల భర్తీకి 3, 2019లో 1.43 లక్షల అదనపు పోస్టుల భర్తీకి 4 ప్రకటనలు వచ్చాయని రాజ్యసభలో తెలిపారు.

# కేంద్ర ఉద్యోగులకు 4% డీఏ పెంపు

- పెన్షనర్లకు కూడా పెరిగిన డీఆర్
- రూ.7,660 కోట్లతో పర్యావరణహిత జాతీయ రహదారులు
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

**న్యూఢిల్లీ, మార్చి 13:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్ల కరువు భత్యం (డీఏ), కరువుసాయాన్ని (డీఆర్) నాలుగు శాతం పెంచాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. శుక్రవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశ వివరాలను కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ విలేకరులకు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, డీఆర్‌లను 4శాతం పెంచినట్లు ఆయన చెప్పారు. దీంతో ఇప్పటి వరకు 17 శాతంగా ఉన్న డీఏ, డీఆర్ 21 శాతానికి పెరిగిందన్నారు. ఈ పెంపు వల్ల 48.34 లక్షల మంది ఉద్యోగులు, 65.26 లక్షల మంది పింఛనర్లు లబ్ధిపొందనున్నారని తెలిపారు. పెంచిన డీఏ జనవరి 1 నుంచే అమల్లోకి రానున్నదన్నారు. డీఏ పెంపు వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.14,595 కోట్ల అదనపు భారం పడనుందని చెప్పారు. ఏడవ వేతన సంఘం సిఫారసుల ప్రకారం డీఏ, డీఆర్‌ను పెంచినట్లు పేర్కొన్నారు. అలాగే 780 కి.మీ. మేర పర్యావరణహిత జాతీయ రహదారులను (గ్రీన్ నేషనల్ హైవేస్) అభివృద్ధి చేయడానికి సంబంధించిన ప్రతిపాదనను కూడా క్యాబినెట్ ఆమోదించింది. ఈ ప్రాజెక్టు కింద రూ.7,660 కోట్లతో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 780 కి.మీ. మేర జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తారు. యూరియా దిగుమతిని తగ్గించి, ఉత్పత్తిని పెంచడంలో భాగంగా టన్ను యూరియాకు రూ.350 అదనంగా చెల్లించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది.

### తెరుచుకున్న అయ్యప్ప దేవాలయం

**'కరోనా' తనిఖీ తర్వాతే భక్తులకు అనుమతి**

**శబరిమల:** కేరళలోని శబరిమల అయ్యప్ప దేవాలయాన్ని నెలవారీ పూజల కోసం శుక్రవారం సాయంత్రం తెరిచారు. కొండ దిగువన పంప వద్ద భక్తులను తనిఖీ చేసి, వారికి కరోనా వైరస్ సోకలేదని నిర్ధారించుకున్నాకే పైకి వెళ్లేందుకు అనుమతినిస్తున్నారు. కొంత మంది భక్తులు మాస్కులు ధరించి దేవాలయానికి వచ్చారని పోలీసు వర్గాలు చెప్పాయి. తాము ఎవరినీ నిలిపివేయడం లేదన్నాయి. ఈ నెల 18 వరకు దేవాలయాన్ని తెరిచి ఉంచుతారు.

### త్వరలో 4.75 లక్షల పోస్టుల భర్తీ

**న్యూఢిల్లీ:** కేంద్రంలోని వివిధ శాఖలు, విభాగాల పరిధిలో ఖాళీగా ఉన్న 4,76,692 ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేస్తామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. 1,34,785 పోస్టుల భర్తీకి యూపీఎస్సీ, ఎస్సెస్సీ, ఆర్ఆర్బీ కేంద్రానికి సిఫారసు చేశాయని శుక్రవారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నకు జితేంద్ర సింగ్ రాతపూర్వక సమాధానమిచ్చారు.

### ఆరెస్సెస్ భేటీకీ పరీక్షలు తప్పనిసరి!

**న్యూఢిల్లీ:** బెంగళూరులో ఈ నెల 15 నుంచి 17 వరకు జరిగే తమ అఖిలభారతీయ ప్రతినిధి సభ (ఏబీపీఎస్) సమావేశాలకు హాజరయ్యేవారు తప్పనిసరిగా కరోనా పరీక్షలు చేయించుకోవాలని ఆరెస్సెస్ తెలిపింది.

### మరో కేసులో సెన్‌గర్‌కు పదేండ్ల జైలు

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో దోషి కుల్దీప్ సింగ్ సెన్‌గర్‌కు.. ఆ బాలిక తండ్రి మృతి కేసులోనూ శిక్ష పడింది. ఆయనకు ఢిల్లీ జిల్లా కోర్టు పదేండ్ల కఠిన జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. సెన్‌గర్,అతడి సోదరుడు అతుల్‌లకు చెరో రూ.10 లక్షల జరిమానా.. అతుల్‌సింగ్, మరో ఐదుగురికీ పదేండ్ల జైలుశిక్ష విధించింది.

### మళ్లీ తెరుచుకోనున్న అంబేద్కర్ హౌస్

**లండన్:** ఉత్తర లండన్‌లోని కింగ్ హెన్రీ రోడ్డులో ఉన్న అంబేద్కర్ హౌస్‌ను సందర్శకుల కోసం తిరిగి తెరిచేందుకు బ్రిటన్ అంగీకరించింది. ఈ విషయాన్ని ఆ దేశ కమ్యూనిటీస్ సెక్రెటరీ రాబర్ట్ జెనరిక్ తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 1921-22లో హెన్రీ రోడ్డులోని ఓ ఇంట్లో ఉంటూ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో విద్యాభ్యాసం చేశారు. తర్వాత ఆ ఇంటిని మ్యూజియంగా మార్చారు. ఆ ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని 2018లో కామ్డెన్ కౌన్సిల్‌కు ఫిర్యాదు అందింది. దీంతో అప్పట్లో దాన్ని మూసివేస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకున్నది.

## 'కంటెజియన్' సినిమాకు భారీ డౌన్‌లోడ్లు




**న్యూఢిల్లీ, మార్చి 13:** ప్రపంచ దేశాలకు ముచ్చెమటలు పట్టిస్తున్న కరోనా వైరస్ కారణంగా ఓ హాలీవుడ్ చిత్రాన్ని నెటిజన్లు విపరీతంగా డౌన్‌లోడ్ చేస్తున్నారు. ఆ చిత్రమే తొమ్మిదేండ్ల క్రితం వచ్చిన మెడికల్ థ్రిల్లర్ మూవీ 'కంటెజియన్'. ఈ సినిమా ఇతివృత్తం కరోనా వైరస్‌కు కాస్త దగ్గరగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాని డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. జనవరి నుంచి ఈ సినిమా డౌన్‌లోడ్లు క్రమంగా పెరిగాయి. మాట్ డామన్, లారెన్స్ ఫిష్ బర్న్, జూడ్ లా, గ్వినేత్ పాల్ట్రో ప్రధాన పాత్రలతో రూపొందిన ఈ చిత్రాన్ని స్టీవెన్ సోడర్ బర్గ్ తెరకెక్కించారు. 2011 సెప్టెంబర్‌లో విడుదలైన ఈ చిత్రం మంచి ఆదరణ పొందింది.

## వైరస్ సోకినా.. కోలుకోవచ్చు!

- నేనే దానికి ఉదాహరణ
- ఇంటి వద్దే ఉండే విశ్రాంతి తీసుకోండి
- స్వీయ చికిత్సతో కోలుకున్న అమెరికా మహిళ సూచన



**వాషింగ్టన్:** కరోనా సోకితే భయపడవద్దని, ఇంటి వద్దే ఉండి విశ్రాంతి తీసుకోవాలని స్వీయ చికిత్సతో కోలుకున్న అమెరికా మహిళ సూచించారు. ప్రమాదకర లక్షణాలు లేకపోతే సాధారణ ఫ్లూ మందులతో కరోనా నుంచి బయటపడవచ్చని తెలిపారు. వాషింగ్టన్‌లోని సియాటెల్‌కు చెందిన ఎలిజబెత్ స్కేదర్ (37) ఓ బయోఇంజినీరింగ్ సంస్థలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వారాంతపు పార్టీలో పాల్గొన్న ఆమెకు ఫిబ్రవరి 25న ఫ్లూ వంటి లక్షణాలు కనిపించాయి. మధ్యాహ్నానికి తలనొప్పి, జ్వరం, ఒళ్లు నొప్పులు రావడంతో పని చేస్తున్న కార్యాలయం నుంచి ఇంటికి తిరిగొచ్చారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత చూస్తే జ్వరం 103 డిగ్రీలకు పెరిగింది. దీంతో వైద్యులను సంప్రదించి వారి సూచనతో ఫ్లూ నివారణ మందులు వేసుకున్నారు. మూడ్రోజుల్లో జ్వరం తగ్గుముఖం పట్టింది. దగ్గు, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు లేకపోవడంతో తనకు కరోనా సోకలేదని భావించారు. అయితే ఆమె పాల్గొన్న పార్టీలో మరికొందరికి తనలాంటి లక్షణాలున్నట్లు ఫేస్‌బుక్ ద్వారా తెలుసుకున్నారు. ఎందుకైనా మంచిదని పరీక్షలు నిర్వహించగా, కరోనా సోకినట్లు తేలింది. ఈ విషయం తెలిసిన ఎలిజబెత్ నివ్వెరపోగా ఆమె తల్లి ఆందోళన చెందారు. మరోవైపు వారం పాటు ఇంటి వద్దే ఉండాలని స్థానిక ఆరోగ్య అధికారులు ఎలిజబెత్‌కు సూచించారు. ఆ మేరకు ఆమె ఇంట్లోనే విశ్రాంతి తీసుకుని టీవీలో నచ్చిన కార్యక్రమాలు చూస్తూ కరోనా నుంచి బయటపడ్డారు.



# కరోనా! భయంతో..

- దిగ్బంధం దిశగా రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు
- విద్యాసంస్థలు, థియేటర్లు, మాల్స్ బంద్
- ఐపీఎల్ టోర్నమెంట్ వాయిదా..
- దేశంలో రెండో కరోనా మరణం నమోదు

ప్రాణాంతక కరోనా వైరస్ గురించి శుక్రవారం ఆసక్తికర విషయం బహిర్గతమైంది. ఏడేండ్ల క్రితం అంటే 2013 జూన్ 3న మార్కో ఎకోర్టెస్ అనే ట్విట్టర్ యూజర్.. 'కరోనా వైరస్ వస్తున్నది' అని చేసిన ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. ఇప్పటి వరకు 1.10 లక్షల మంది లైక్ చేశారు. మరోవైపు 1981లో డియాన్ కూంట్జ్ రాసిన 'ది ఐస్ ఆఫ్ డార్క్‌నెస్' థ్రిల్లర్ నవలలో 'వుహాన్-400' అనే వైరస్ గురించి ప్రస్తావించారు. చైనా సైనిక ల్యాబోరేటరీ.. జీవాయుధాల తయారీలో భాగంగా దీన్ని సృష్టించిందని అందులో పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా శుక్రవారం నాటికి కరోనా మరణాలు **5,040**

అత్యధికంగా చైనాలో **3,176**

ఇటలీలో **1,016**, ఇరాన్‌లో **514**

మొత్తంగా 121 దేశాల్లో వైరస్ బారినపడినవారి సంఖ్య **1,34,000**

### 34 మంది హోం ఐసొలేషన్

దేశంలోనే తొలిసారిగా కర్ణాటకలో కరోనా మరణం నమోదవ్వడంతో తెలంగాణ ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. కలిబురిగిలో మృతిచెందిన వ్యక్తికి హైదరాబాద్‌తోనూ లింక్‌లు ఉండటంతో రాష్ట్ర రాపిడ్ రెస్పాన్స్ టీమ్ తక్షణ చర్యలు చేపట్టింది. ఆ వృద్ధుడికి గతంలో చికిత్స అందించిన హైదరాబాద్‌లోని మూడు ప్రైవేట్ దవాఖానల వైద్య సిబ్బందిని ట్రాకింగ్ చేశారు. మొత్తం 34 మందిని గుర్తించి, వారందరినీ వైద్యశాఖ పర్యవేక్షణలో హోం ఐసొలేషన్‌లో ఉంచారు. కరోనా లక్షణాలున్నవారికి పరీక్షలు చేశారు. రిపోర్టులు రావాల్సి ఉన్నది.

### మరొకరు బలి

దేశంలో కరోనా కాటుకు మరొకరు బలయ్యారు. రాజధాని ఢిల్లీలో తొలి మరణం నమోదైంది. జనక్‌పురికి చెందిన 68 ఏండ్ల మహిళ ఆర్ఎంఎల్ దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. దీంతో దేశంలో కరోనా మృతుల సంఖ్య రెండుకు పెరిగింది. కర్ణాటకలోని కలబురిగికి చెందిన 76 ఏండ్ల వ్యక్తి కరోనాతో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

**న్యూఢిల్లీ, మార్చి 13:** భారత్‌లో కరోనా కోరలు చాస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వాలు మరింత అప్రమత్తమయ్యాయి. మహమ్మారిని కట్టడి చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయి. పలు రాష్ర్టాలు షట్‌డౌన్ మోడ్‌లోకి వెళ్లాయి. స్కూళ్లు, కాలేజీలు, థియేటర్లను మూసివేయడంతోపాటు ప్రజా, క్రీడా కార్యక్రమాలను నిలిపివేశాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వాయిదా పడగా.. భారత్, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్ రద్దయింది. ఈ నెల 31 వరకు విద్యాసంస్థలు, థియేటర్లను మూసివేస్తున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఐపీఎల్‌తో పాటు అన్ని క్రీడా కార్యక్రమాలపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపింది. కర్ణాటకలోని కలబురిగిలో దేశంలోనే తొలి కరోనా మరణం నమోదైన సంగతి తెలిసిందే. తాజాగా ఢిల్లీలో మరొకరు మృతిచెందారు. కరోనా నియంత్రణకు కర్ణాటక ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేసింది. వారంపాటు అన్ని యూనివర్సిటీలు, థియేటర్లు, మాల్స్, పబ్‌లు, క్లబ్‌లను మూసివేస్తున్నట్లు సీఎం యెడియూరప్ప ప్రకటించారు. మరోవైపు, ఈ నెలాఖరు వరకు స్కూళ్లు, కాలేజీలను మూసివేయాలని బీహార్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అలాగే జూలు, పార్కులనూ మూసివేయాలని నిర్ణయించింది. ఇంకోవైపు, ముంబై, నవీముంబై, పుణే, పింప్రి, నాగ్‌పూర్‌లలో థియేటర్లు, జిమ్‌లు, స్విమింగ్‌పూల్స్, మాల్స్‌ను మూసివేయాలని మహారాష్ట్ర సర్కారు ఆదేశించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈనెల 22 వరకు విద్యాసంస్థలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఒడిశా సర్కారు కరోనాను విపత్తుగా ప్రకటించింది. ఈ నెలాఖరు వరకు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. ప్రభుత్వ సదస్సులు, సమావేశాలు, వర్క్‌షాప్‌లను రద్దుచేసింది. సినిమా హాళ్లు, స్విమ్మింగ్ పూల్స్, జిమ్‌లను మూసివేయాలని ఆదేశించింది.

**తరగతులు బంద్**

కరోనా నేపథ్యంలో ఐఐటీ-కాన్పూర్ ఈ నెల 29 వరకు అన్ని తరగతులు, పరీక్షలను నిలివేసింది. ఈ నెల 15లోగా హాస్టళ్లు ఖాళీచేసి వెళ్లాలని ఐఐటీ ఢిల్లీ తమ విద్యార్థులను ఆదేశించింది. జేఎన్‌యూ కూడా ఈ నెలాఖరు వరకు తరగతులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 30 వరకు ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇజ్రాయెల్, దక్షిణకొరియా, శ్రీలంక దేశాలకు సర్వీసులను నిలిపివేయాలని ఎయిరిండియా నిర్ణయించింది.

**అమెరికా వల్లనే కరోనా**

కరోనా మహమ్మారికి కారణం నువ్వంటే నువ్వని చైనా, అమెరికా ఆరోపించుకుంటున్నాయి. కరోనా వ్యాప్తికి అమెరికానే కారణమని, వైరస్‌ను ఆ దేశ ఆర్మీ వుహాన్‌కు తెచ్చిందని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జావో లిజియన్ ఆరోపించారు. తన వాదనను సమర్థించుకుంటూ శుక్రవారం ఓ వార్తా కథనం లింక్‌ను కూడా ట్విట్టర్‌లో ఆయన పోస్టు చేశారు.



శుక్రవారం ముంబైలోని సిద్ధివినాయక ఆలయంలో ముఖానికి మాస్కులు ధరించి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

### 82కు పెరిగిన కేసులు

**దేశంలో** కరోనా కేసులు 82కు పెరిగినట్లు కేంద్ర వైద్య శాఖ వెల్లడించింది. ఇందులో 16 మంది ఇటాలియన్లు కాగా, ఒకరు కెనడాకు చెందినవారు. వైద్య శాఖ అధికారులు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కరోనా వైరస్ హెల్త్‌ఎమర్జెన్సీ కాదని, భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. చైనాతోసహా, వివిధ దేశాల నుంచి ఇప్పటివరకు 1,031 మంది భారతీయులను స్వదేశానికి తరలించినట్లు తెలిపారు. ఇరాన్, ఇటలీలో చిక్కుకుపోయిన వారిని వెనక్కి తీసుకొస్తామన్నారు. కరోనా బాధితులను కలిసిన 4,000 మందిని క్వారెంటైన్‌లో ఉంచినట్లు చెప్పారు. కాగా, బెంగళూరు క్యాంపస్‌లో పనిచేస్తున్న తమ ఉద్యోగికి కరోనా సోకినట్లు గూగుల్ సంస్థ వెల్లడించింది.

### యూవీ కాంతితో బస్సుల శుద్ధి

**బీజింగ్:** కరోనా వ్యాప్తిని నియంత్రించడంలో భాగంగా చైనా అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నది. దీంట్లో భాగంగా.. సాధారణ ప్రజలు ఎక్కువ గా తిరిగే బస్సులు, లిఫ్టులను ఆ దేశ అధికారులు అతినీలలోహిత(ఆల్ట్రావైలెట్-యూవీ) కాంతితో శుద్ధి చేస్తున్నా రు. రసాయనంతో ఒక్కో బస్సు శుభ్రం చేయడానికి 40 నిమిషాలు పట్టేదని, యూవీ శుద్ధీకరణ ప్రక్రియ 5 నిమిషాల్లో పూర్తవుతున్నదన్నారు.

## కరోనా రోగి ఇంటికి

- పూర్తిగా నయంచేసి పంపిన గాంధీ వైద్యులు
- మంత్రి ఈటల రాజేందర్ హర్షం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలో నమోదైన తొలి కరోనా కేసును ఎదుర్కోవడంలో తెలంగాణ వైద్యులు విజయవంతమయ్యారు. రెండువారాలుగా గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న యువకుడు పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఈ యువకుడు బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆఫీసు పనిమీద దుబాయ్ వెళ్లగా.. కరోనా వైరస్ సోకింది. ఆ యువకుడు పూర్తిగా కోలుకోవడంతో కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తంచేశారు. వైరస్‌ను ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యలను అభినందించారు. కరోనా సోకిన యువకుడికి వైద్యసేవలు అందించి, సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి చేయడం పట్ల రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ హర్షం వ్యక్తంచేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఒకరికి కూడా కరోనా లేదని చెప్పారు.

**26 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు**

గాంధీ, ఉస్మానియా దవాఖానల్లో శుక్రవారం 26 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా అందులో ముగ్గురికి నెగిటివ్ రిపోర్ట్ వచ్చినట్టు వైద్య, ఆరోగ్యశాఖ బులెటిన్ వెల్లడించింది. ఇప్పటివరకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 57,214 మందికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలుచేశారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో కూడా శుక్రవారం నుంచి కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు ప్రారంభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ శశికళారెడ్డి పేర్కొన్నారు.

**ఖమ్మం, జగిత్యాలలో ఇద్దరు అనుమానితులు**

ఇటీవల దుబాయ్ నుంచి జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి వచ్చిన యువకుడు ఎండీ రఫీ కొద్దిరోజులుగా దగ్గు, జ్వరం, ఛాతినొప్పితో బాధపడుతుండటంతో కరోనా నిర్ధారణ పరీక్షల నిమిత్తం శుక్రవారం గాంధీ దవాఖానకు తరలించారు. రఫీని తొలుత జగిత్యాల ఏరియా దవాఖానలో పరీక్షించారు. అయితే, ఎవరికీ చెప్పకుండా దవాఖాన నుంచి వెళ్లిపోవడంతో, అప్రమత్తమైన వైద్యులు పోలీసుల సహకారంతో అతనిని వెదికి పట్టుకొని, గాంధీకి తరలించారు. అమెరికాలోని డెట్రాయిట్‌లో ఓ హాస్పిటల్‌లో హౌస్‌సర్జన్‌గా పనిచేస్తూ, ఇటీవల ఖమ్మం వచ్చిన ఓ యువ డాక్టర్ దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతుండటంతో గాంధీ దవాఖానకు తరలించారు.



వికారాబాద్‌లోని హరిత రిసార్ట్స్

**వికారాబాద్‌లో క్వారంటైన్ కేంద్రం**

వైరస్ తీవ్రత అధికంగా ఉన్న చైనా, ఇటలీ, దక్షిణకొరియా, ఇరాన్, హాంకాంగ్, ఫ్రాన్స్, స్పెయిన్ నుంచి వచ్చే వారిని 14రోజులపాటు క్వారెంటైన్‌లో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు వికారాబాద్‌లోని హరిత రిసార్ట్‌లో ఏర్పాట్లు చేశారు. మరోవైపు అన్ని జిల్లా కేంద్ర దవాఖానల్లో, బోధన దవాఖానల్లో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటుచేశారు. కరోనాపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ నంబర్ 104కు అధిక సంఖ్యలో కాల్స్ వస్తున్నాయి.

**నో కరోనా సర్టిఫికెట్ల కోసం గాంధీకి క్యూ**

తాము విదేశాలకు వెళ్లడానికి వీలుగా నో కరోనా సర్టిఫికెట్ ఇవ్వాలని గాంధీ దవాఖానను పలువురు ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. శుక్రవారం గాంధీకి వచ్చిన 15 మంది ప్రయాణికులు వైద్యాధికారులతో, సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో దవాఖాన సూపరింటెండెంట్ వారికి నచ్చజెప్పారు. అనారోగ్య సమస్యలు లేనివారికి కరోనా పరీక్షలు నిర్వహించబోమని, అలాంటివారికి సర్టిఫికెట్లు ఇవ్వడం సాధ్యంకాదని స్పష్టంచేశారు.

### ఇవాంకను కలిసిన ఆస్ట్రేలియా మంత్రికి కొవిడ్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియాకు చెందిన ఒక సీనియర్ మంత్రి కరోనా వైరస్ బారినపడ్డారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంక, అమెరికా అటార్నీ జనరల్ విలియం బార్‌తో భేటీ అయి తిరిగి వచ్చిన అనంతరం ఆయనలో కొవిడ్-19 లక్షణాలు గుర్తించారు. ప్రస్తుతం ఆయన కోలుకొంటున్నారని ఆస్ట్రేలియా హోంశాఖ మంత్రి పీటర్ డటన్ తెలిపారు. ఇప్పటివరకు ఆస్ట్రేలియాలో 196 కరోనా కేసులను నిర్ధారించగా, ముగ్గురు మరణించారు. హాలీవుడ్ నటుడు టామ్ హాంక్స్, ఆయన భార్య రీటా విల్సన్‌కు కరోనా పాజిటివ్ నివేదికలు రావడంతో ప్రస్తుతం వారు క్వీన్స్‌లాండ్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు.



### కెనడా ప్రధాని భార్యకు కరోనా నిర్ధారణ

**అట్టావా:** ఇటీవల బ్రిటన్ ఆరోగ్యమంత్రికి కరోనా సోకినట్టు నిర్ధారణ కాగా, తాజాగా కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో భార్య సోఫీ గ్రెగొరీకి ఆ వైరస్ సోకినట్టు ఆ దేశ ప్రధాని కార్యాలయం గురువారం ప్రకటించింది. ట్రుడో దంపతులు ఒక కార్యక్రమంలో ప్రసంగించి వచ్చిన తర్వాత.. గ్రెగొరీలో ఫ్లూ లక్షణాలు బయటపడటంతో పరీక్షలు జరుపామని, దీంతో ఆమెకు కరోనా సోకినట్టు తేలిందని వెల్లడించింది. కాగా, తన అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకొన్న ప్రధాని ట్రుడో.. ఐసోలేషన్ వార్డు నుంచే విధుల్ని నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు కెనడాలోని ఆరు రాష్ర్టాల్లో 150 కరోనా కేసులు నమోదవ్వగా, ఒకరు చనిపోయారు.



### కలిసికట్టుగా పోరాడుదాం

**న్యూఢిల్లీ:** ప్రపంచ దేశాలను కబళిస్తున్న కరోనా మహమ్మారిపై ఉమ్మడిగా పోరాడుదామని సార్క్ (దక్షిణాసియా దేశాల ప్రాంతీయ సహకార సమాఖ్య) దేశాలకు ప్రధానమంత్రి మోదీ పిలుపునిచ్చారు. ఇందుకు బలమైన వ్యూహాన్ని రచించేందుకు భాగస్వామ్య దేశాధినేతలందరూ వీడియా కాన్ఫరెన్స్ ద్వారా చర్చిద్దామని ట్విట్టర్ వేదికగా ప్రతిపాదించారు. దీనిపై పాకిస్థాన్ మినహా మిగిలిన అన్ని సభ్యదేశాల నుంచి సానుకూల స్పందన లభించింది. మోదీ ప్రతిపాదనను శ్రీలంక అధ్యక్షుడు గోటబయ రాజపక్స, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి, మాల్దీవులు అధ్యక్షుడు ఇబ్రహీం అహ్మద్ సోలీ, భూటాన్ ప్రధాని లోటే షెరింగ్, బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి షహ్రియార్ ఆలం, ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడి అధికార ప్రతినిధి స్వాగతించారు. కాగా, ఈ నెల 21 నుంచి రెండు రోజులపాటు మోదీ గుజరాత్‌లో పర్యటించాల్సి ఉండగా, కరోనా కారణంగా అది వాయిదా పడింది.

## సామూహిక సంబురాలకు దూరం!

- కల్యాణ మండపాల్లో కానరాని జోష్
- బార్లు వెలవెల.. రెస్టారెంట్లు విలవిల
- నాన్ వెజ్, చైనీస్ ఫుడ్, పానీపూరీ అన్నీ బంద్
- సామాన్యుల సరదాలపై కరోనా ప్రభావం

**హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కరోనా కేసులు లేకపోయిన్నప్పటికీ, ఆ భయం సామాన్యులను వెన్నాడుతున్నది. పెండ్లిండ్లు, గృహప్రవేశాలు, బర్త్‌డే ఫంక్షన్లు వంటి సామూహిక కార్యక్రమాలకు వెళ్లాలంటే జంకుతున్నారు. ప్రస్తుతం పెండ్లిండ్ల సీజన్ నడుస్తున్నప్పటికీ, కల్యాణమండపాల్లో మునుపటి జోష్ కనిపించడంలేదని నిర్వాహకులు చెప్తున్నారు. గతంతో పోల్చుకుంటే శుభకార్యాలకు హాజరయ్యేవారి సంఖ్య 30శాతం వరకు తగ్గిందనేది ఒక అంచనా. మరికొందరు ఏకంగా ముహూర్తాలను వాయిదా వేస్తుండటం విశేషం. పెండ్లిండ్లకు హాజరవుతున్న వారు సైతం జిహ్వాచాపల్యాన్ని చంపుకొని, ఆహార పదార్థాలను జాగ్రత్తగా ఎంచుకొంటున్నారు. నాన్ వెజ్ వంటకాల జోలికి అసలే వెళ్లడంలేదు. ఫంక్షన్లలో మాంసం వినియోగం సగానికి సగం తగ్గిందని క్యాటరర్లు పేర్కొంటున్నారు. ఫంక్షన్లలోనే కాదు చాలామంది ఇండ్లలోనూ ముక్క ఉడకడం లేదంటే ఆశ్చర్యపోవద్దు.



**బార్లు వెలవెల**

హైదరాబాద్‌లోని రెస్టారెంట్లు, బార్ల మీద కూడా కరోనా ప్రభావం కనిపిస్తున్నది. బయటి ఫుడ్‌కు జనం స్వస్తిచెప్తుండటంతో రెస్టారెంట్లలో సందడి తగ్గింది. విదేశీ వంటకాలు, చైనీస్ ఫుడ్స్, పానీపూరీ బండ్ల వద్ద కూడా మునుపటి బిజినెస్ కనిపించడం లేదు. మూడు పెగ్గులు ఆరు ఛీర్స్‌గా కిటకిటలాడిన బార్లు కూడా మందుబాబుల తాకిడి తగ్గడంతో వెలవెలబోతున్నాయి. సినిమా థియేటర్లకు వెళ్లే వారి సంఖ్య కరోనా దెబ్బతో మరింత తగ్గింది.

**పెరిగిన ఆరోగ్య స్పృహ**

మరోవైపు, వైరస్ పుణ్యామా అని ఆరోగ్య స్పృహ కూడా పెరుగుతున్నది. బయట నుంచి రాగానే చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కొంటున్న దృశ్యాలు ప్రతిఇంటిలోనూ కనిపిస్తున్నాయి. బస్సుల్లో ప్రయాణించేటప్పుడు చేతులు కడుక్కోవడం, శానిటైజర్లు వాడకం పెరిగింది. బయట తిరిగేవారు ముఖానికి రుమాలు చుట్టుకోవడమూ కనిపిస్తున్నది. చల్లని ప్రదేశాల్లో వైరస్ వ్యాప్తి చెందుతుందన్న అభిప్రాయంతో చాలామంది ఏసీలు, ఫ్యాన్ల వాడకం తగ్గించి, సురక్షిత జోన్‌లో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్‌లో విదేశీ విద్యార్థుల సంచారం ఎక్కువగా ఉండే ఉస్మానియా వర్సిటీ ఎన్‌సీసీ గేటు తదితర ప్రాంతాల్లో ఇప్పుడు స్థానికుల సందడి తగ్గిపోయింది. ఇక కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు ముందు జాగ్రత్త చర్యగా ఉద్యోగులు కార్యాలయానికి రాకుండా వర్క్ ఫ్రంహోం విధానాన్ని అనుసరిస్తున్నాయి. హైటెక్‌సిటీలో కొన్ని ఐటీ కంపెనీలు ఇంటినుంచే పనిచేయండని ఉద్యోగులను ఆదేశించాయి. తాము చెప్పేవరకు చైనాకు రావద్దని యాంగ్‌జోహు, వూహాన్ మెడికల్ యూనివర్సిటీల యాజమాన్యాలు మనదేశంలోని విద్యార్థులకు వర్తమానం పంపాయి. ఆయా యూనివర్సిటీలు అత్యవసర సిలబస్‌ను వీశాట్ ద్వారా పూర్తి చేస్తున్నట్టు కామారెడ్డి జిల్లా బిక్కనూరుకు చెందిన గజవాడ అరవింద్ తెలిపారు.



### క్వారంటైన్‌లో రొమేనియా ప్రధాని

**బుకారెస్ట్:** రొమేనియా ప్రధాని లుడోవిక్ ఒర్బాన్ క్వారంటైన్ (స్వీయ దిగ్బంధం)లో ఉన్నారు. ఆయన అధ్యక్షతన సోమవారం జరిగిన ఓ భేటీలో పాల్గొన్న ఓ సెనేటర్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ప్రధాని లుడోవిక్‌తోపాటు ఆ సమావేశంలో పాల్గొన్న చాలా మంది మంత్రులు, సభ్యులు ఐసొలేషన్‌లో ఉన్నారు. రొమేనియాలో ఇప్పటి వరకు 70 కరోనా కేసులు నమోదయ్యాయి.

### 'నమస్తే'కు ప్రపంచం ఫిదా!

**న్యూఢిల్లీ:** కరోనా నేపథ్యంలో షేక్‌హ్యాండ్(కరచాలనం)కు స్వస్తి చెప్పి భారత సాంప్రదాయ పలకరింపు 'నమస్తే'ను దేశాధినేతలు అనుసరిస్తున్నారు. ఐర్లాండ్ ప్రధాని లియో వరాద్కర్‌తో గురువారం భేటీ అయిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'నమస్తే'తో పలకరించారు. బ్రిటన్ రాజకుమారుడు చార్లెస్ ఇటీవల సభికులతో కరచాలనం చేసేందుకు తొలుత ప్రయత్నించి ఆ తర్వాత అందర్నీ 'నమస్తే'తో విష్ చేశారు. స్పానిష్ రాజు ఫిలిప్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రోన్ 'నమస్తే'తో స్వాగతం పలికారు. అంతా 'నమస్తే'ను పాటించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆ దేశ ప్రజలకు సూచించారు.



నా స్వేచ్ఛ కోసం గొంతువిప్పిన దేశ ప్రజలకు కృతజ్ఞతలు. నిర్బంధంలో ఉన్న ప్రతి ఒక్కరూ విడుదలైనప్పుడే ఈ స్వేచ్ఛ పూర్తవుతుంది. నిర్బంధంలో ఉన్న మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా కూడా స్వేచ్ఛ పొందాలి.

**ఫరూక్ అబ్దుల్లా, జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి**

నాకు, నా భార్యకు, మా ప్రభుత్వంలోని మంత్రులకు, 61 మంది శాసనసభ్యులకూ జనన ధృవీకరణ పత్రాల్లేవు. మేమంతా నిర్బంధ శిబిరాలకు వెళ్లాలా? ఎన్పీఆర్, ఎన్నార్సీలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలి..

**అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1590**

ఇవ్రీ ఫ్రెంచి మత యుద్ధంలో క్యాథలిక్ లీగ్‌ను ఓడించిన ఫ్రెంచి రాజు 4వ హెన్రీ.

**1794**

కాటన్ జిన్ మిషిన్‌ను కనుగొన్న ఎలీ విట్నీ.





**1913**

రాక్ ఫెల్లర్ ఫౌండేషన్‌కు వంద బిలియన్ డాలర్లు బహూకరించిన జాన్ డి రాక్ ఫెల్లర్.

కెన్యా అటవీ ప్రాంతంలో 2017లో కనిపించిన తెల్ల జిరాఫీ ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆశ్చర్యంలో ముంచేసింది. కెన్యా అడవుల్లోని జీవ వైవిధ్యానికి ప్రతీకగా తెల్ల జిరాఫీ నిలిచింది. ఈ మధ్య అటవీ దొంగలు ఆ తెల్ల జిరాఫీలను చంపటం ప్రపంచవ్యాప్తంగా వన్య ప్రేమికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రపంచవ్యాప్తంగా నాలుగో అతిపెద్ద అక్రమ కార్యకలాపంగా సాగుతున్న 'వైల్డ్ లైఫ్' ఎగుమతిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి. అరుదైన జంతుజాలాన్ని సంరక్షించుకోవాలి.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు మోటరు వాహనాల చట్టంలో మార్పులు తెచ్చేందుకు సమాయత్తమవటం ముదావహం. దేశంలో నానాటికీ రోడ్డు ప్రమాదాలు, మరణాలు పెరుగుతున్నాయి. 2001లో ఏడాది కాలంలో 80,888 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే, 2015 నుంచి ఏటా లక్షా 50 వేల మంది దుర్మరణం పాలవుతున్నారు. దీనికంతటికీ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవటమే ప్రధాన కారణమని తెలుస్తున్నది. కాబట్టి ప్రమాదాలు తగ్గించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టడం ఆహ్వానించదగిన పరిణామం.

**ది హిందూ**



# కరోనా భయం

విశ్వవ్యాప్తంగా విలయతాండవం చేస్తున్న కరోనా వైరస్ ప్రజల ప్రాణాలను బలి తీసుకోవటమే కాదు, అన్నివ్యవస్థలనూ ఆవిరిచేస్తున్నది. వర్తక, వాణిజ్య, పర్యాటకరంగాలతో పాటు క్రీడారంగాన్నీ కుదేలు చేస్తున్నది. చరిత్రలో మున్నెన్నడూ లేనివిధంగా భారత్‌లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. కరోనాతో పరిణమిస్తున్న ప్రపంచవ్యాప్త విపరిణామాలతో దేశీయ ఆర్థికవ్యవస్థ పెనుతుఫానులో చిగురుటాకులా వణికిపోతున్నది. మరోవైపు పౌరజీవనం తీవ్రంగా ప్రభావితమవుతున్నది. సామూహిక కార్యకలాపాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. పెండ్లిండ్ల వంటి శుభకార్యాలు కూడా వాయిదా పడే పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు మూతపడుతున్నాయి. దేశదేశాల్లో ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు, పరిశోధనలను పక్కనబెడుతున్నాయి. పర్యాటకులు ఎవరెస్టు శిఖరం ఎక్కడానికి చైనా అనుమతులు నిలిపేసింది. అంగారకుడిపై పరిశోధన కోసం రష్యా-ఐరోపా దేశాలు తలపెట్టిన అరుణ గ్రహ మిషన్ వాయిదా వేసుకున్నాయి. ఇస్రో కూడా తన ప్రయోగాలను వాయిదా వేసినట్లు ప్రకటించటం గమనార్హం.


**చైనాలో వెలుగుచూసిన కరోనా వైరస్ అక్కడ తగ్గుముఖం పట్టగా, ఇరాన్, ఇటలీ, ఫ్రాన్స్, దక్షిణకొరియా, అమెరికాతో సహా పలుదేశాల్లో విజృంభిస్తున్నది. ఇప్పటికి 125 దేశాల్లో వైరస్ బాధితుల సంఖ్య 1,25,293 కాగా, 4,600 మంది మరణించారని తెలుస్తున్నది. చైనా తర్వాత ఇటలీ, ఇరాన్ దేశాల్లో ఎక్కువ మరణాలు సంభవించాయి. ఆసియా దేశాల్లో వైరస్ విస్తరణ తీవ్రత ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది.**


అగ్రరాజ్యం అమెరికాతో సహా అనేక దేశాలు కోవిడ్-19తో కకావికలమవుతున్నాయి. ఏకంగా 30 రోజుల పాటు తమ దేశానికి రావద్దంటూ 26 ఐరోపా దేశాల పౌరులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించారు. విమానయానాలను నియంత్రించారు. వాషింగ్టన్ డీసీ సహా 15 రాష్ట్రాల్లో ఆరోగ్య అత్యవసర పరిస్థితి ప్రకటించారు. కొలరాడో, నెవెడా, విస్కాన్సన్‌లలో ఎన్నికల సభలను రద్దుచేసుకున్నారు. ఇక ఇటలీ అయితే అన్నిరకాల కార్యకలాపాలను నిలిపేసి దేశాన్నే స్తంభింపజేసింది. ఫ్రాన్స్ తదితర యూరప్ దేశాలన్నీ అత్యంత జాగరూకతతో వ్యవహరిస్తూ కోవిడ్‌ను కట్టడిచేయటం కోసం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయి. ఇదిలా ఉంటే ట్రంప్ చర్యలు ఆర్థికవ్యవస్థలకు అశనిపాతమంటూ యురోపియన్ నేతలు విమర్శిస్తుంటే, వైరస్ నియంత్రణలో ఈయూ సరిగా స్పందించలేదని ట్రంప్ తప్పుబట్టారు. విపత్కర సమయాల్లో పరస్పర విమర్శలు కాకుండా ఉమ్మడి కార్యాచరణ అవసరం. మహమ్మారిగా మారిన కోవిడ్-19ను కట్టడి చేసేందు కు దేశాలన్నీ చేతులు కలపాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపును అనుసరించాల్సిన సమయమిది.

చైనాలో వెలుగుచూసిన కరోనా వైరస్ అక్కడ తగ్గుముఖం పట్టగా, ఇరాన్, ఇటలీ, ఫ్రాన్స్, దక్షిణ కొరియా, అమెరికాతో సహా పలుదేశాల్లో విజృంభిస్తున్నది. ఇప్పటికి 125 దేశాల్లో వైరస్ బాధితుల సంఖ్య 1,25,293 కాగా, 4,600 మంది మరణించారని తెలుస్తున్నది. చైనా తర్వాత ఇటలీ, ఇరాన్ దేశాల్లో ఎక్కువ మరణాలు సంభవించాయి. ఆసియా దేశాల్లో వైరస్ విస్తరణ తీవ్రత ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. అతితక్కువ సమయంలోనే ఆసియా దేశాల్లో 90,765 కరోనా కేసులు నమోదు కాగా, 3,253 మంది చనిపోయారు. దేశంలో కూడా ఏదో మూలన కొత్త కేసు నమోదవుతూ బాధితుల సంఖ్య 74కు చేరుకున్నది. మరో 15 వందల మందిపై వైద్యపరిశీలన కొనసాగుతుండగా, మొన్ననే తొలి మరణం చోటుచేసుకోవటం ఆందోళన కలిగిస్తున్నది. హాలీవుడ్ సూపర్‌స్టార్ టామ్ హాంక్స్, ఆయన భార్య రీటా హాంక్స్, ప్రఖ్యాత గాయకుడు ఎల్విన్ ప్రెస్లీ, కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో,అతని సహచరి సోఫీ వైరస్ బారినపడ్డారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వాలతో పాటు ఇది పౌరులూ అప్రమత్తం కావాల్సిన సమయం. చికిత్స కన్నా నివారణే ఉత్తమ మార్గం కదా!

ముక్తసరి



**దేవులపల్లి ప్రభాకరరావు**

# ప్రతిఘటనకు పర్యాయపదం

**తన వృత్తి సంపాదనతో భారత వాణిజ్య రాజధాని బొంబాయి నగరాన్ని వేలంలో కొనగలిగిన శక్తి సామర్థ్యాలున్నప్పటికీ పల్ఖీవాలా అతి నిరాడంబరంగా, ధనార్జన కాంక్ష లేకుండా జీవించారు. పార్సీ కుటుంబంలో పుట్టినప్పటికీ, మత దురభిమానానికి అతీతుడై పల్ఖీవాలా హైందవమతాన్ని, భారతీయ సంస్కృతి వైవిధ్యాన్ని, విశిష్టతను ఎంతో గౌరవించారు.**

ఆయన అసాధారణ మనీషి, అచంచల విశ్వాసాల మహర్షి. వైవిధ్య విలసిత భారతీయ సంస్కృతి ఔన్నత్యానికి, ఉదాత్తతకు ఆయన వ్యక్తిత్వం అక్షరాలా ప్రతిబింబం, సమున్నత ప్రతీక. భారత స్వాతంత్ర్య జాతీయ ఉద్యమాల ఆశయాలు, ఆదర్శాలకు, స్వతంత్ర భారత రాజ్యాంగం ప్రాతిపదిక సూత్రాలకు, భారత ప్రజాస్వామ్యానికి, భారత ప్రజాకోటి ప్రాథమిక హక్కులకు, మానవతకు గత ఆరేండ్ల నుంచి ఏదో ఒక వికృత రూపంలో ఎన్నడూ లేని ప్రమాదం వాటిల్లుతున్నదన్న భయాందోళనలు దేశమంతటా రగుల్కొన్న క్లిష్ట సమయంలో ఆయన, ఆయన పోరాటాలు జ్ఞాపకం రావడం సహజం. ఆయన బహుముఖ ప్రతిభావంతుడు, మేధస్సు మేరుపర్వతం ఆయన. ప్రతిభా సంపదలో ఆయన సాటిలేని శ్రీమంతుడు. ఆయన ఎదురులేని న్యాయశాస్త్ర నిష్ణాతుడు. ఆర్థికవేత్త. ఆయన వాగ్విలాసం, వాదనా పటిమ అఖండమైనవి, అద్వితీయమైనవి. గొప్ప వక్త, గొప్ప రచయిత - పలు ప్రశస్త, అమూల్య గ్రంథాలు ఆయన మస్తిష్కంలో మథనమై, ఆయన లేఖిని నుంచి వెలువడినాయి. ఆయన ప్రతిఘటనకు పర్యాయపదం. ఇరువై ఆరేండ్ల యువకుడిగా ఆయన 1946లో, ఒక జూనియర్‌గా, బొంబాయి హైకోర్టులో, న్యాయవాద వృత్తి ప్రారంభించారు. అంతకుముందు జరిగిన ఒక సంఘటన - ప్రఖ్యాత న్యాయవాది ఎం.సి.చాగ్ల (స్వతంత్ర భారతంలో, జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో, వెల్లడైన బహుశా మొదటి కుంభకోణం ముంధ్రా కుంభకోణంపై విచారణకు కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ చైర్మన్ చాగ్ల. చాగ్ల విచారణ ఫలితంగా అప్పటి కేంద్ర ఆర్థికమంత్రి టి.టి.కృష్ణమాచారి, ఆర్థిక కార్యదర్శి హెచ్.ఎం. పటేల్ తదితరులు తమ పదవులకు రాజీనామా ఇచ్చారు.) బొంబాయి హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ బాధ్యత స్వీకరించిన రోజు మధ్యాహ్నం లంచ్ సమయంలో చాగ్ల గదికి ఆయన వెళ్లాడు. ఏ వేళైనా వచ్చి హైకోర్టు గ్రంథాలయంలో పుస్తకాలు చదువడానికి ఆయన చాగ్ల అనుమతి కోరాడు. అనుమతి లభించగానే ఆ గ్రంథాలయంలోని అన్ని పుస్తకాలను చదివిన ఘనత ఆయనది. ఆయనే నానాభాయి అర్దేషిర్ పల్ఖీవాలా. స్వతంత్ర భారతంలో, నియంతృత్వ ధోరణులకు, రాజ్యాంగ దుర్వినియోగానికి, సందు దొరికినప్పుడు ప్రాథమిక హక్కులకు, ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగినప్పుడు ధైర్య సాహసాలతో అనేక ప్రజావేదికలపై గొంతు విప్పి, న్యాయస్థానాల్లో ప్రతిభావంతంగా ప్రతిఘటించిన అచ్చమైన ప్రజాతంత్రవాది నాని పల్ఖీవాలా. వందేండ్ల కిందట, 1920 జనవరి 16న బొంబయిలోని ఒక మధ్య తరగతి పార్సీ కుటుంబంలో నానీ పల్ఖీవాలా జన్మించారు. ఇది ఆయన శతజయంతి సంవత్సరం. భావప్రకటన, పత్రికా స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు పరితపించిన, రాత్రింబగళ్లు నిరంతర పోరాటం జరిపిన యోధుడు, న్యాయశాస్త్ర కోవిదుడు, రాజ్యాంగ విశ్లేషకుడు పల్ఖీవాలా బొంబాయిలో పల్లకీలను ఉత్పత్తి చేసే వంశంలో జన్మించినప్పటికీ జీవితంలో ఎన్నడూ తన కోసం, స్వార్థం కోసం ఎవరి పల్లకీలు మోయలేదు... దేశ ప్రజల ప్రయోజనాల పరిరక్షణ పల్లకీ బోయిగా మాత్రమే ఆయన ఉపయోగపడ్డాడు. నోరు విప్పితే- 'దేశద్రోహం'గా చిత్రిస్తున్న, పసికందులను సైతం 'దేశ ద్రోహులు'గా పరిగణిస్తున్న ఈరోజుల్లో గాంధీ మహాత్ముని మాటలు, ఈ మాటలతో ప్రేరణ పొందిన పల్ఖీవాలా జ్ఞాపకం రావడంలో వింతలేదు. తనకు వ్యతిరేకంగా 'దేశద్రోహం' కేసు పెట్టి (తన నవజీవన్ పత్రికలో నాలుగు వ్యాసాలు రాసినందుకు!) ఆరేండ్ల జైలుశిక్ష విధించినప్పుడు గాంధీజీ అన్న మాటలు- "If we do not nurture the freedom of expressing one's opinion this Country will not go forward.... The smallest of small individuals should have the right to PROTEST". స్వతంత్ర భారత రాజ్యాంగ రచన కమిటీలో సభ్యుడై ప్రముఖ పాత్ర వహించిన కె.ఎం.మున్షీ "The essence of democracy is criticism of government.." అని అన్నారు. స్వతంత్ర భారత రాజ్యాంగంలో, స్వతంత్ర భారతంలో 'దేశద్రోహం' (Sedition) అన్న పదం ఉండరాదని మున్షీ అభిప్రాయపడ్డారు. గాంధీజీ, మున్షీ బాటలో నడిచి పల్ఖీవాలా దేశప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణకు న్యాయశాస్త్ర బద్ధ పోరాటం నడిపారు.

ఒక జూనియర్‌గా న్యాయవాద వృత్తిని ప్రారంభించిన తర్వాత ఆరేండ్లకే (1952లో) పల్ఖీవాలా స్వతంత్రుడై వృత్తిని కొనసాగించారు. అనంతరం కేవలం నాలుగేండ్లకే (1956లో) పల్ఖీవాలా సుప్రీంకోర్టులో ఈ దేశంలోని అల్పసంఖ్యాక వర్గాలకు (మైనారిటీలు) సంబంధించిన 29, 30 అధికరణాల మీద సమర్థవంతంగా వాదించి దేశం దృష్టిని, విశేషించి రాజ్యాంగ రక్షణకు ప్రాధాన్యం ఇచ్చే విద్యావంతుల, మేధావుల, చైతన్యవంతుల దృష్టిని ఆకర్షించారు. సుప్రీంకోర్టులో పలు కీలకమైన కేసుల్లో (గోలక్‌నాథ్ కేసు, కేశవానంద భారతీకేసు, బ్యాంకుల జాతీయాకరణ కేసు, రాభరణాల రద్దు కేసు మొదలైనవి) అపారమైన న్యాయశాస్త్ర వైదుష్యంతో, అత్యంత సమర్థవంతంగా, అద్భుత వాదనాపటిమతో వాదించి పల్ఖీవాలా రాజ్యాంగం ఆధిక్యతను నిరూపించారు. కేశవానంద భారతి కేసులో, సుప్రీంకోర్టులో, పల్ఖీవాలా ఐదు నెలలు వాదించి చరిత్ర సృష్టించారు. ఈ కేసు ప్రాథమిక హక్కుల కేసుగా ప్రపంచ ప్రసిద్ధి పొందింది. భారత రాజ్యాంగం ప్రాతిపదిక స్వరూపాన్ని-బేసిక్ స్ట్రక్చర్‌ను (ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులు) మార్చే హక్కు, అధికారం భారత పార్లమెంట్‌కు సైతం లేదని సుప్రీంకోర్టు 1973లో మహత్తరమైన తీర్పు ఇవ్వడంలో పల్ఖీవాలా పాత్ర కీలకమైనది, చిరస్మరణీయమైనది. కొన్నేండ్లు కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌ను విశ్లేషిస్తూ (చేతిలో కాగితం ముక్కయినా లేకుండా) దేశమంతటా పర్యటించి పల్ఖీవాలా కావించిన వందలాది ప్రసంగాలు, ప్రజాస్వామ్య పరిరక్షణకు వేల వేదికలపై ఆయన కావించిన విజ్ఞానప్రద ఉపన్యాసాలు మరో చరిత్రను సృష్టించాయి.

తన వృత్తి సంపాదనతో భారత వాణిజ్య రాజధాని బొంబాయి నగరాన్ని వేలంలో కొనగలిగిన శక్తి సామర్థ్యాలున్నప్పటికీ పల్ఖీవాలా అతి నిరాడంబరంగా, ధనార్జన కాంక్ష లేకుండా జీవించారు. పార్సీ కుటుంబంలో పుట్టినప్పటికీ, మత దురభిమానానికి అతీతుడై పల్ఖీవాలా హైందవమతాన్ని, భారతీయ సంస్కృతి వైవిధ్యాన్ని, విశిష్టతను ఎంతో గౌరవించారు. భారతీయ సంస్కృతీ వికాసం పరమావధిగా కె.ఎం.మున్షీ స్థాపించిన భారతీయ విద్యాభవన్‌తో పల్ఖీవాలాకు యాభై ఏండ్ల అనుబంధం. 1990 నుంచి ఆయనే భవన్ ఉపాధ్యక్షుడు. చేతికి వచ్చిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి పదవిని, భారత ప్రభుత్వ అటార్నీ జనరల్ పదవిని చిరునవ్వుతో తృణీకరించిన త్యాగమూర్తి పల్ఖీవాలా. పల్ఖీవాలా వాదనలు, ఆయన విశ్వాసాలు, అభిప్రాయాలు తమకు నచ్చకపోయినప్పటికీ అప్పటి కేంద్ర ప్రభుత్వ నాయకులు ఆయనను 'పద్మవిభూషణ్' బిరుదంతో సత్కరించారు. ఆయన అరవింద మహర్షి శిష్యుడు. ఆది శంకరాచార్యుల బోధనలను, సిద్ధాంతాలను, తాత్త్వికతను, రచనలను పల్ఖీవా లా శ్రద్ధాసక్తులతో అధ్యయనం చేశారు. మొరార్జీ ప్రభుత్వం పల్ఖీవాలాను అమెరికాలో మన రాయబారిగా నియమించింది. ఏడు విశ్వవిద్యాలయాలు పల్ఖీవాలాను గౌరవ డాక్టరేట్లతో సన్మానించాయి. ప్రాథమిక, మానవహక్కుల పరిరక్షణ కోసం పల్ఖీవాలా ఉద్యమించారని ప్రిన్స్‌టన్, (యూఎస్ఏ) వర్సిటీ ప్రశంసించింది. భారతదేశానికి భగవంతుడు ప్రసాదించిన కానుక పల్ఖీవాలా అని సి.రాజగోపాలచారి ప్రశంసించారు.



**భారతీయ విద్యాభవన్‌తో పల్ఖీవాలాకు యాభై ఏండ్ల అనుబంధం. 1990 నుంచి ఆయనే భవన్ ఉపాధ్యక్షుడు. చేతికి వచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవిని, భారత ప్రభుత్వ అటార్నీ జనరల్ పదవిని చిరునవ్వుతో తృణీకరించిన త్యాగమూర్తి పల్ఖీవాలా. పల్ఖీవాలా వాదనలు, ఆయన విశ్వాసాలు, అభిప్రాయాలు తమకు నచ్చకపోయినప్పటికీ అప్పటి కేంద్ర ప్రభుత్వ నాయకులు ఆయనను 'పద్మవిభూషణ్' బిరుదంతో సత్కరించారు. ఆయన అరవింద మహర్షి శిష్యుడు.**

దాదాపు మూడు వందల ఏండ్ల రాచరిక, ముష్కరపాలన నుంచి కేసీఆర్ వజ్ర సంకల్పంతో, భీష్మ ప్రతిజ్ఞతో విముక్తి పొంది ఆరేండ్ల కిందట స్వతంత్ర భారతదేశంలో చివరి రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ రాష్ట్రం ఆ మహానాయకుని నేతృత్వంలో ప్రగతిపథాన పయనిస్తూ మూడు పూవులు, ఆరు కాయలుగా వికసిస్తూ, అగ్రగణ్య రాష్ట్రంగా తలెత్తి నిలువడం అద్భుత శుభపరిణామం. ఆరేండ్ల కిందట 'ఒక్క పైసా లేదు పో' అన్న తూష్ణీకరణకు గురైన తెలంగాణ ప్రజలు ఈ రోజు ఆర్థిక, సామాజిక, అపూర్వ అభివృద్ధితో, దేశంలోనే అత్యధిక తలసరి సగటు ఆదాయంతో, జాతీయస్థాయి కంటే ఎక్కువ వార్షిక అభివృద్ధి రేటుతో సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల వార్షిక బడ్జెట్‌ను ఇటీవల రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టే ఉన్నత, ఉత్తమ స్థితికి అధిరోహించడం ప్రజాస్వామ్య చరిత్రలో మహోన్నత ఘట్టం. 'ఉప్పొంగి పోయింది గోదావరి' అంటూ నాడు పాడిన కవులు 'గిరులను దాటింది గోదావరి, తరులను చుంబించి గోదావరి, తెలగాణ గోదారి నయగారమొలికింది, తెలంగాణ దరులను తాకింది, సిరులను తెచ్చింది గోదావరి, శివమెత్తి ఆడింది గోదావరి' అని నూతన గీతకలను ఆలాపించవలసి ఉంటుంది.

# విలువలు పెంచేదిగా విద్య

చరిత్ర



**డాక్టర్ పోతరవేణి తిరుపతి**

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో ప్రసంగిస్తూ మన రాష్ట్రంలో 'దిశ' లాంటి ఘటనలు జరుగకుండా ఉండాలంటే కౌమారదశలోని విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధన చేయాలన్నారు. దీనికి అనుగుణంగా ఉన్నత విద్యాశాఖ ద్వారా పాఠ్య ప్రణాళికలను తయారుచేయిస్తున్నట్లు ప్రకటించటం ముదావహం. అయితే నైతిక విలువలతో కూడిన విద్యాబోధన ఎలా జరుగాలి? ఎలా ఉండాలి? అనే అంశాలపై చర్చించుకోవాలి. మానవీయ, నైతిక విలువలతో కూడిన విద్యాబోధన నూటికి నూరు శాతం సామాజిక శాస్త్రాల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఇలాంటి విలువలను బోధించగలిగే సామాజిక శాస్త్రాల్లో చరిత్ర ముఖ్యమైనది.

చరిత్ర అంటే రాజులు, యుద్ధాలు, విప్లవాలు అని చాలా మందికి అపోహ. కానీ మానవ జీవనవికాసాన్ని వివరిస్తూ, భవిష్యత్ తరాలకు గుణపాఠాలను చరిత్ర అందిస్తుంది. చరిత్ర మనిషి సమగ్ర కార్యకలాపాలను వివరిస్తుంది. కాబట్టి ప్రస్తుత కాలంలో చరిత్ర పరిజ్ఞానం సమస్త మానవాళికి అవసరం. మానవజాతికి భవిష్యత్తులో వచ్చే సమస్యలను పరిష్కరించుకునే వివేకం చరిత్ర పరిజ్ఞానంతో మాత్రమే సాధ్యమవుతుందనడంలో సందేహం లేదు.

చరిత్ర ఎందుకు? చరిత్ర వల్ల కలిగే ఉపయోగాలేమిటి? చరిత్రను ఎందుకు చదువాలి? చరిత్రను అధ్యయనం చేస్తే ఉద్యోగాలు వస్తాయా? ఇటువంటి ప్రశ్నలు విద్యార్థుల నుంచే కాకుండా ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల నుంచి కూడా తలెత్తుతున్నాయి. అలాగే చరిత్రను ఒక పోటీ పరీక్షలకు సంబంధించిన సబ్జెక్టుగానే పరిగణిస్తున్నారు. ఒకవైపు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతుండటం వల్ల తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు కూడా ఇంజినీరింగ్, మెడిసిన్, సాఫ్ట్‌వేర్ తదితర కోర్సుల వైపు మొగ్గుచూపుతూ సామాజిక శాస్త్రాలతో కూడిన కోర్సుల పట్ల ముఖ్యంగా చరిత్రతో ముడిపడిన కోర్సుల పట్ల నిరాసక్తతను చూపుతున్నారు.

చరిత్ర నాటినుంచి నేటివరకు మానవ నాగరికతకు చెందిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ, శాస్త్ర సాంకేతిక, అభివృద్ధి విషయాలు వివరిస్తుంది. అలాంటి చరిత్రను విస్మరించడం, చరిత్ర ఎందుకని ప్రశ్నించడం అమాయకత్వమైన భావనగా చెప్పవచ్చు. ప్రతి దేశం తన చరిత్ర, సంస్కృతి పట్ల అధ్యయనాలు పరిశోధనలు చేసుకొని గతకాలపు అనుభవాలను నమోదు చేసుకుంటుంది. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను చారిత్రక దృష్టితో పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తుంది. చరిత్రను నిర్లక్ష్యం చేసిన దేశం, ప్రాంతం, జాతులు మనుగడలో ఉన్నట్లు దాఖలాల్లేవు. ఒక దేశం తన చరిత్ర, సంస్కృతిని తెలుసుకోకుంటే వేర్లు లేని చెట్టుతో సమానం. అలాగే ఏ దేశంలోనైనా విద్యార్థులకు, యువతకు చరిత్ర జ్ఞానం లేకుంటే నిర్వీర్యమవుతారు. నేటి విద్యార్థుల్లో చరిత్ర స్పృహ లేకపోవడం వల్ల దేశం పట్ల, మతాల పట్ల, జాతీయ నాయకుల పట్ల, తల్లిదండ్రుల పట్ల, గురువుల పట్ల, వారు నివసించే సమాజం పట్ల సరైన అవగాహన ఉండటం లేదు.

చరిత్ర చదివిన ఒక విద్యార్థి ఒక డాక్టర్ కాకపోవచ్చు, ఇంజినీర్ కాకపోవచ్చు. కానీ ఒక సమాజంలో మానవీయ, నైతిక విలువలతో కూడిన సామాజిక తార్కిక ఆలోచనలు కలిగిన పరిపూర్ణుడవుతాననడంలో సందేహం లేదు. ఒక డాక్టర్ రోగికి రోగం నయం చేయాలంటే రోగి లక్షణాలు, రోగం కారణాలు, రోగి ఎంతకాలం నుంచి బాధపడుతున్నాడు, ఆ రోగం వంశపారంపర్యమైనదా లేదా, ఆ రోగం గతంలో ఏ విధంగా నయమైందనే గతానికి సంబంధించిన విషయాలపై అధ్యయనం చేసిన తర్వాతనే చికిత్స చేస్తాడు. అలాగే ఒక ఇంజినీర్ కూడా భావితరాలకు ఉపయోగపడే నీటి ప్రాజెక్టును రూపకల్పన చేయడంలో రిజర్వాయర్ ఎంతకాలం నుంచి ఉన్నది, దానికివచ్చే నీటి మార్గాలు, గతంలో ఎంత నీరు నిల్వ ఉండేవని గతానికి చెందిన పలు విషయాలను అధ్యయనం చేస్తాడు. అదేవిధంగా ప్రభుత్వం కూడా ప్రజా సంక్షేమం కోరే ఒక పథకానికి రూపకల్పన చేయాలంటే ప్రజల అభివృద్ధికి సంబంధించి గత విషయాలను అధ్యయనం చేసే ముందుకువెళ్తుంది. పై విషయాలను బట్టి డాక్టరైనా, ఇంజినీరైనా, ప్రభుత్వమైనా గత అధ్యయనం ద్వారానే తమ పనితీరును మెరుగుపరుచుకుంటాయి.

**సాంకేతికాభివృద్ధి తోడుగా సమాజాభివృద్ధి జరుగాలంటే సాంకేతిక కోర్సులతోపాటు సామాజిక శాస్త్రాలకు సంబంధించిన కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. సమాజాభివృద్ధి జరిగిన ప్రాంతంలో సాంకేతికాభివృద్ధి త్వరగా జరుగుతుంది. ప్రభుత్వాలు పూర్తిగా సాంకేతిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తే సామాజిక విలువలు, మానవీయత పూర్తిగా కుంటుపడిపోతాయి. నేరాలు, ఘోరాలు, అఘాయిత్యాలు, అత్యాచారాలు ఎక్కువయ్యే అవకాశం ఉన్నది.**

సాంకేతికాభివృద్ధి తోడుగా సమాజాభివృద్ధి జరుగాలంటే సాంకేతిక కోర్సులతో పాటు సామాజిక శాస్త్రాలకు సంబంధించిన కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. సమాజాభివృద్ధి జరిగిన ప్రాంతంలో సాంకేతికాభివృద్ధి త్వరగా జరుగుతుంది. ప్రభుత్వాలు పూర్తిగా సాంకేతిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తే సామాజిక విలువలు, మానవీయత పూర్తిగా కుంటుపడిపోతాయి. నేరాలు, ఘోరాలు, అఘాయిత్యాలు, అత్యాచారాలు ఎక్కువయ్యే అవకాశం ఉన్నది. కాబట్టి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో చెప్పినట్లు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన బోధన అవసరమని చెప్పక తప్పదు. కాబట్టి మానవీయ, నైతిక విలువలతో కూడిన విద్యాబోధన కోసం ఇంటర్, డిగ్రీ విద్యలో చరిత్రను కామన్ సబ్జెక్టుగా చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ దిశగా విస్తృతస్థాయిలో చర్చ జరిగి ఒక సమగ్ర విద్యాబోధనకు పునాది పడాల్సిన ఆవశ్యకత ఉన్నది.

# పల్లెకు సరి పట్టణానికి నిధి

బడ్జెట్



**డాక్టర్ బైరి నిరంజన్**

ఒకవైపు కరోనా ఆర్థికమాంద్యం ఉరుముతూ ఉరకలెత్తిస్తున్నది. మరోవైపు కేంద్రం ఇవ్వవలసిన నిధులు ఇవ్వకుండా సహాయ నిరాకరణ చేస్తున్నది. ఇంకోవైపు ప్రైవేట్ కార్పొరేట్ బ్యాంకులు అవినీతిమయ ఆర్థిక అవకతవకలు, నిధుల మళ్లింపు కొనసాగుతున్నయి. ఇలాంటి క్లిష్ట సమస్యల ముందర సంక్షేమానికి, సమ్మిళిత అభివృద్ధికి గ్రామాలు, పట్టణాల మధ్య కేటాయింపుల్లో సమతుల్యత పాటిస్తూ రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థికమంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టడం ఆహ్వానించదగిన పరిణామం. 2011 జాతీయ గణాంకాల సర్వే ప్రకారం తెలంగాణ రాష్ట్ర పట్టణ జనాభా 2026 నాటికి 50 శాతం పెరిగి 2036 నాటికి గ్రామీణ జనాభా 40 శాతానికి పడిపోయి 60 శాతం మంది ప్రజలు పట్టణాల్లో నిసించే అవకాశం ఉన్నది. అయితే ఎక్కువగా హైదరాబాద్ జనాభా అదనంగా 40 శాతం పెరిగే అవకాశం ఉన్నది. 'లియాసిస్ పారిస్ రియల్ ఎస్టేట్ రేటింగ్స్ పరిశోధన' సంస్థ 2019లో చేసిన సర్వేలో దేశంలో మొదటి అతిపెద్ద 35 నగరాల్లో ఇండ్ల కొనుగోలు 2 శాతం మేరకు తగ్గిపోయి ఖాళీగా ఇండ్లు మిగిలాయి. దీంతో ఆయా నగరాల్లో 13 లక్షల 10 వేల ఇండ్ల కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇంకా చెప్పాలంటే గ్రేటర్ ముంబైలో 7 శాతం, చెన్నైలో 9 శాతం మేర ఇండ్ల కొనుగోళ్లు తగ్గిపోయాయి. హైదరాబాద్‌లో మాత్రమే 5 శాతం మేరకు ఇండ్ల కొనుగోళ్లు గతం కంటే పెరిగాయి.

'యూఎస్ పాపులేషన్ డివిజన్' 2018లో జరిపిన సర్వే ప్రకారం 2015-20 కాలంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఉండటం రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి నమూనాను తెలియజేస్తున్నది. పై విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని సీఎం కేసీఆర్ కళ్లలో కదులుతున్న 'కోటి ఎకరాల మాగాణి' నినాద పునాదులపై 'కోటి జనాల జీవన ప్రమాణాల జాన' అనేవిధంగా హైదరాబాద్ ప్రజలు అత్యున్నతమైన, సురక్షితమైన జీవనం కొనసాగించడానికి ఉక్కు సంకల్పంతో అభివృద్ధిలో దూసుకుపోతున్నారు. ఇందులో భాగంగానే ప్రతి నెల సుమారు రూ.వెయ్యి కోట్లు నగరాభివృద్ధి కోసం ఖర్చుచేయడానికి కేటాయింపులు చేస్తున్నారు. మొత్తం లక్ష కోట్ల ప్రగతి పద్దులో ఇది 10 శాతంగా ఉండటం గమనార్హం. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశంలోని అన్ని పట్టణాలకు కలిపి రూ.50 వేల కోట్లు కేటాయిస్తే, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం కేటాయించిన కేటాయింపుల్లో 20 శాతం ఒక్క హైదరాబాద్‌లోనే ఈయేడు ఖర్చు పెట్టబోతున్నది. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణ, నగరాలకూ రూ.4 వేల కోట్లు కనీస మౌళిక వసతులు, జీవనప్రమాణాల పెంపు కోసం నిధులు వెచ్చించబోతున్నది.

2011 జనాభా గణాంకాల ప్రకారం దేశంలో 13.4 శాతం కుటుంబాలకు స్థిర నివాసం లేదని తేలింది. అందులో పట్టణ ప్రాంతంలో నివసించేవారే ఎక్కువ. ఉమ్మడి పాలకులు చేసిన అవినీతి కారణంగా జాతీయ సగటు కంటే 50 శాతం ఎక్కువగా ఇండ్లు లేని వారున్నారు. అలాగే 1961 జాతీయ గణాంకాల ప్రకారం పట్టణాల్లో సొంత ఇండ్లు లేని కుటుంబాలు 46 శాతం ఉంటే 57 ఏండ్ల తర్వాత కూడా 2018 ఆర్థిక సర్వే ప్రకారం 28 శాతం ప్రజల సొంతింటి కల ఇంకా నెరవేరలేదు. ఇలాంటి సమస్యలున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సొంతిల్లు లేని నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు కట్టియ్యాలనే ఉద్దేశంతో రెండు పడకల ఇండ్ల నిర్మాణానికి 2018 పద్దుల ప్రకారం రూ. 22 వేల కోట్ల వ్యయంతో 2.83 లక్షల ఇండ్లను నిర్మించి ఇవ్వాలని సంకల్పించింది. అందులో లక్ష ఇండ్లు ఒక్క హైదరాబాద్‌లోనే కడుతామని చెప్పి అమలుచేస్తున్నారు. ఇప్పటివరకు 40 శాతం పూర్తయ్యాయి. మొత్తం పూర్తయితే ఒక్క హైదరాబాద్‌లోనే దాదాపు 6 లక్షల జనాభాకు తమ సొంతింట్లో నిద్రించే మహాభాగ్యం కలుగుతుంది. అందుకే ఈ బడ్జెట్‌లో గతం కంటే 10 రెట్ల నిధులను పెంచారు.

ఇక పల్లె ప్రజల జీవనప్రమాణాలు, ఆయురార్ధం పెంచడానికి, ఎవరి సహాయం లేకుండా స్వశక్తితో వ్యవసాయం చేసి మంచి దిగుబడి పొందడానికి, మానసిక స్థైర్యంతో జీవనం కొనసాగించడానికి బడ్జెట్‌లో ప్రగతి పద్దు కింద రూ.42,729 కోట్లను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, అనుబంధశాఖల రూపేణా నిధులను కేటాయించింది. ఇది మొత్తం ప్రగతి పద్దులో 43 శాతం కావడం 60 శాతం గ్రామీణ జనాభాకు లబ్ధి చేకూరనున్నది.

**కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశంలోని అన్ని పట్టణాలకు కలిపి రూ.50 వేల కోట్లు కేటాయిస్తే, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం కేటాయించిన కేటాయింపుల్లో 20 శాతం ఒక్క హైదరాబాద్‌లోనే ఈయేడు ఖర్చు పెట్టబోతున్నది. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణ, నగరాలకూ రూ.4 వేల కోట్లు కనీస మౌళిక వసతులు, జీవనప్రమాణాల పెంపు కోసం నిధులు వెచ్చించబోతున్నది.**

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నది. వారి సంప్రదాయ వృత్తులను ప్రోత్సహిస్తున్నది. చేపల ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ మూడవ అతిపెద్ద ఉత్పత్తి కేంద్రం. ఈ రంగంలో కోటి నలభై లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. పాలు, మాంసం ఉత్పత్తిలో యూపీ వాటా అమోఘం. సంప్రదాయ, స్వయం ఉపాధి ఉత్పత్తి, సేవారంగాలను ఉమ్మడి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రాంతానికి రావలసిన లాభాలు రాకుండా చేశారు. కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో బర్లు, గొర్లు, మేకలు పంపిణీ చేస్తున్నది. దీనివల్ల ఈ యేడాది జాతీయ సగటు కంటే రెండింతల వృద్ధి సాధించింది తెలంగాణ రాష్ట్రం. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉపాధి అవకాశాలు పెరిగాయనడంలో సందేహం లేదు.


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

# నేటినుంచి సిద్ధరామేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు

**భిక్కనూర్(రాజంపేట):** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కామారెడ్డి జిల్లా భిక్కనూరులోని సిద్ధరామేశ్వరాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శనివారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందుకోసం దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. వేసవి దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. మొదటి రోజు శనివారం పుణ్యాహ వచనం, మాతృక నాంది, అంకురార్పణ, అఖండ దీపారాధన, స్వామివారికి రుద్రాభిషేకం, మాతా భువనేశ్వరీ దేవికి కుంకుమార్చన, శ్రీ సిద్ధగిరి సమాధి వరకు ఊరేగింపు.. అనంతరం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఆలయ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈవో వెంకటనారాయణ తెలిపారు.



## ✦ క్షీరాభిషేకం

బతుకమ్మ చీరెలకు నూలు సబ్సిడీని మంజూరు చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో వపర్‌లూమ్ మ్యాక్స్ సంఘాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. వస్త్ర పరిశ్రమలో విప్లవాత్మక మార్పులకు మంత్రి కేటీఆర్ బతుకమ్మ చీరెల ఆర్డర్లతో శ్రీకారం చుట్టారని సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిమ్మని ప్రకాశ్ కొనియాడారు. - సిరిసిల్ల టౌన్



## ✦ అవును.. ఇది సర్కారు బడే

దాతల సాయంతో రూపు రేఖలు మార్చుకొన్నది రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాల. 1978లో ఏర్పాటైన ఈ బడి గోడలపై దాతల సహకారంతో ఆకట్టుకునే చిత్రాలు వేయించారు. సర్పంచ్ దమ్మని లక్ష్మి, మాజీ సర్పంచ్ బొల్లవేణి మంజుల, విద్యా కమిటీ చైర్మన్ దాతల తోడ్పాటుతో రూ.50 వేలు ఖర్చుచేసి విద్యార్థులను ఆకట్టుకునేలా పెయింటింగ్ చేయించారు.

- ఇల్లంతకుంట



# పాలుపోయకుంటే సభ్యత్వం రద్దు

**విజయడెయిరీ బోర్డు సమావేశంలో మంత్రి తలసాని**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విజయ డెయిరీలో సభ్యత్వం ఉండి పాలుపోయని పాడి సొసైటీల ప్రక్షాళన చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధకశాఖ కాన్ఫరెన్స్‌హాలులో విజయడెయిరీ 10వ బోర్డు సమావేశం చైర్మన్ లోక భూమారెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మంత్రి తలసాని మాట్లాడుతూ.. డెయిరీకి పాలుపోయని రైతుల సమాచారం జిల్లాల వారీగా తెప్పించాలని, అవసరమైతే సభ్యత్వాలను రద్దుచేసేందుకు వెనుకాడేది లేదన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి అనిత రాజేంద్రన్, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# రాములోరి పెండ్లికి ఏర్పాట్లు

- అధికారులతో సమీక్షించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- భక్తుల సంఖ్యకు అనుగుణంగా వసతి కల్పించాలని సూచన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణ వేడుకను ఘనంగా నిర్వహించాలని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై శుక్రవారం దేవాదాయశాఖ అధికారులతో అరణ్యభవన్‌లోని తన కార్యాలయంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాములోరి పెండ్లి వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు జరిగే భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏప్రిల్ 1న ఎదుర్కోలు ఉత్సవం, 2న కల్యాణ మహోత్సవం, 3న మహాపట్టాభిషేకం కార్యక్రమాలు ఉంటాయని ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, అదనపు కమిషనర్ శ్రీనివాస్ రావు, ఈవో నర్సింహులు పాల్గొన్నారు.

## ✦ రైతులకు పరిహార చెక్కులు పంపిణీ



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు సమీపాన నిర్మించనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు భూమిని అందించిన రైతులకు శుక్రవారం తాసిల్దార్ సుమ పరిహారం చెక్కులను అందజేశారు. మంత్రి కేటీఆర్ సహకారంతో ఎగువ మానేరు ప్రాజెక్టు కేంద్రంగా.. ప్రభుత్వం ఈ ప్రాంత వాసులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నది. - గంభీరావుపేట

# వాటర్ ట్యాంకు ఎక్కిన జవాన్

**కేంద్రహోంమంత్రి అపాయింట్‌మెంట్ కోసం ఆందోళన**



కేంద్రహోం మంత్రికి రాసిన లేఖను చూపిస్తున్న మహేశ్

**కమలాపూర్:** ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేకపోతున్నానని, కేంద్రహోం మంత్రి అమిత్‌షా అపాయింట్‌మెంట్ ఇప్పించాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని ఓ జవాన్ వాటర్ ట్యాంక్ ఎక్కడం కలకలం రేపింది. ఈ ఘటన వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలం శనిగరంలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసుల చొరవతో రెండు గంటల తర్వాత కిందికి దిగి మీడియాకు తన గోడు వెళ్లబోసుకున్నాడు. కమలాపూర్ మండలం మాదన్నపేటకు చెందిన మార్త మహేశ్ 2013లో సీఐఎస్‌ఎఫ్ జవాన్‌గా విధుల్లో చేరాడు. ఎలాంటి రిమార్క్ లేకుండా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బచేలీ యూనిట్‌లో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్ వేధింపులకు గురిచేస్తున్నట్టు కన్నీటిపర్యంతమయ్యాడు. నెలరోజులుగా జ్వరంతో బాధపడుతున్నా సెలవు ఇవ్వడం లేదని ఆరోపించాడు. పైఅధికారులకు ఫిర్యాదు చేస్తే తనపైనే దాడి చేసి గాయపరిచారనీ, ఏరియా దవాఖానలో వైద్యం చేయించుకుని ఇంటికి వచ్చానని తెలిపాడు. విధుల్లో చేరితే తనను చంపేస్తారనే భయంతో పారిపోయివచ్చానని వాపోయాడు. బచేలీ యూనిట్‌లో అధికారులంతా ఏకమై తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని చెప్పాడు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అపాయింట్‌మెంట్ ఇస్తే జవాన్ల బాధలు చెపుతానని, లేదంటే తనకు ఆత్మహత్యే శరణ్యమని తెలిపాడు.



వాటర్ ట్యాంకుపై మహేశ్

## ✦ సరస్వతి బరాజ్‌కు నీటితరలింపు



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన లక్ష్మి పంప్‌హౌస్‌లో శుక్రవారం 9వ, 11వ మోటర్లను నడిపించారు. ఇక్కడి నుంచి 4,600 క్యూసెక్కుల నీటిని సరస్వతి బరాజ్‌కు తరలించారు. - కాళేశ్వరం





తునికిబొల్లారంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో గృహప్రవేశం చేసిన కుటుంబాలతో సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, ఎఫ్‌డీసీ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి... ఆర్అండ్ఆర్ కాలనీ సముదాయం

# కొత్తిండ్ల సంబురం

## తునికిబొల్లారం ఆర్అండ్ఆర్ కాలనీలో ఆనందంగా గృహప్రవేశాలు

- తరలొచ్చిన కొండపోచమ్మ ముంపు గ్రామాలు
- సౌలతులు చూసి మురిసిన నిర్వాసితులు
- తాజాగా బైలంపూర్ వాసుల రాక
- కేసీఆర్ ఆర్అండ్ఆర్ కాలనీగా నామకరణం

**గజ్వేల్ అర్బన్:** ప్రాజెక్టు నిర్మాణంలో ఊరుపోయిందన్న బాధ ఉన్నా.. అంతకుమించిన వసతులతో నిర్మించిన ఆర్అండ్ఆర్ కాలనీల్లో పండుగ వాతావరణంలో గృహప్రవేశాల సందడి.. ఇది సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు మండలం తునికిబొల్లారం ఆర్అండ్ఆర్ కాలనీలో శుక్రవారం కన్పించిన దృశ్యం. అక్కడ కల్పించిన సౌకర్యాలను చూసి మురిసిపోయారు కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్వాసితులు. కొత్త కాలనీయే బాగుందని సంబురపడుతూ.. దానికి కేసీఆర్ ఆర్అండ్ఆర్ కాలనీగా నామకరణం చేయాలని తీర్మానం చేయగా కలెక్టర్ అంగీకారం తెలిపారు.

### సకల హంగులతో..

కొండపోచమ్మ జలాశయం ముంపునకు గురవుతున్న బైలంపూర్ గ్రామస్థులకు ములుగు మండలం తునికిబొల్లారం ఆర్అండ్ఆర్ కాలనీలో 234 ఇండ్లు కేటాయించగా వీటి గృహప్రవేశాలను శుక్రవారం పండుగ వాతావరణంలో నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కొండపోచమ్మ సాగర్ ముంపు బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంతోపాటు సకల వసతులతో, అన్ని మౌలిక సదుపాయాలతో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మించింది. ముంపు గ్రామాలైన తానేదార్‌పల్లి, తానేదార్‌పల్లి తండా, మామిడ్యాల, బైలంపూర్ గ్రామాల ప్రజలకు తునికిబొల్లారంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ప్రభుత్వం చక్కటి వసతులతో నిర్మించింది. ఇటీవల తానేదార్‌పల్లి, తానేదార్‌పల్లి తండా, మామిడ్యాల గ్రామస్థులు గృహ ప్రవేశాలు చేయగా.. శుక్రవారం బైలంపూర్ వాసులు తమకు కేటాయించిన ఇండ్లలోకి పూజలు చేసి ప్రవేశించారు. ఈ కాలనీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూగర్భ డ్రైనేజీ, విద్యుత్, మిషన్ భగీరథ నీటితోపాటు పాఠశాల భవనం, మార్కెట్ కోసం దుకాణాల సముదాయాలను నిర్మించారు. వివిధ వర్గాలకు సంబంధించి ఆలయాలు, ప్రార్థన మందిరాలను కూడా నిర్మిస్తున్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలో గృహప్రవేశాలు చేయడంతో ముంపు గ్రామాలు ఖాళీ అవుతున్నాయి.



ఆర్అండ్ఆర్ కాలనీలో గృహప్రవేశం చేస్తున్న ఓ కుటుంబం

### కొత్త కాలనీయే మంచిగుంది



ఇప్పటిదాక మేమున్న ఊరు, ఇండ్ల కంటే ప్రభుత్వం నిర్మించిన కొత్త కాలనీ చాలా బాగున్నది. అధికారులు వచ్చి ప్రాజెక్టుల వల్ల కలిగే లాభాలను వివరించారు అందుకు మేము భూములిచ్చేందుకు ముందుకు వచ్చాం. మా పాత ఇండ్ల కంటే సర్కారు ఇచ్చిన ఇండ్లే మంచిగున్నయి. ఊర్లు పోతయని తెలిసినపుడు కొంత భయపడ్డాం. ప్రభుత్వం మాకు అండగా నిలువడంతో సంతోషంగా అంగీకరించాం.

– ఇంద్రారెడ్డి–అనసూయ, భూనిర్వాసితులు

### ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



మా త్యాగాన్ని యాదిపెట్టుకొని సర్కారు చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు కూడా ఇప్పించింది. భూములు పోతయనప్పుడు మా బతుకులు ఆగమైతాయనుకన్నం. కానీ అధికారులు, సర్కారు మా వెంబడి నిలబడి మాకు ధైర్యం చెబుతూ మమ్ములను ముందుకు నడిపినారు. సర్కారు ఇచ్చిన ఇండ్లు మంచిగున్నయి. మేమందరం సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి రుణపడి ఉంటం.

– కృష్ణారెడ్డి–ప్రేమలత, భూనిర్వాసితులు

## కాలనీకి కేసీఆర్ పేరు..

ముంపువాసుల కోరిక మేరకు తునికిబొల్లారంలో నిర్మించిన కాలనీకి కేసీఆర్ ఆర్అండ్ఆర్ కాలనీగా నామకరణం చేసినట్టు సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. 'ఇంత మంచి సౌలతులతో మాకు కాలనీ నిర్మించారు. సీఎం కేసీఆర్ సార్ మమ్మల్ని మంచిగ చూసుకున్నారు. ఆర్అండ్ఆర్ కాలనీకి ఆయన పేరుపెట్టుకుందాం' అని తీర్మానం చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. వారి కోరిక మేరకు 'కేసీఆర్ ఆర్అండ్ఆర్ కాలనీ'గా నామకరణం చేశామని చెప్పారు. కొండపోచమ్మ సాగర్ ముంపు బాధితులకు దేశంలో ఎక్కడా లేనివిధంగా నష్టపరిహారం చెల్లించడంతోపాటు పునరావాసాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఈ స్థాయిలో పునరావాస చర్యలు చేపట్టలేదన్నారు. పునరావాసంలోనూ దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శమని.. ఆర్అండ్ఆర్ కాలనీలే ఉదాహరణగా నిలిచాయన్నారు. పునరావాస ప్రక్రియ పూర్తికావడంతో అతిత్వరలో కొండపోచమ్మ సాగర్ జలాశయాన్ని కాళేశ్వరం నీటితో నింపనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. గృహ ప్రవేశాల వేడుకలో ఎఫ్‌డీసీ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జేసీ పద్మాకర్, ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జహంగీర్, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలు, వారి బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# పెండ్లింట విషాదం

**రోడ్డు ప్రమాదంలో వధువు సోదరుడు, మేనత్త, మరదలు దుర్మరణం**

**నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి వద్ద ఘటన**

**డిచ్‌పల్లి, నమస్తేతెలంగాణ:** రెండు రోజుల్లో పెండ్లి జరగాల్సిన ఇంట్లో విషాదం నెలకొన్నది. శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెండ్లి కూతురి సోదరుడితోపాటు మేనత్త, మరదలు దుర్మరణం చెందారు. దీంతో రెండు కుటుంబాల్లో విషాదం అలుముకున్నది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లికి చెందిన జయ్యు సుమన్(19) శుక్రవారం ఉదయం బైక్‌పై సిరికొండ మండలం కొండాపూర్‌లోని మేనత్త నిమ్మజెట్టి రాజవ్వ (38) ఇంటికి వెళ్లి తన సోదరి పెండ్లి పత్రికను అందజేశాడు. తిరుగు ప్రయాణంలో మేనత్త రాజవ్వ, ఆమె కూతురు అనూష (12)లను తన బైక్‌పై మెంట్రాజ్‌పల్లికి బయలుదేరాడు. డిచ్‌పల్లి సీఎంసీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న బైక్‌కు మరోబైక్ హ్యాండిల్ తగలడంతో సుమన్, రాజవ్వ, అనూష కుడివైపు జాతీయ రహదారిపై పడిపోయారు. ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ అనూష తలపై నుంచి, రాజవ్వ కాళ్లపై నుంచి వెళ్లి సుమన్‌ను ఢీకొట్టింది. దీంతో రాజవ్వ, సుమన్, అనూష అక్కడికక్కడే మృతిచెందారు.



సుమన్, అనూష, రాజవ్వ (ఫైల్)

**పెండ్లి వాయిదా..**

కాగా సుమన్ సోదరి వివాహం ఆదివారం జరగాల్సి ఉన్నది. అంతలోనే రెండు కుటుంబాల్లో పుట్టెడు విషాదం నెలకొంది. 15వ తేదీన జరగాల్సిన వివాహం వాయిదా పడింది. రెప్పపాటులో జరిగిన ఈ ప్రమాదం ముగ్గురిని బలితీసుకున్నది. ప్రమాదానికి కారణమైన పల్సర్ బైక్ వాహనదారుడు పరారీలో ఉన్నాడు. డిచ్‌పల్లి ఎస్సై సురేశ్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పసుపు తాడే.. ఉరితాడై



ఎల్లమ్మ (ఫైల్)

**దంతాలపల్లి(మహబూబాబాద్):** మూడుముళ్ల బంధానికి ప్రతిరూపమైన పసుపు తాడే ఓ మహిళకు ఉరితాడై ప్రాణం తీసింది. ఈ విషాదకర ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం.. దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామానికి చెందిన కనుకుంట్ల ఎల్లమ్మ(55) గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్నది. శుక్రవారం ఉదయం ఆమె తన ఇంటికి తాళం వేసి తాళంచెవిని పసుపుతాడుకు కట్టుకున్నది. రోజులాగే విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన ఎల్లమ్మ తాళం తీసేందుకు ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయింది. ఈ క్రమంలో తాళంచెవి తాళంలో ఇరుక్కొని పసుపు తాడు ఎల్లమ్మ మెడకు బిగుసుకుని ఉరిపడటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలిచివేసింది.

## ఏసీబీ అదుపులో విజిలెన్స్ కానిస్టేబుల్

**కరీంనగర్ క్రైం:** ఇసుక లారీ యజమాని వద్ద రూ.50 వేలు తీసుకున్న కరీంనగర్ విజిలెన్స్ కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ భద్రయ్య కథనం ప్రకారం.. కరీంనగర్ విజిలెన్స్ కానిస్టేబుల్ మురళి తన పరిధి కాకపోయినా జగిత్యాల జిల్లా ధర్మపురికి వెళ్లి ఇసుక తరలిస్తున్న లారీలను ఆపి బెదిరించేవాడు. ఈ క్రమంలో అక్రమంగా తరలిస్తున్నారని షేక్ లాయక్ అనే వ్యక్తి లారీని ఆపి కేసు నమోదు చేస్తామని బెదిరించాడు. కేసు నమోదైతే రూ.1.50 లక్షల జరిమానా కట్టాల్సి వస్తుందని, తనకు రూ.75 వేలు ఇస్తే కేసు కాకుండా చూస్తానని నమ్మించడంతో లారీ యజమాని రూ.50 వేలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. డబ్బులు ఇచ్చిన అనంతరం కరీంనగర్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి లారీ యజమాని ఫిర్యాదు చేశాడు. దీనిపై విజిలెన్స్ అధికారి రామారావు ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు విచారణ చేపట్టి మురళి లంచం తీసుకున్నది నిజమేనని గుర్తించారు. శుక్రవారం మురళిని అదుపులోకి తీసుకున్నారు. రూ.50 వేల నగదు రికవరీ చేశారు.



నూతన వధూవరులు ఖాసీం-లావణ్యతో గ్రామ పెద్దలు

## గ్రామస్థులే పెండ్లి పెద్దలై..

**అనాథలకు వివాహం**

**మరికల్:** వేర్వేరు కారణాలతో తల్లిదండ్రులు, తోడబుట్టిన వారిని కోల్పోయిన ఆ యువతీ యువకుల పెండ్లికి గ్రామస్థులే పెద్దలయ్యారు. వివరాల్లోకి వెళితే.. నారాయణపేట జిల్లా మరికల్ మండలకేంద్రానికి చెందిన సీమ మాసన్న–మణెమ్మ దంపతులకు లావణ్యతోపాటు చిన్న కూతురు ఉండేది. వ్యవసాయంలో నష్టాలు పెరిగి కుటుంబం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దీంతో 2004లో ఏడాదిన్నర వయస్సున్న చిన్న కూతురుతోపాటు దంపతులు 2004లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అనంతరం లావణ్య తాత హన్మంత్ ఇంట్లో పెరిగింది. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం కొత్లాబాద్‌కు చెందిన ఖాసీంతో లావణ్యకు పెళ్లి నిశ్చయమైంది. ఖాసింకు కూడా తల్లిదండ్రులు లేకపోవడంతో గ్రామస్థులు, కులపెద్దలు కలిసి మాధ్వారా రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వీరికి వివాహం జరిపించారు.

## తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలు

**పెంట్లవెల్లి:** నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రం సమీపంలోని మహిబాషా దర్గా వద్ద తేనెటీగలు దాడి చేయడంతో 20 మందికి గాయాలయ్యాయి. పెంట్లవెల్లి సమీపంలోని రాజాబావి ప్రాంతంలోని మహిబాషా దర్గా వద్ద పలు గ్రామాల ప్రజలు కందూరు చేయడానికి వచ్చారు. అక్కడే చెట్టుపై తేనెటీగలు ఉన్న విషయాన్ని గమనించక, వంటలు చేయడానికి పొయ్యి వెలిగించగా ఒక్కసారిగా తేనెటీగలు దాడిచేయడంతో 20 మందికి గాయాలు కాగా ప్రథమ చికిత్స నిమిత్తం కొల్లాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు.

## కొక్కెర వ్యాధితో 12 వేల కోళ్లు మృత్యువాత

**వరంగల్ సబర్బన్, నమస్తే తెలంగాణాణ:** వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని పౌల్ట్రీఫారంలో రెండు రోజుల్లోనే 12 వేల కోళ్లు మృత్యువాతపడ్డాయి. బాధిత రైతు శ్రీకాంత్ వైద్యులను సంప్రదించగా కొక్కెర వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయని ప్రాథమికంగా నిర్ధారించారు. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేకపోవడంతో తప్పని పరిస్థితిలో జేసీబీ సహాయంతో భారీ గొయ్యి తీసి చనిపోయిన, బతికున్న కోళ్లనన్నింటిని పూడ్చేశారు. వైరస్ మిగతా ఫారాలకు వ్యాపించకుండా సున్నం, ఇతర రసాయనాలతో పరిసరాలను శుద్ధిచేశారు. ఈ అంతుచిక్కని వ్యాధితో సుమారు రూ. 10 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటనారాయణను సంప్రదించగా జిల్లాలో కొక్కెర వ్యాధి విజృంభిస్తున్నదని రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# తమ్ముడితోపాటే అన్న మృతి

- భీంపల్లిలో విషాదం

**కమలాపూర్:** తమ్ముడు మరణించాడని తెలియడంతో కడసారి చూపుకోసం వచ్చిన అన్న గుండె ఆగిపోయి మృతి చెందిన విషాదకర ఘటన వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్నది. భీంపల్లి గ్రామస్థుల కథనం ప్రకారం.. బచ్చుల సదయ్య(41), బచ్చుల రాజు(50) అన్నదమ్ములు. సదయ్య స్వగ్రామం భీంపల్లిలోని సోదరి ఇంటి వద్ద ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. బచ్చుల రాజు గోదారిఖనిలో భిక్షాటన చేసుకుంటూ భార్యాపిల్లలను పోషించుకుంటున్నాడు. సదయ్య గురువారం బాత్‌రూమ్‌లో కాలు జారి పడటంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తమ్ముడి కడసారి చూపు కోసం భీంపల్లికి వచ్చిన అన్న రాజుకు ఛాతిలో నొప్పి రావడంతో తమ్ముడి మృతదేహం పక్కనే కుప్పకూలాడు. తమ్ముడి అంత్యక్రియలకు వచ్చిన అన్న మృతిచెందడంతో సదరు కుటుంబ సభ్యులను, గ్రామస్థులను కలిచివేసింది.

# ఏడు నెలల్లో తొలిసారి

■ ఫిబ్రవరిలో 2.91 శాతం పెరిగిన ఎగుమతులు

**న్యూఢిల్లీ, మార్చి 13:** ఎట్టకేలకు ఎగుమతులు వృద్ధి నమోదైంది. ఫిబ్రవరి నెలకుగాను ఎగుమతులు 2.91 శాతం పెరిగి 27.65 బిలియన్ డాలర్లుగా నమోదైనట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. గడిచిన ఏడు నెలల్లో వృద్ధిని నమోదు చేసుకోవడం ఇదే తొలిసారి. ఇదే సమయంలో దిగుమతులు 2.48 శాతం పెరిగి 37.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీంతో వాణిజ్య లోటు(దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసం) 9.85 బిలియన్ డాలర్లుగా ఉన్నది. క్రితం ఏడాది ఇదే నెలలో లోటు 9.72 బిలియన్ డాలర్లు. గత నెలలో భారత్ 10.76 బిలియన్ డాలర్ల విలువైన చమురును దిగుమతి చేసుకున్నది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో చేసుకున్న 9.41 బిలియన్ డాలర్లతో పోలిస్తే 14.26 శాతం అధికం. కాగా, గతేడాది ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి మధ్యకాలంలో ఎగుమతులు 1.5 శాతం తగ్గి 292.91 బిలియన్ డాలర్లకు పడిపోగా, దిగుమతులు కూడా 7.30 శాతం తగ్గి 436 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దీంతో వాణిజ్యలోటు 143.12 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

## సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్‌గా సతీశ్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 13:** హైదరాబాద్ కేంద్రస్థానంగా పనిచేస్తున్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ చైర్మన్ సతీశ్ రెడ్డి.. 2020-21 ఆర్థిక సంవత్సరానికిగాను భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) సదరన్ రీజియన్ చైర్మన్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుత సంవత్సరానికిగాను ఆయన వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సీఐఐ జాతీయ ఫార్మా కమిటీ చైర్మన్‌గా పనిచేసిన సతీశ్ రెడ్డి..సీఐఐ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ చైర్మన్‌గా కూడా పనిచేశారు. అలాగే కెవిన్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ సీకే రంగనాథన్..డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

## ఐవోసీ మధ్యంతర డివిడెండ్ రూ.4.25

**న్యూఢిల్లీ, మార్చి 13:** ప్రభుత్వరంగ చమురు సంస్థ ఐవోసీ శుక్రవారం తన వాటాదారులకు మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఒక్కో షేర్‌కు రూ.4.25 చొప్పున డివిడెండ్ ఇవ్వనున్నట్టు తెలిపింది. దీంతో ఐఓసీలో 51.50 వాటా కలిగివున్న కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్, పన్నులు కలిపి రూ.2,060 కోట్లు లభించనున్నాయి. ఈ డివిడెండ్‌ను ఈ నెల 31లోగా తమ వాటాదారుల ఖాతాల్లో జమచేయనున్నామని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఐఓసీ పేర్కొన్నది.



# హైదరాబాద్‌లో స్పైస్‌జెట్ కేంద్రం

### జీఎమ్మార్ ఏవియేషన్ సెజ్‌తో ఒప్పందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎమ్మార్ ఏరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్కులో స్పైస్‌జెట్ తమ వేర్‌హౌస్‌ను, వాణిజ్య కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నది. ఈ మేరకు జీఎమ్మార్ హైదరాబాద్ ఏవియేషన్ సెజ్ లిమిటెడ్ (జీహెచ్ఏఎస్ఎల్)తో ఒప్పందాన్ని కుదుర్చుకొన్నట్టు స్పైస్‌జెట్ శుక్రవారం ప్రకటించింది. తొలుత 33 వేల చదరపు అడుగల విస్తీర్ణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నామని, ఆ తర్వాత డిమాండ్‌ను బట్టి దీన్ని లక్ష చదరపు అడుగులకు విస్తరిస్తామని స్పైస్‌జెట్ సంస్థ వెల్లడించింది. వేర్‌హౌస్, వాణిజ్య కేంద్రం ఏర్పాటుతో కార్గో పరిశ్రమ మరింత అభివృద్ధి చెందడంతోపాటు తెలంగాణలోని ఫార్మా, ఎఫ్ఎంసీజీ, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్ పరిశ్రమల ఎగుమతులు, దిగుమతులకు మరింత ఊతం లభిస్తునందని జీఎమ్మార్, స్పైస్‌జెట్ వర్గాలు పేర్కొన్నాయి. విదేశీ మార్కెట్లను దృష్టిలో ఉంచుకొని భారతీయ మార్కెట్ అవసరాలను తీర్చేందుకు డొమెస్టిక్ టారిఫ్ ఏరియాలో స్థలం అవసరమైన సంస్థలకు రెడీ టు యూజ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను జీఎమ్మార్ ఏరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్క్ అందిస్తున్నది. ఎయిర్‌పోర్టు బేస్డ్ ఫ్రీజోన్ నిర్మాణం కోసం జీహెచ్ఏఎస్ఎల్‌తో ప్రతిష్ఠాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకొన్నందుకు ఎంతో గర్వపడుతున్నామని స్పైస్‌జెట్ సంస్థ సీఈఓ అమన్‌కపూర్ తెలిపారు. కార్గో పరిశ్రమకు ఈ ఒప్పందం చాలా మేలు చేస్తుందని స్పైస్‌జెట్ సీఎండీ అజయ్‌సింగ్ పేర్కొన్నారు.

# దిగొస్తున్న బంగారం

రూ.1,100 తగ్గిన తులం ధర

రూ.1,500 చవకైన వెండి



**న్యూఢిల్లీ, మార్చి 13:** బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగుతుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను అతి విలువైన లోహాల నుంచి వెనక్కితీసుకోవడం, రూపాయి విలువ కోలుకోవడంతో ధరలు పతనమయ్యాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర శుక్రవారం ఒకేరోజు రూ.1,097 తగ్గి రూ.42,600 స్థాయికి పడిపోయింది. గురువారం ఈ ధర రూ.43,697గా ఉన్నది. వెండి కూడా భారీగా పడిపోయింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి రూ.1,574 దిగొచ్చి రూ.44,130 వద్ద ముగిసింది. గత ముగింపు రూ.45,704గా ఉన్నది. హైదరాబాద్‌లో తులం బంగారం ధర రూ.43,300గాను, వెండి రూ.43,931కి పడిపోయింది. స్టాక్ మార్కెట్లు, రూపాయి పతనాన్ని అడ్డుకట్ట వేయడానికి రిజర్వు బ్యాంక్ రంగంలోకి దిగడంతో తిరిగి కోలుకోవడం బులియన్ ధరలు దిగిరావడానికి ఇదే ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ వర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,585 డాలర్లకు, వెండి 15.65 డాలర్లకు పడిపోవడంతో దేశీయంగా ధరలు తగ్గుముఖం పట్టాయన్నారు.

### రెండు రోజుల్లో రూ.2 వేలు

ఈ నెల మొదట్లో గరిష్ఠ స్థాయి రూ.45 వేల మార్క్‌ను దాటిన బంగారం ధరలు క్రమంగా శాంతిస్తున్నాయి. కరోనా వైరస్ కల్లోలం దెబ్బకు స్టాక్ మార్కెట్లు, మరోవైపు రూపాయి బక్కచిక్కుతున్న ప్రస్తుత సమయంలో పసిడి ధరలు కూడా తగ్గుముఖం పట్టడం విశేషం. గడిచిన రెండు రోజుల్లోనే బంగారం ధర ఏకంగా రూ.2 వేలకు పైగా పడిపోయింది. వెండి కూడా రూ.2,600కి పైగా జారుకున్నది. ఈక్విటీల కంటే బంగారం సురక్షితమైన భావించిన పెట్టుబడిదారులు వీటిపై కూడా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. రోజురోజుకు కరోనా వైరస్ విజృంభిస్తుండటంతో గ్లోబల్ మార్కెట్లో 2011 తర్వాత ఒక్క వారంలో ఇంతటి భారీ స్థాయిలో పతనమవడం ఇదే తొలిసారి. మొత్తంమీద ఈవారంలో స్పాట్ గోల్డ్ 1.3 శాతం తగ్గి 1,555.42 డాలర్లకు, గత సెషన్‌లోనూ 3.6 శాతం తగ్గింది. సోమవారం ఏడేండ్ల గరిష్ఠ స్థాయి 1,700 డాలర్లు పలికిన ధర ప్రస్తుతం 7 శాతం తగ్గింది.


తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు & మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ

3వ అంతస్తు, DM&HS క్యాంపస్, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్-500095
ఫోన్ నం. 040-24745510; ఇ-మెయిల్: cetsmsidc@gmail.com

టెండరు ప్రకటన నం. 18/TSMSIDC/2019-20, తేది: 12.03.2020

హైదరాబాద్ (2 పనులు), సిద్దిపేట జిల్లా (1 పని) మరియు మహబూబ్‌నగర్ జిల్లా (1 పని)లో దిగువ తెలిపిన సివిల్ పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుతున్నవి. ఇతర వివరాలను మా వెబ్‌సైట్: http://www.tsmsidc.telangana.gov.in మరియు https://tender.telangana.gov.inలో చూడవచ్చును.

సం/- XXX
మేనేజింగ్ డైరెక్టర్

DIPR RO. No. 903-PP/CL/Advt/1/2019-20, Dt: 13/03/2020

తెలంగాణ ప్రభుత్వము
దేవాదాయ ధర్మాదాయ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు

NIT No. EE/01/Tender Notice/2020, తేది: 12-03-2020

కరీంనగర్ (మం॥ & జిల్లా), బొమ్మకల్ (గ్రా॥), శ్రీపురం కాలనీలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణం కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం: రూ.30.00 లక్షలు. సమాచారం కొరకు https://tender.telangana.gov.in ను దర్శించండి. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 16.03.2020, బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది(దాఖలు): 30.03.2020.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్
ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్

DIPR RO No:2646-DP/CL/Advt/1/2019-20, Dt: 13/3/2020

తెలంగాణ ప్రభుత్వం
డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్
ప్రతిపాదన కొరకు అభ్యర్థన

No. 180320/2020-H2 తేది: 12-03-2020

రాష్ట్రంలోని క్లస్టర్ ఆఫ్ మున్సిపాలిటీస్/మున్సిపల్ కార్పొరేషన్స్ కొరకు బయోమైనింగ్ ద్వారా ప్రస్తుతమున్న డంప్ సైట్స్ సరిచేయుట మరియు పునరుద్ధరణ, మున్సిపల్ సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్/ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ ఏర్పాటు చేయుట కొరకు ఏజెన్సీ ఎంపిక కొరకు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, టిఎస్, హైదరాబాద్ ''ప్రతిపాదన కొరకు అభ్యర్థన'' కోరుతోంది. ఆసక్తి గల బిడ్డర్లు RFPను 03-04-2020న 15.00 గంటలు లేదా ఆలోగా దాఖలు చేయవలసిందిగా కోరబడుచున్నారు. RFP డాక్యుమెంట్‌ను 14-03-2020 నుండి www.cdma.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

సం/- డా॥ ఎన్. సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్

DIPR R.O.No. 2645 DP/CL/Advt/1/2019-20 తేది: 13-03-2020

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం :: ఖమ్మం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

కమిషనర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఖమ్మం జిల్లా, తెలంగాణ వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ క్రింద టెండరు ప్రకటన ప్రకారం కోరిన టెండర్లు దిగువ విధంగా ఉన్నవి.

NIT No. 22/DB/KMC/1624/2019-20 తేది: 01-03-2020

1) ఎ) మొత్తం పనుల సంఖ్య-13 నం.లు, బి) పనుల స్వభావం- i) BOOT ప్రాతిపదికపై పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం (110 నం.లు) కొరకు EOI-1 నం. ii) మిని సక్షన్ కమ్ జెట్టింగ్ మెషిన్ నియోగించుట కొరకు రేట్ కాంట్రాక్టు- 1 నం., iii) త్రాగునీటి ట్యాంకర్ల నియోగించుట-4 నం.లు, iv) సివిల్ మరియు ఇతర పనులు-7 నం.లు., 2) పని మొత్తం విలువ : **రూ. 103.19 లక్షలు,** 3) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: **12-03-2020న ఉ. 10.30 గంటలకు,** 4) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: **20-03-2020న సా. 4.00 గంటలకు,** 5) బిడ్ తెరుచు తేది: **20-03-2020న సా. 4.30 గంటలకు.** కార్యాలయంలో సంప్రదించుటకు అధికారి పేరు, చిరునామా: అసిస్టెంట్ ఇంజినీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, **మొబైల్: 7901298207** (అసిస్టెంట్ ఇంజనీరు).తదుపరి వివరాలను http://tender.telangana.gov.in (రేట్ కాంట్రాక్ట్ పనుల కొరకు) & http://khammamcorporation.telangana.gov.in (EOI కొరకు)లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ , ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్

DIPR RO.No. 904PP/CL/Advt/1/2019-20, Dt: 13-03-2020

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
వాణిజ్య పన్నుల శాఖ
వేలం ప్రకటన

ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా, మెసర్స్ జి.ఆర్.కేబుల్స్ లిమిటెడ్, రంగారెడ్డిగూడా (గ్రా॥), రాజాపూర్ (మం॥)కు చెందిన చరాస్తులు అనగా, కంపెనీ ప్రాంగణములో గల నిర్ధరక యంత్ర సామాగ్రి, అన్ని రకాల తుక్కు రెవెన్యూ రికవరి యాక్ట్ 1864 యొక్క నియమ నిబంధనల ప్రకారం అమ్మకం పన్ను బకాయిలను రాబట్టుకొనుటకు **అదివారం తేది 29.03.2020 ఉ. 11.00 గం॥ల** నుండి **సా. 4.00 గం॥ల** మధ్య బహిరంగ వేలము వేసి విక్రయించబడుచున్నవి. సదరు నిర్ధరక యంత్ర సామాగ్రి తుక్కు సుమారు 120 టన్నులు కలిగి యున్నది.

ఇట్టి బహిరంగ వేలములో ఆసక్తి గల వ్యక్తులు పాల్గొనాల్సిందిగా ఇందుమూలముగా విజ్ఞప్తి చేయడమైనది. ఆర్.ఆర్.యాక్ట్ (చట్టం) ప్రకారం బహిరంగ వేలం కొరకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

సమగ్ర వస్తు జాబితాలోని చరాస్తులను కొనుగోలు చేయటానికి క్రింద పేర్కొన్న అధికారులను సంప్రదించగలరు. **డి.సి.టి.ఒ, జడ్చర్ల,** సెల్ నంబర్లు: 9640529622, 9441846154, 08542-233327

సం/- డిప్యూటి కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, జడ్చర్ల సర్కిల్, నల్గొండ డివిజన్

DIPR RO. No. 901-PP/CL/Advt/1/2019-20, Dt: 13/03/2020

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర
నీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి
O/o చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్-III, గోషామహల్, హైదరాబాద్
ఇ-టెండరు ప్రకటన

| ఇ-టెండరు నోటీసు నం. & తేది | పని పేరు | అంచనా కాంట్రాక్టు విలువ |
| --- | --- | --- |
| 257/CGM(E)/O&MC.III/D3/2019-20, dated.10-03-2020 (1st Call) | O&M డివిజన్ నం. III యొక్క గోల్కొండ సెక్షన్, సబ్ డివిజన్-III పరిధిలో MES గోల్కొండకు నీటి సరఫరా మెరుగుపరుచుట కొరకు భోజగుట్ట రిజర్వాయర్ ఆర్టిల్లరీ నుండి 250mm డయా DI నీటి సరఫరా లైన్ వేయుట | రూ. 153.72 లక్షలు |

(1) టెండరు డాక్యుమెంట్లు ఆన్‌లైన్ ద్వారా **తేది: 12.03.2020న రా. 7.00 గం॥ నుండి** లభిస్తాయి మరియు టెండర్ల స్వీకరణకు చివరి **తేది: 19.03.2020న మ. 3.30 గం॥** (2) సంబంధిత చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) పేరు మరియు చిరునామా- **చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్-III, HMWSSB, గోషామహల్, హైదరాబాద్-12.** (3) సమాచారమును నిర్దిష్టముగా "ZIP" ఫార్మెట్‌లో అప్‌లోడ్ చేయవలసిందిగా కాంట్రాక్టర్లు/సంస్థలు కోరబడుతున్నారు. (4) తదుపరి వివరాలను **http://www.eprocurement.gov.in**లో చూడవచ్చును.

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్-III, గోషామహల్, హైదరాబాద్, TS.

అనుబంధం-I
తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక శాఖ

**మార్చి 11, 2020న జారీచేసిన 6.94% తెలంగాణ SDL 2060 తిరిగి జారీ**

| | |
| --- | --- |
| మొత్తం | : **రూ. 2000.00 కోట్లు** |
| జారీ ధర | : ప్రతి రూ. 10,000.00లకు రూ. 10,000.00 |
| కరెన్సీ | : 40 సంవత్సరాలు |
| రుణ దరఖాస్తు స్వీకరణ | :మొత్తం చేకూరిన వెంటనే ప్రకటన లేకుండా **17-03-2020** కాలము వ్యాపార వేళల అనంతరం వెంటనే ముగియగలదు. |

పై రుణము కొరకు తెలంగాణ ప్రభుత్వము చందాలు అభ్యర్థిస్తున్నది. పూర్తి వివరములను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ మరియు ముంబయి నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.

కె. రామకృష్ణారావు
ముఖ్య ఆర్థిక కార్యదర్శి
ఆర్థిక శాఖ

DIPR R.O. No. 2644-DP/CL/Advt/1/2019-20, Dt: 13-03-2020


# హమ్మయ్యా..!

■ భీకర నష్టాల నుంచి కోలుకున్న స్టాక్ మార్కెట్లు

■ అమ్మకాల ఒత్తిడితో 45 నిమిషాల పాటు ట్రేడింగ్ బంద్

■ 12 ఏండ్ల తర్వాత ఇదే తొలిసారి

-3,200 నుంచి +1,325 పాయింట్లకు

**శుక్రవారం ఉదయం 9.15 గంటలు కావొస్తున్నది. అంతలోనే ముంబైలోని దలాల్‌స్ట్రీట్ భారీ 'పిడుగుపాటు'కు గురైంది. దీంతో మదుపరుల హాహాకారాలు మిన్నంటాయి. ఇప్పటికే కరోనా వైరస్ భయాలతో అతలాకుతలమవుతున్న దేశీయ మార్కెట్లను ఈ అలజడి మరింత కుంగదీసింది. వరుస పతనాలతో బెంబేలెత్తుతున్న మదుపరులు తమ షేర్ల అమ్మకాల కోసం పరుగులు తీశారు. ఫలితంగా దేశీయ స్టాక్ మార్కెట్లను కొద్దిసేపు నిలిపివేయాల్సివచ్చింది.**



**ముంబై, మార్చి 13:** స్టాక్ మార్కెట్ల పతనం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారిపోయింది. ఒకవైపు ఆర్థిక మాంద్యం బుసలు కొడుతుంటే మరోవైపు కరోనా వైరస్ దేశ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను చిన్నభిన్నం చేస్తున్నది. ఈ దెబ్బకు స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. సోమ, గురువారాల భారీ పతనాలను మర్చిపోకముందే శుక్రవారం మూడు వేల పాయింట్లకు పైగా పతనంతోనే ఆరంభమైంది. ప్రారంభించిన ఐదు నిమిషాల్లోనే దేశీయ స్టాక్ మార్కెట్లు పది శాతానికి పైగా కోల్పోవడంతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ట్రేడింగ్‌లను నిలిపివేశారు. ఉదయం 9.20 నుంచి 45 నిమిషాల పాటు ట్రేడింగ్‌ను నిలిపివేశారు. మళ్లీ ఉదయం 10.30 గంటలకు తిరిగి ఆరంభమైంది. గత పన్నేండ్లలో ఇలా ట్రేడింగ్‌ను నిలిపివేయ డం ఇదే తొలిసారి. ప్రపంచ ఆర్థిక మాంద్యం వచ్చినప్పుడు 2008లో ఇలా ట్రేడింగ్‌ను నిలిపివేశారు. ఈ భారీ పతనాన్ని నిరోధించడానికి అటు కేంద్ర ప్రభుత్వం, మరోవైపు స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ, రిజర్వు బ్యాంక్‌లు రంగంలోకి దిగడంతో క్రమంగా కోలుకున్నాయి. కరోనా భయాలను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ప్రకటన మార్కెట్లకు ఆక్సిజన్‌లా పనిచేసింది. ప్రారంభంలోనే 3,20 పాయింట్లకు పైగా పతనం చెందడంతో 29,388.97 పాయింట్ల కనిష్ఠ స్థాయికి జారుకున్న 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 1,325.34 పాయింట్ల లేదా 4.04 శాతం లాభంతో 34,103.48 వద్ద ముగిసింది. మొత్తంమీద సూచీ 5,380 పాయింట్లు తిరిగి కోలుకోగలిగింది. ఇంట్రాడేలో 8,555.15 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయిన నిఫ్టీ.. చివరకు 365.05 పాయింట్లు లేదా 3.81% పుంజుకొని 9,955.20 వద్ద స్థిరపడింది.

■ **గత ఐదు సెషన్లలో దేశీయ స్టాక్ మార్కెట్లు నుంచి 2.3 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్నారు. డీఐఐలు 1.8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టడం విశేషం.**

■ టెలికం, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, ఫైనాన్స్, బ్యాంకింగ్, ఎనర్జీ రంగ షేర్లు ఆరు శాతానికి పైగా లాభపడ్డాయి.

■ **మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు లాభాల్లో ముగిశాయి.**

■ గత నాలుగు ట్రేడింగ్ రోజుల్లో సెన్సెక్స్ 3,473.14 పాయింట్లు(9.24%), నిఫ్టీ 1,034.25 పాయింట్లు(9.41%) నష్టపోయాయి.

■ **బీఎస్ఈలో 1,193 షేర్లు పతనమవగా, 1,191 షేర్లు లాభపడ్డాయి. 164 షేర్లు యథాతథంగా నిలిచాయి.**

### 15 శాతం వరకు పెరిగిన ఎస్బీఐ

ఏడాది కనిష్ఠ స్థాయికి జారుకున్న ఎస్బీఐ షేరు భారీగా లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఇంట్రాడేలో 17 శాతానికి పైగా లాభపడిన బ్యాంక్ షేరు ధర చివరకు 13.87 శాతం లాభపడి రూ.242.25 వద్ద ముగిసింది. టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ, సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఓఎన్‌జీసీలు ఐదు శాతానికి పైగా లాభపడ్డాయి. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, ఎల్అండ్‌టీ, ఐటీసీ, మారుతి, అల్ట్రాటెక్ సిమెంట్, ఇండస్ఇండ్ బ్యాంక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్, టెక్ మహీంద్రా, టైటన్, కొటక్ బ్యాంకులు లాభాల్లో ముగిశాయి.

3.55 లక్షల కోట్లు పెరిగిన సంపద

**భీకర నష్టాలతో** మదుపరులకు ముచ్చెమటలు పట్టించిన దేశీయ స్టాక్ మార్కెట్లు చివరకు లాభాల్లోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రారంభంలోనే మూడు వేల పాయింట్లకు పైగా నష్టపోవడంతో రూ.12 లక్షల కోట్ల మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. చివర్లో మార్కెట్లు భారీగా లాభపడంతో వీరి సంపద రూ.3.55 లక్షల కోట్లకు పైగా పెరిగింది. దీంతో బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.3,55, 590.19 కోట్లు పెరిగి రూ.1,29,26, 242.82 కోట్లకు ఎగబాకింది. కాగా గత నాలుగు సెషన్లలో మదపరులు రూ.15 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు.

**స్టాక్ మార్కెట్లు భారీగా పుంజుకున్నప్పటికీ విమానయాన రంగ షేర్లు మాత్రం కుదేలయ్యాయి. కరోనా వైరస్‌తో ప్రయాణాలపై నియంత్రించడంతో ఈ రంగ షేర్లు 10 శాతం వరకు తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా ఇండిగో, స్పైస్‌జెట్‌లు అత్యధికంగా నష్టపోయాయి. ఇండిగో పేరెంట్ కంపెనీ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు ఏకంగా 14.08 శాతం పతనమై 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.875ని తాకింది. స్పైస్‌జెట్ 9.99 శాతం తగ్గి లోహర్ సర్క్యూట్ రూ.43.70కి పడిపోయింది.**

## మార్కెట్లను పరిశీలిస్తున్నాం

■ పరిశ్రమలకు ఊరట కల్పించేందుకు కృషిచేస్తున్నాం

■ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ/ముంబై, మార్చి 13:** కరోనా వైరస్ భయాలతో ప్రస్తుతం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న దేశీయ, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లను ప్రభుత్వంతోపాటు రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నిశితంగా పరిశీలిస్తున్నట్టు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. వేగంగా విస్తరిస్తున్న కరోనా వైరస్‌తో తీవ్ర విపత్కర పరిస్థితులు ఎదురయ్యే అవకాశమున్నదని, దీని నుంచి పారిశ్రామిక రంగానికి ఊరట కల్పించేందుకు ప్రభుత్వంలోని వివిధ విభాగాలు కృషిచేస్తున్నాయని ఆమె విలేకరులకు తెలిపారు. శుక్రవారం ప్రారంభ సెషన్‌లో దేశీయ స్టాక్‌మార్కెట్లు మునుపెన్నడూ లేనంత భారీ పతనానికి గురైమదుపరులు కేవలం 20 నిమిషాల వ్యవధిలోనే దాదాపు రూ.12 లక్షల కోట్ల సంపదను కోల్పోయిన నేపథ్యంలో నిర్మలా సీతారామన్ పైవిధంగా స్పందించారు. కరోనా వైరస్‌ను కట్టడి చేయడంపై రాష్ట్రాలతో కేంద్రం నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నదని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నదని ఆమె చెప్పారు.

## కోలుకున్న రూపాయి



**రికార్డు** స్థాయికి పతనమైన దేశీయ కరెన్సీ విలువ చివరకు కోలుకున్నది. ఒక దశలో 74.50 చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్న రూపాయి విలువ చివరకు 48 పైసలు అధికమై 73.80 వద్ద నిలిచింది. రిజర్వు బ్యాంక్ జోక్యం చేసుకోవడం వల్లనే రూపాయి కోలుకోగలిగింది. కరోనా వైరస్ భయాలు చుట్టుముట్టడంతో ఈక్విటీ మార్కెట్లతోపాటు కరెన్సీలు తీవ్ర ఆటుపోటులకు గురయ్యాయి. ప్రస్తుత నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.38 వేల కోట్ల పెట్టుబడులను విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఉపసంహరించుకోగా..శుక్రవారం ఒకేరోజు రూ.4,700 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

## పెట్టుబడులకు సురక్షితం

■ అన్ని రంగాలకు హైదరాబాద్ అనువైన ప్రాంతం

■ యూకే-ఇండియా టెక్ హబ్‌లో జయేశ్‌రంజన్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** పెట్టుబడులకు హైదరాబాద్ అత్యంత సురక్షితమని, అన్ని రంగాలకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని రాష్ట్ర ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ పునరుద్ఘాటించారు. శుక్రవారం ఆయన బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్, ఐఐఐటీఎచ్ సీఐఈ అధిపతి రమేశ్‌లోగనాథన్ తదితరులతో కలిసి యూకే-ఇండియా టెక్ హబ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీని ద్వారా బ్రిటన్ పెట్టుబడిదారులు దేశంలోని నాలుగు ముఖ్య నగరాల్లో పెట్టుబడులు పెట్టనున్నారు. వీటిలో హైదరాబాద్ ఒకటి. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ఐటీ, లైఫ్‌సైన్సెస్, యానిమేషన్ లాంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు హైదరాబాద్‌లో విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. ఇక్కడి స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ కంపెనీలు ముందుకురావడం శుభసూచకమన్నారు. బ్రిటన్, తెలంగాణకు చెందిన పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బెయిల్ అవుట్‌కు ఓకే

### యెస్ బ్యాంకు పునర్వ్యవస్థీకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

#### పెట్టుబడులకు ముందుకొచ్చిన ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, కోటక్ బ్యాంకులు

#### మారటోరియంను త్వరలో తొలగిస్తాం: నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, మార్చి 13:** యెస్ బ్యాంకు పునర్వ్యవస్థీకరణ కోసం రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ప్రతిపాదించిన పథకాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించినట్టు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం వెల్లడించారు. మంత్రి వర్గ సమావేశానంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. యెస్ బ్యాంకులో 49 శాతం వాటాను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) కొనుగోలు చేయనున్నదని, యెస్ బ్యాంకు పునర్వ్యవస్థీకరణ కోసం ఇతర పెట్టుబడిదారులను కూడా ఆహ్వానిస్తామని చెప్పారు. తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన యెస్ బ్యాంకును ఆర్బీఐ ఇటీవల తన ఆధీనంలోకి తీసుకోవడంతోపాటు ఆ బ్యాంకు ఖాతాల నుంచి డిపాజిటర్లు ఏప్రిల్ 3 వరకు రూ.50 వేల కంటే ఎక్కువ నగదును ఉపసంహరించడాని వీల్లేదని మారటోరియం విధించిన విషయం తెలిసిందే. యెస్ బ్యాంకులో పెట్టుబడులు పెట్టేవారందరికీ మూడేండ్లపాటు లాక్-ఇన్ పిరియడ్ ఉంటుందని, ఈ మూడేండ్ల కాలంలో ఆయా పెట్టుబడిదారులు తమ వాటాలను తగ్గించుకొనేందుకు వీలుండదని,



మంత్రివర్గ సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

అయితే ఎస్బీఐ విషయంలో మాత్రం ఈ లాక్-ఇన్ పిరియడ్ కేవలం 26 శాతం వాటాలకు మాత్రమే వర్తిస్తుందని నిర్మలా సీతారామన్ వివరించారు. రుణదాత అధీకృత పెట్టుబడిని రూ.1,100 కోట్ల నుంచి రూ.6,200 కోట్లకు పెంచామని, డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించడంతోపాటు యెస్ బ్యాంకును, మొ త్తం బ్యాంకింగ్ వ్యవస్థ ను స్థిరీకరించాలన్న లక్ష్యం తో కేంద్ర మంత్రివర్గం ఈ పునర్వ్యవస్థీకరణ పథకాన్ని ఆమోదించిందని ఆమె చెప్పా రు. ఈ పునర్వ్యవస్థీకరణ పథకానికి సంబంధించిన నోటిఫికేషన్ వెలువడ్డాక మూడురోజుల్లో యెస్ బ్యాంకుపై మారటోరియంను తొలగించనున్నట్టు నిర్మలా సీతారామన్ తెలిపారు. యెస్ బ్యాంకులో 49 శాతం వాటా కొనుగోలు కోసం రూ.7,250 కోట్లు వెచ్చించనున్నట్టు ఎస్బీఐ గురువారం ప్రకటించింది. తాము తొలుత అనుకొన్న రూ.2,450 కోట్ల కంటే ఇది ఎంతో ఎక్కువని ఎస్బీఐ పేర్కొన్నది. తాజాగా యెస్ బ్యాంకులో పెట్టుబడులు పెట్టేందుకు మరో నాలుగు బ్యాంకులు ముందుకొచ్చాయి. ఆర్బీఐ ప్రతిపాదించిన పునర్వ్యవస్థీకరణ పథకంలో భాగంగా యెస్ బ్యాంకులో చెరో రూ.1000 కోట్ల చొప్పున పెట్టుబడులు పెట్టనున్నట్టు ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు శుక్రవా రం వెల్లడించాయి. అలాగే రూ.600 కోట్ల పెట్టుబడి పెట్టేందు కు యాక్సిస్ బ్యాంకు, రూ.500 కోట్లు పెట్టుబడి పెటేందుకు కోటక్ బ్యాంకు ముందుకొచ్చాయి.



‘ఆడవాళ్లు దహన సంస్కారాలు చేస్తారా? సిగ్గు లేదా? ఇంకా బతికే ఉన్నావ్? కట్టుబాట్లు, నిబంధనలు, అన్నీ గంగలో కలిసినయ్. ఇంకా బతికి లాభమేంటి? ఈ క్షణం నుంచే మీ కుటుంబాన్ని సంఘం నుంచి బహిష్కరిస్తున్నాం’ అంటూ కులపెద్దల తీర్మానం. ఆ తర్వాత కొన్ని రోజులు బాధ పడ్డారామె. కానీ బాధపడుతూ కూర్చుంటే వచ్చేదేం లేదని తెలుసుకున్నారు! అంతకు మించి సేవ చేయాలనుకున్నారు. ఏండ్లు గడిచాయి. ఎవరైతే తిట్టారో వారే ప్రస్తుతం ఆమెను ప్రశంసిస్తున్నారు.

# అంతిమ సేవల్లో ఆమె



అది 2018. గాంధీ దవాఖాన. ఓ మహిళ గేటు వద్ద కూర్చొని ఏడుస్తూ ఉంది. అది అక్కడ సాధారణం.. అందరూ చూస్తున్నారు. వెళ్లిపోతున్నారు. కానీ ఒకామె మాత్రం దగ్గరకెళ్లి ఏడుస్తున్న మహిళను పలుకరించారు. ‘చనిపోయింది నా కూతురు. చేతిలో చిల్లిగవ్వ లేదు, ఎక్కడికి పోవాల్నో, ఎవరిని సాయమడుగాల్నో తెల్వదు’ అని ఏడుస్తూ జవాబిచ్చిందా మాతృమూర్తి. ఆ తర్వాత చనిపోయింది హెచ్ఐవీ పేషెంట్ అని తెలుసుకున్నారామె. అయితేనేం ఆమే సగటు మనిషే కదా అంటూ.. దగ్గరుండి దహన సంస్కారాల్ని పూర్తి చేశారు. ఆమే పూర్ణశాంతి.

**అనాథ శవాలున్నా..**

పూర్ణశాంతి అంతిమసేవలో పాల్గొన్నారని తెలుసుకున్నారు కుల పెద్దలు. పూర్ణశాంతి కుటుంబాన్ని సంఘం నుంచి బహిష్కరించారు. అప్పటి నుంచి ఆమె మరింత మంది అంతిమ యాత్రలో పాల్గొనాలని నిర్ణయించుకున్నారు. రెండు జంట నగరాల్లో ఎక్కడ అనాథ శవాలున్నా.. తమకు సమాచారం ఇవ్వాలని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. అలా ఎవ్వరు ఫోన్ చేసి సమాచారమందించినా ఆమె వెళ్లి మృతుల అంతిమసంస్కారాల్ని నిర్వహిస్తున్నారు. 2018 నుంచి ఇప్పటివరకు దాదాపు 32 మంది అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించారు. అనాథల అంతిమ సంస్కారాల కోసం తనను 99666 55388లో సంప్రదించాలని ఆమె కోరుతున్నారు.



**ఆమె సేవలు ఇలా..**

ఎర్రం పూర్ణశాంతిది హైదరాబాద్. బాల్యం నుంచి ఆమె తండ్రి సేవా కార్యక్రమాలు చేస్తుండగా స్ఫూర్తి పొందారు. వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలిసి వలంటీర్‌గా సేవలందించారు. బాబా పేరు మీద ‘శ్రీ సాయి శాంతి సహాయ సేవా సమితి’ని ప్రారంభించారు. సంస్థ ప్రారంభించిన వారం రోజులకు షిర్డీ చూడని 45 మంది వృద్ధులు, నిరుపేదలను షిర్డీనాథుడి దర్శనానికి తీసుకెళ్లారు. సోషల్ మీడియా వేదికగా వారానికోసారి పాత బట్టల్ని సేకరించి పేదలకు పంచుతున్నారు. నగరంలోని దాదాపు 25 వృద్ధాశ్రమాలకు ఫ్రిజ్‌లు, కూలర్‌లు, మిక్సీలు, గ్రైండర్‌లు అందించారు. సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఓ దివ్యాంగ జంటకు రూ.70 వేలు ఖర్చుతో రెండు టీ స్టాల్స్ పెట్టించారు. వికలాంగులకు ఆర్టిఫిషియల్ లెగ్స్, చేతికర్రలు, వీల్ చైర్లు అందిస్తున్నారు. పేద మహిళలకు పుస్తెమట్టెలు సైతం అందిస్తున్నారు. తెలంగాణలోని దాదాపు 15 జంటలకు సంస్థ ఆధ్వర్యంలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం జరిపించారు. భర్త భాస్కర్ ఆమె చేస్తున్న సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా అండగా ఉంటూ ప్రోత్సాహాన్నందిస్తున్నారు.

**మహిళలకు అండగా..**

పూర్ణశాంతి తమ సేవాకార్యక్రమాలతో పాటు మహిళలకు అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 60 మంది నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. వితంతువులకు చేయూతనిచ్చేందుకు కుట్లు, అల్లికలపై శిక్షణనిప్పిస్తున్నారు. హస్తినాపురంలో 15 మంది వితంతువులకు బ్యూటీ పార్లర్ ట్రైనింగ్ ఇప్పించారు. గోసేవ, ఇతర సేవాకార్యక్రమాలన్నింటిలో ఆమె ముందుంటున్నారు.

... పడమటింటి రవికుమార్
నర్రె రాజేశ్

**ప్రతి ఒక్కరిలో దేవుడ్ని చూస్తాను!**

మహిళలు అంత్యక్రియల్లో పాల్గొనవద్దు అని మా కుటుంబాన్ని సంఘం నుంచి బహిష్కరించారు. కానీ అనాథల అంత్యక్రియల్లో పాల్గొనాలంటే రాసి ఉండాలి. అందుకే వాటిని దగ్గరుండి జరిపిస్తున్నా.. నేను ప్రతి ఒక్కరిలో బాబాను చూస్తాను. త్వరలో శాంతిధామం ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నా. మా సేవల్ని విస్తరించే పనిలో ఉన్నాం.

- **ఎర్రం పూర్ణశాంతి,** శ్రీ సాయి శాంతి సహాయ సేవా సమితి అధ్యక్షురాలు

‘ఆడవాళ్లు దహన సంస్కారాల్లో పాల్గొనవద్దా? అయితే కూతుళ్లు మాత్రమే ఉన్న తల్లిదండ్రుల పరిస్థితేంటి? అన్నింటా ఆడవాళ్లపై వివక్షేనా? పంతాలు, పట్టింపులు బతికున్నంత వరకే.. చనిపోయిన మనుషుల మీద కూడా జాలి చూపరా?’ అంటూ సమాజాన్ని ప్రశ్నిస్తున్నారు పూర్ణశాంతి.



# మీకు కూతురుందా?

**కూతురు పుడుతుందని పురిట్లోనే కడతేర్చేందుకు సిద్ధమయ్యే తండ్రులారా.. ఆడబిడ్డల వల్ల మీ ఆయుష్షు పెరుగుతుందట తెలుసుకోండి. ఓ అధ్యయనం ప్రకారం కుమార్తెలున్న తండ్రులే ఎక్కువ కాలం జీవిస్తున్నారట తెలుసా?**

పోలాండ్‌కు చెందిన జాగిల్లోనియన్ యూనివర్సిటీ 4వేలకు పైగా కూతుర్లు ఉన్న తల్లులు, తండ్రులను అధ్యయనం చేసింది. కూతుర్లున్న తండ్రుల ఎక్కువ కాలం బతుకుతున్నట్లు ఈ అధ్యయనంలో తేలింది. ఇంట్లో ఆడపిల్లలు లేని తండ్రులు త్వరగా కాలం చేశారట. అందుకే మనదేశంలో ‘ఆడపిల్ల మనింటి మహాలక్ష్మి’ అంటుంటారు. కుమారులకంటే కూతుళ్లే తండ్రులను జాగ్రత్తగా, బాధ్యతతో చూసుకుంటున్నారని ఈ అధ్యయనంలో తేలింది. ఈ విషయాన్ని ‘అమెరికన్ జర్నల్ ఆఫ్ హ్యూమన్ బయోలజీ’లో ప్రచురించారు కూడా. మరో అధ్యయనంలో కూతుళ్ల వల్ల కొందరు తల్లుల ఆయుష్షు తగ్గుతుందని, ఒంటరిగా ఉండే మహిళలు ఎక్కువ సంతోషంగా ఉంటున్నారని తెలిసింది. అంతేకాకుండా తండ్రీ కూతుళ్ల మధ్య ఎఫెక్షన్, ఎమోషన్ ఎక్కువగా ఉంటుందని జాగిల్లోనియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చెబుతున్నారు.

# నెలరోజుల్లో సెలబ్రిటీ

**ఆమె ఓ కానిస్టేబుల్. పోలీస్‌స్టేషన్‌లో టిక్‌టాక్ చేసింది. ఫలితంగా సస్పెండ్ అయ్యింది. ఇంతటితోనే ఆమె ఆగిపోలేదు. జరిగిందానికి కుంగిపోలేదు. తనకున్న ప్రతిభను మరింత మందికి చేరవేయాలనుకుంది. తన సస్పెండ్‌కు కారణమైన టిక్‌టాక్‌నే సాధనంగా నెలరోజుల్లోనే మార్చుకుంది. ఇప్పుడామె ఓ స్టార్‌గా మారిపోయింది.**



అల్పితాచౌదరిది గుజరాత్. నెల క్రితం డ్యూటీలో ఉన్నప్పుడు యూనిఫార్మ్ వేసుకొని టిక్‌టాక్ వీడియో చేసింది. ఆ వీడియో కాస్త సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మిలియన్స్ వ్యూస్, లక్షల్లో లైక్స్.. వచ్చాయి. అదే సమయంలో ఉన్నతాధికారులు స్పందించి ఆమెను ఉద్యోగం నుంచి సస్పెండ్ కూడా చేశారు. నెల రోజుల సస్పెండ్ సమయంలో అల్పితాచౌదరి మరిన్ని టిక్‌టాక్ వీడియోలు చేసింది. కేవలం టిక్‌టాక్‌లు చేయడమే కాదు. అల్పితాచౌదరి మంచి గాయని కూడా.. అభినయం, అందం ఉండడంతో ఆమెకు సినిమాల్లో అవకాశాలు కూడా వస్తున్నాయి. ప్రస్తుతం ఆమె ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టి సినిమా ప్రయత్నాల్లో ఉన్నారు.

# రోజూ 4 కి.మీ.ల నడక.. ఎవరికోసం?

**సాంకేతికత కారణంగా పుస్తకాలు కరువయ్యాయి. ఎంతమంచి పుస్తమైనా ఆన్‌లైన్‌లో దొరుకుతుంది కానీ.. దానిని చదివేవారు ఎంతమంది? పుస్తకాలు చదివేవారు కనుమరుగయ్యారని ఇటీవల ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే పుస్తక పఠనాసక్తిని పెంచడానికి ఈ వృద్ధురాలు గడపగడపకూ వెళ్తున్నది.**



**తెల్ల** చీర కట్టుకొని.. భుజానికి బ్యాగు తగిలించుకొని ఏడుపదుల వయసులో కూడా రోజూ 4 కిలోమీటర్ల దూరం నడుస్తున్నదీ మహిళా. ‘ఎందుకమ్మ నీకు ఈ వయసులో ఇంత ప్రయాస’ అంటే.. ‘ఈ నడక నాకోసం కాదు బాబు.. మంచి పుస్తకాన్ని చదివించడం కోసం..’ అంటున్నది కేరళకు చెందిన ఉమాదేవి. ఈమె ప్రయత్నం తనకోసం కాదు.. రేపటి తరం కోసం. టెక్నాలజీ ముసుగులో ఈ తరం ఏం కోల్పోతున్నారో చెప్పేందుకు ఉమాదేవి కేరళలోని ప్రతిగడపా తట్టేందుకు సిద్ధమైంది. బుద్ధన్నూర్ గ్రామానికి చెందిన ఉమాదేవికి ఓ లైబ్రరీ ఉంది. అందులో అన్నిరకాల సబ్జెక్ట్స్, పురాణాలు, ఎన్నో సందేశాత్మక కథలు, సమాజాన్ని కదిలించే పుస్తకాలున్నాయి. కాకపోతే వాటిని చదివేవారే లేరు. అందుకే లైబ్రరీలోని పుస్తకాలను బ్యాగులో పెట్టుకొని తన చుట్టుపక్కల గ్రామాల్లోవారికి చేరవేస్తున్నది. ఇందుకు ప్రతిగడపలో అడుగు పెడుతుంది ఉమాదేవి. ప్రతి ఇంటికీ వెళ్లి, ఆప్యాయంగా పలకరించి, వారికి చదువుపై అవగాహన కల్పించి, పుస్తకాలను అందిస్తున్నది. వారు చదివిన తర్వాత ఆ పుస్తకాలను ఇతరులకు అందిస్తున్నది. ముందుగా ఎవరైనా పలానా పుస్తకాలు కావాలని చెబితే వాటిని తన లైబ్రరీ నుంచి తీసుకెళ్లి మరీ ఇస్తున్నది ఉమాదేవి. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు ఆమె ప్రయాణం మొదలవుతుంది. ఇప్పటివరకు 220 ఇళ్లలో పుస్తకాలను అందించింది. ఉమాదేవి డిగ్రీ చదువుతుండగా వివాహమైంది. 20 ఏండ్లకు పైగా ట్యూషన్లు చెప్పింది. 18 ఏండ్ల క్రితం భర్త మరణించాడు.



# పట్టు.. ఆకట్టు

బాలీవుడ్ స్టార్ కాజోల్ తన గారాలపట్టి ‘నిషా’ ఫొటోలను ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. నిషా విదేశాల్లో చదువుకుంటున్నది. సెలవులకు మాత్రమే ఇంటికి వస్తుంటుంది. మొన్న హోలీ పండుగ సందర్భంగా తల్లి కాజోల్.. నిషా ఫొటోను ‘హ్యాపీ హోళీ’ అని షేర్ చేసింది. ఆ ఫొటోలల్లో ఆ స్టార్ కిడ్ చిరునవ్వులతో, పట్టు దుస్తుల్లో అందంగా కనిపిస్తున్నది. ఆమె వి-నెక్‌లైన్, మల్టీ-లేయర్డ్ స్కర్ట్‌తో అలరించింది. సీక్వెన్డ్ బ్లౌజ్‌తో బంగారు లెహంగా ధరించింది. ఈ వస్త్రధారణనే ప్రత్యేక ఆకర్షణగా నిలువడంతో నిషా ఫొటోలు నెట్టింటా పాపులర్ అవుతున్నాయి.

# బాటిల్ పెట్టుకునేలా..

నెయిల్‌పాలిష్ పెట్టుకునేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. అయినా ఒక్కోసారి బాటిల్ టేబుల్ మీద నుంచి పక్కకు జరుగడమో, ఒలికిపోవడమో జరుగుతుంటుంది. అలా అని ఒక చేతిలో పట్టుకొని పెట్టుకోవడమూ సాధ్యం కాదు. అందుకోసమే ఈ హోల్డర్. సిలికాన్ రబ్బర్‌తో తయారు చేసిన ఈ హోల్డర్‌లో బాటిల్‌ని ఉంచాలి. దీన్ని వేళ్లకు తొడిగించుకొని ఆ తర్వాత నెయిల్‌పాలిష్ వేసుకోవడం ప్రారంభించాలి. గులాబి, నీలం, ఆకుపచ్చ రంగుల్లో ఈ హోల్డర్స్ మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. దీని ధర మూడు వందల రూపాయలు మాత్రమే.





## రక్తపోటు, మధుమేహం ఉందా?

# కిడ్నీ పరీక్షలు తప్పనిసరి

సలహా

**మన శరీరంలో కిడ్నీలను చాలా సంక్లిష్టమైన, కీలకమైన అవయవాలుగా చెప్పుకోవచ్చు. అవి శరీరంలో విషతుల్యమైన పదార్థాలను మూత్రం ద్వారా వడపోసి బయటకు విసర్జింపజేస్తాయి. అంతేకాదు.. కీలకమైన హార్మోన్లు, ఎంజైమ్‌లను కూడా విడుదల చేస్తుంటాయి. అలాంటి కిడ్నీలను జాగ్రత్తగా కాపాడుకోవాలంటే ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలి.**



**చి**క్కుడు గింజ ఆకృతిలో ఉండే కిడ్నీల్లో ఎడమవైపుది కొంచెం పెద్దగా ఉండి, కుడివైపు దాని కన్నా కొంచెం పైకి ఉంటుంది. దాదాపు 150 గ్రాముల వరకు బరువుండే కిడ్నీలు 11-14 సెం.మీ. పొడవు, 6 సెం.మీ. వెడల్పు, 4 సెం.మీ. మందంతో ఉంటాయి. రక్తంలోని వ్యర్థాలను తొలగించడంతోపాటు రక్తపోటును నియంత్రించడంలోనూ కిడ్నీలది ప్రధాన పాత్ర. అందుకే బీపీ ఎక్కువగా ఉంటే కిడ్నీ పరీక్షలను కూడా పూర్తిగా చేయించుకోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా మధుమేహంతో బాధపడేవారికి మూత్రపిండాలు వైఫల్యం చెందే ప్రమాదం ఎక్కువ. కాబట్టి ఎప్పటికప్పుడు కిడ్నీ ఫంక్షన్ టెస్ట్‌లు చేయించుకుంటూ ఉండడం తప్పనిసరి. కిడ్నీలకు సంబంధించి నాలుగు రకాల సమస్యలు తలెత్తుతూ ఉంటాయి.

- కిడ్నీ ఇన్‌ఫెక్షన్లు
- కిడ్నీలో రాళ్లు
- కిడ్నీ ఫెయిల్యూర్
- కిడ్నీ ట్యూమర్స్, కిడ్నీ క్యాన్సర్లు.

మహిళల్లో ఎక్కువగా కనిపించే బ్యాక్టీరియల్ యూరినరీ ఇన్‌ఫెక్షన్లు కిడ్నీల వరకు పాకి ఇన్‌ఫెక్షన్లకు గురిచేస్తుంటాయి. యాంటీబయాటిక్స్‌తో ఈ సమస్య తొలగిపోతుంది. పురుషుల్లో ఎక్కువగా కనిపించే కిడ్నీలో రాళ్లు అనేక రకాలు ఉండడంతో పాటు ఇసుక రేణువుల పరిమాణం మొదలుకొని గోల్ఫ్‌బాల్ సైజు వరకు ఉంటాయి. అంత ప్రమాదకరం కాకపోయినా తీవ్రమైన నొప్పి, బాధను కలిగించే ఈ స్టోన్స్‌కు సైజును బట్టి అనేక రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

అధిక బరువు, స్మోకింగ్, ఆల్కహాల్, రక్తపోటు, షుగర్ లెవల్స్ అదుపులో లేకపోవడం వల్ల ఆ దుష్ప్రభావాలు కిడ్నీల మీద పడి అది కిడ్నీ ఫెయిల్యూర్ సమస్యకు దారితీయవచ్చు. కిడ్నీలు ఫెయిల్ అయినపుడు మాత్రమే లక్షణాలు బయటపడుతుంటాయి. అందుకే దీన్ని సైలెంట్ డిసీజ్‌గా చెప్పుకోవచ్చు. కిడ్నీ ఫెయిల్యూర్‌కు డయాలసిస్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ తప్పనిసరి కావొచ్చు.

**కణుతులు ఏర్పడితే..**

పుట్టుకతో వచ్చే మూత్రపిండాల్లో కణుతులు, పిల్లలకు స్నానం చేయించేటప్పుడు లేదా డాక్టర్ దగ్గరికి చెకప్స్‌కు తీసుకెళ్లినప్పుడు బయటపడుతూ ఉంటాయి. కణితి పరిమాణం బట్టి మూత్రంలో రక్తం, కడుపునొప్పి, జ్వరం, ఆకలి, బరువు తగ్గడం, అజీర్ణం, అధిక రక్తపోటు వంటి లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. నెఫ్రోబ్లాస్టోమా లేదా విల్మ్స్ ట్యూమర్‌గా చెప్పుకునే ఈ కిడ్నీ కణుతులు పిల్లల్లో 4,5 ఏళ్ల వయసులో బయటపడుతూ ఉంటాయి. అబ్బాయిల్లో కంటే అమ్మాయిల్లో ఎక్కువగా కనిపించే ఈ కణుతులను పూర్తిగా నయం చేయడం సాధ్యమే.

**రీనల్ సెల్ కార్సినోమా (ఆర్‌సీసీ)**

ఈ రకం కణితి పెద్ద వయసువారిలో కనిపిస్తూ ఉంటుంది. ఊపిరితిత్తులకు, ఇతర భాగాలకు వ్యాపించే గుణం ఈ క్యాన్సర్‌కు ఎక్కువ. ఒక్కొక్కసారి ఇలా ఇతర చోట్లకు పాకిన భాగాల ద్వారా కూడా ఈ క్యాన్సర్‌ను గుర్తించడం జరుగుతూ ఉంటుంది. ఒక్కోసారి రెండు కిడ్నీల్లో కూడా ఈ కణుతులు ఉండవచ్చు. అనేక సబ్‌టైప్‌లలో ఉండే ఈ క్యాన్సర్.. ఇతర కిడ్నీ సంబంధిత పరీక్షలలో, అల్ట్రాసౌండ్ వంటి పరీక్షల్లో కనుక్కుంటారు. వయసు పైబడే కొద్దీ ఈ క్యాన్సర్ పెరిగే అవకాశం ఎక్కువ. అయితే స్మోకింగ్ చేసేవారిలో చిన్నవయసువారిలోనూ ఈ క్యాన్సర్ నమోదవుతున్నట్టు అధ్యయనాలు తెలుపుతున్నాయి. స్మోకింగ్, ఆల్కహాల్, అధిక బరువు వంటి వాటితో పాటు జన్యుమార్పులు కూడా ఈ క్యాన్సర్‌కు ప్రధాన కారణాలు.

క్యాన్సర్ లక్షణాలు కనిపించినప్పుడు ఫిజికల్ ఎగ్జామ్, బ్లడ్ టెస్ట్‌లు, యూరిన్ టెస్ట్‌లు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, సీటీ, ఎమ్మారై, క్యాల్షియం లెవల్స్ తెలిపే పరీక్షలతోపాటు ఒక్కోసారి ఈ క్యాన్సర్ బయటపడే సమయానికి అది ఊపిరితిత్తులకు, ఎముకలకు పాకి ఉండవచ్చు. కాబట్టి చెస్ట్ ఎక్స్‌రే, బోన్ స్కాన్స్ కూడా చేయిస్తూ ఉండాలి. కిడ్నీని మొత్తంగా తీసివేసే సర్జరీతో పాటు క్యాన్సర్ రకాన్ని బట్టి కీమో, రేడియోథెరపీలను ఇస్తారు. ఇటీవల కిడ్నీలను లాపరోస్కోపిక్ పద్ధతిలో కూడా తొలిగిస్తారు.

క్యాన్సర్ కాని కణుతుల్లో కూడా సైజును బట్టి రకరకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఈ కణుతులు ఎక్కువగా ఉన్నా, కిడ్నీల్లో అవి చాలా పెద్దగా ఉన్న సందర్భాల్లో కూడా కిడ్నీను తొలగిస్తారు. సర్జరీ తరువాత కిడ్నీ ట్యూమర్ స్టేజ్ మీద ఆధారపడి సర్జరీని 3 రకాలుగా చేస్తారు.

**రాడికల్ నెఫ్రోక్టమీ**

ఎక్కువగా చేసే ఈ సర్జరీలో కిడ్నీతోపాటు అడ్రినల్ గ్లాండ్స్, లింఫ్ నాళాలు, టిష్యూలను మొత్తంగా తీసివేస్తారు. కణితి పరిమాణం ఎక్కువగా ఉన్నప్పుడు ఈ సర్జరీ చేస్తారు.

**సింపుల్ నెఫ్రాక్టమీ స్టేజ్-1**

కిడ్నీ క్యాన్సర్‌కు ఒక కిడ్నీని మాత్రం తీసేస్తారు.

**పార్షియల్ నెఫ్రోక్టమీ**

పుట్టుకతో ఒకే ఒక కిడ్నీ ఉండి, దానిలో కణితి కనిపించినప్పుడు కణితి ఉన్నంతమేరకు దాన్ని తీసివేస్తారు. ఒక్కోసారి రెండు కిడ్నీల్లోనూ కణుతులు ఏర్పడినప్పుడు కూడా ఇలా కణితి ఉన్న మేరకు మాత్రమే తీసివేస్తారు.

**తొందరగా గుర్తిస్తే మేలు**

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి ఒక్క కిడ్నీని మాత్రమే తీసేసినప్పుడు సర్జరీ అయిన కొద్దిరోజుల్లోనే వారు సాధారణ జీవితాన్ని గడపగలుగుతారు. రెండు కిడ్నీలను తీసేశాక, సరిగా పనిచేయకపోతే వారు క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకుంటూ, వీలైనంత త్వరగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకోవడం అవసరం.

చికిత్స ముగిశాక కూడా ఫాలోఅప్ కేర్ తప్పనిసరి. సీటీస్కాన్, చెస్ట్ ఎక్స్‌రే వంటి టెస్ట్‌లు క్రమం తప్పకుండా చేయించుకోవాలి. మూత్రంలో రక్తం కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా ఉండడంతోపాటు స్మోకింగ్, ఆల్కహాల్ లాంటి అలవాట్లకు దూరంగా ఉంటే కిడ్నీలను కొంతవరకైనా కాపాడుకోగలం.

**డాక్టర్ మోహనవంశీ**
**చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్,**
**ఒమేగా హాస్పిటల్స్**
**హైదరాబాద్: 9848011421**
**కర్నూల్: 08518-273001**
**గుంటూర్: 0863-2223300**



# అక్టోబర్‌లో 'కేజీఎఫ్-2'

**యష్** హీరోగా రూపొందిన 'కేజీఎఫ్' పాన్ ఇండియన్ చిత్రంగా అన్ని భాషల ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నది. రాఖీభాయ్‌గా యష్ పాత్ర చిత్రణతో పాటు హీరోయిజాన్ని పతాక స్థాయిలో ఆవిష్కరించిన తీరు అభిమానుల్ని మెప్పించింది. ప్రస్తుతం 'కేజీఎఫ్ చాప్టర్-2' పేరుతో ఈ చిత్రానికి సీక్వెల్ రూపొందుతున్నది. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. హెంబలే ఫిలిమ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. సాయికొర్రపాటి తెలుగులో విడుదల చేయబోతున్నారు. దసరా సందర్భంగా అక్టోబర్ 23న విడుదలచేస్తున్నట్లు శుక్రవారం యష్ ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. ప్రతినాయకుడిగా సంజయ్‌దత్ నటిస్తున్నారు. రవీనాటండన్ కీలక పాత్రను పోషిస్తోంది. ఇటీవల ప్రధాన తారాగణంపై కీలక ఘట్టాల్ని చిత్రీకరించారు.


యష్

## వక్కంతం వంశీ దర్శకత్వంలో..

**రవితేజ** సినిమాల జోరు పెంచారు. రెండు సినిమాలతో బిజీగా ఉన్న ఆయన తాజాగా మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనికి వక్కంతం వంశీ దర్శకత్వం వహించనున్నారు. పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపుదిద్దుకోనున్నది. గతంలో పలు విజయవంతమైన సినిమాలకు రచయితగా పనిచేసిన వక్కంతం వంశీ 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' చిత్రంతో మెగాఫోన్ పట్టారు. ఆయన దర్శకత్వం వహించనున్న ద్వితీయ చిత్రమిది. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.


రవితేజ

# శ్రుతిహాసన్ తీన్‌మార్

**చిత్రసీమలో** కాంబినేషన్స్ పునరావృతం కావడం సర్వసాధారణమే. ఓ సినిమా సక్సెస్ అయితే ఆ నాయకానాయికల జోడీని మళ్లీ వెండితెరపై చూడాలని అభిమానులు కోరుకుంటారు. తాజా సమాచారం ప్రకారం రవితేజ, శ్రుతిహాసన్‌ముచ్చటగా ముడోసారి కలిసి ఓ సినిమా చేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే 'హలో గురు ప్రేమకోసమే' తర్వాత ఏడాదిన్నర పాటు విరామం తీసుకున్న దర్శకుడు త్రినాథరావు నక్కిన ఇటీవలే రవితేజను కలిసి ఓ కథను వినిపించినట్లు సమాచారం. కమర్షియల్ హంగులకు వినోదాన్ని మిళితం చేస్తూ దర్శకుడు చెప్పిన పాయింట్ నచ్చడంతో రవితేజ ఈ సినిమాకు ఓకే చెప్పినట్లు తెలిసింది. ఈ చిత్రంలో శ్రుతిహాసన్ కథానాయికగా నటించనుందని చెబుతున్నారు. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఆమె క్యారెక్టర్ ఉంటుందని అంటున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రవితేజ, శ్రుతిహాసన్ జంటగా 'క్రాక్' చిత్రం రూపొందుతున్నది గోపీచంద్ మలినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా తర్వాత రమేష్‌వర్మ దర్శకత్వంలో రవితేజ ఓ సినిమా చేయబోతున్నారు. అది పూర్తయిన తర్వాతే త్రినాథరావు నక్కిన చిత్రం సెట్స్ పైకిరానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.


శ్రుతిహాసన్


నాగచైతన్య, సాయిపల్లవి

# పతంగిమల్లే ఎగిరే కలలు

**నాగచైతన్య,** సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్‌స్టోరీ'. ఏమిగోస్ క్రియేషన్స్, సోనాలి నారంగ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి పతాకంపై నారాయణ్‌దాస్‌నారంగ్, పి.రామ్‌మోహన్‌రావు నిర్మిస్తున్నారు. శేఖర్‌కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. మే నెలలో ఈ చిత్రం విడుదలకానుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'మ్యూజికల్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతున్న చిత్రమిది. ఓ జంట ప్రేమ ప్రయాణానికి చక్కటి దృశ్యరూపంగా ఉంటుంది. ఇటీవల విడుదలైన 'ఏయ్ పిల్లా' ఫుల్ లిరికల్ వీడియోకు చక్కటి స్పందన లభిస్తున్నది. 'ఎన్నో తలపులు ఏవో కలతలు బతుకే పోరవుతున్న గాల్లో పతంగిమల్లే ఎగిరే కలలే నావి..' అంటూ చైతన్య పింగళి అందించిన సాహిత్యం అర్థవంతంగా ఉందని ప్రశంసలు లభిస్తున్నాయి. పవన్ సి.హెచ్ చక్కటి బాణీలను అందించారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందమైన ప్రేమకథగా తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని పేర్కొన్నారు. రాజీవ్ కనకాల, ఈశ్వరీరావు, దేవయాని ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: విజయ్ సి.కుమార్, ఎడిటింగ్: మార్తాండ్ కె వెంకటేష్.

# గాయాలు కలవర పెడతాయి

**స్త్రీపురుష** సంబంధాల్లో అవిధేయత అలవాటుగా పరిణమిస్తే అనుబంధం ఆవిరైపోతుందని తాత్విక ధోరణిలో చెప్పింది బాలీవుడ్ అగ్రనాయిక దీపికాపదుకునే. విశ్వసనీయత పునాదుల మీదే ప్రణయసౌధాలు నిలబడతాయని, అది లోపిస్తే ప్రేమ ఒక శిథిలజ్ఞాపకంగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవలే ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీపికాపదుకునే తన జీవితంలో చోటుచేసుకున్న విఫల ప్రేమాయణం గురించి చెబుతూ భావోద్వేగానికి లోనైంది. 'నా జీవితంలో చెదిరిపోయిన ప్రేమ గురుతులున్నాయి. ఒక బంధంలో శృంగారం అన్నది కేవలం శారీరకమైనది మాత్రమే కాదు. అందులో ఎన్నో ఉద్వేగాలు మిళితమై ఉంటాయి. కానీ అతడికి జీవితాన్ని లోతుగా అర్థం చేసుకునే పరిపక్వత ఉండేది కాదు. అతడో మోసగాడు, స్త్రీలోలుడని నా సన్నిహితులు ముందే హెచ్చరించారు. కానీ నేను అతన్ని మార్చుకోవాలనుకున్నా. అవకాశాలు ఇచ్చి చూడాలని భావించా. అయితే స్వాభావికంగా వంచనాప్రవృతి కలవారు ఎప్పుడూ మారరనే విషయం క్రమంగా నాకు అర్థమైంది. ఓసారి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాక అతని నిజస్వరూపం ఏమిటో పూర్తిగా తెలిసొచ్చింది. దాంతో మా బంధాన్ని తెంచుకున్నాం. ప్రేమ అనే పడవ తీరం చేరకుండానే ఏటో వెళ్లిపోయింది. ఒక బంధాన్ని నిలుపుకోవడానికి నేను ఎన్నో త్యాగాలు చేశాను. అవన్నీ నిష్ఫలమై పోయాయి. నా మానసిక ఆరోగ్యాన్ని అతలాకుతలం చేసి వ్యాకులతకు కారణమైన ఆ రోజుల్ని తలచుకుంటే తిరిగి గాయాలు కలవరపెడతాయి. అందుకే ఎప్పుడూ జ్ఞప్తికి తెచ్చుకునే ప్రయత్నం చేయను' అంటూ తీవ్ర ఉద్వేగానికిగురైంది దీపికాపదుకునే. మాజీ ప్రియుడు రణభీర్‌కపూర్‌ను ఉద్దేశించి అన్యాపదేశంగా దీపికాపదుకునే ఈ వ్యాఖ్యలు చేసిందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కెరీర్ తొలినాళ్లలో రణభీర్‌కపూర్‌తో ప్రేమలో పడింది దీపికాపదుకునే. మనస్పర్థల కారణంగా ఈ జంట విడిపోయారు.


దీపికా పదుకునే


తమన్నా

## తెలంగాణ యాసలో..

**మనసుకు** నచ్చిన పాత్రల కోసం ఎంతటి శ్రమకైనా సిద్ధమే అంటున్నారు సీనియర్ కథానాయికలు. అరుదుగా వచ్చే అవకాశాల్ని సద్వినియోగం చేసుకొని పాత్రల్లో పరిపూర్ణత కనబరచాలని తపిస్తున్నారు. ఆ కోవలోనే మిల్కీ బ్యూటీ తమన్నా కబడ్డీలో శిక్షణ తీసుకోవడంతో పాటు తెలంగాణ యాస మీద పట్టు సాధించడానికి ప్రయత్నాలు చేస్తోంది. వివరాల్లోకి వెళితే గోపీచంద్ కథానాయకుడిగా సంపత్‌నంది దర్శకత్వంలో 'సీటీమార్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. కబడ్డీ నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ చిత్రంలో తమన్నా తెలంగాణ మహిళా టీమ్ కబడ్డీ కోచ్‌గా నటిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటోంది. ఆమె మాట్లాడుతూ 'నా కెరీర్‌లో తొలి స్పోర్ట్స్‌డ్రామా చిత్రమిది. కబడ్డీ కోచ్‌గా నన్ను నేను తీర్చుదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నా. దృఢంగా కనిపించడానికి జిమ్‌లో వర్కవుట్స్‌తో పాటు యోగా నేర్చుకుంటున్నా. పక్కా తెలంగాణ అమ్మాయిగా కనిపించాలంటే యాసలో ప్రామాణికత అవసరం. దర్శకుడు సంపత్‌నంది తెలంగాణ యాస, మాండలికంలో శిక్షణనిస్తున్నారు. క్రీడానేపథ్యంలో నటించాలనే నా చిరకాల స్వప్నం ఈ సినిమాతో నెరవేరబోతున్నది. డ్యాన్స్ బ్యాక్‌డ్రాప్‌లో సినిమా చేయాలన్న కల ఒక్కటే మిగిలిపోయింది' అని చెప్పింది తమన్నా. 'సీటీమార్' చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటోంది.


త్రిష

## చిరు సినిమా నుంచి తప్పుకొంది

**సృజనాత్మక** విభేదాల వల్ల తాను చిరంజీవి సినిమా నుంచి తప్పుకుంటున్నట్లు త్రిష శుక్రవారం ట్విట్టర్ ద్వారా ప్రకటించింది. 'తొలుత కొన్ని విషయాల్ని చర్చించుకుంటాం. నిర్ణయాలు కూడా తీసుకుంటాం. కానీ తర్వాత కాలంలో అవి మరో విధమైన మలుపు తీసుకుంటాయి. ఆ కారణంగానే చిరంజీవిగారి సినిమాలో నేను భాగం కావడం లేదు. సినిమా బృందానికి నా శుభాకాంక్షలు. మరో ఆసక్తికరమైన సినిమాతో తొందరలోనే మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తా' అని త్రిష వ్యాఖ్యానించింది. చిరంజీవి వంటి అగ్ర కథానాయకుడి సినిమా నుంచి త్రిష ఒక్కసారిగా తప్పుకోవడం ఈ వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'ఆచార్య' అనే పేరును ఖరారు చేశారు. రామ్‌చరణ్, నిరంజన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. మరోవైపు త్రిష మహిళా ప్రధాన చిత్రాలతో తమిళంలో బిజీగా ఉంది. 'లయన్' (2015) తర్వాత తెలుగులో స్ట్రెయిట్ సినిమాలో నటించలేదు త్రిష. పలు అనువాద సినిమాల ద్వారా మాత్రమే ఇక్కడి ప్రేక్షకుల్ని పలకరించింది.

## ప్రేమించి పెళ్లాడితే..

**మహి** రాథోడ్ హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం '1992'. శివ పాలమూరి దర్శకుడు. మోనా ఠాగూర్ కథానాయిక. ఈ చిత్ర టైటిల్ లోగోతో పాటు తొలి సింగిల్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదలచేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'అమాయకుడైన ఓ యువకుడి కథ ఇది. ప్రేమించి పెళ్లి చేసుకున్న అతడు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడన్నది నవ్విస్తూనే ఆలోచనను రేకెత్తిస్తుంది. ప్రస్తుతం చివరి షెడ్యూల్‌ను చిత్రీకరిస్తున్నాం. వేసవిలో సినిమాను విడుదలచేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. నేటి సమాజంలో ప్రేమ పెళ్లిళ్లు ఎలా మారిపోయాయో చాటిచెప్పే చిత్రమిదని హీరో చెప్పారు. కొత్తదనాన్ని నమ్మి చిత్రబృందం చేస్తున్న ఈ ప్రయత్నం ఫలించాలని రాజ్ కందుకూరి పేర్కొన్నారు.


మోనా ఠాగూర్



నమస్తే తెలంగాణ
సంపద
[ కరీంనగర్ ]
శనివారం 14 మార్చి 2020



**ఒకే ఒక్క నెలలో.. స్టాక్ మార్కెట్ దాదాపు పది వేల పాయింట్ల దాకా కోల్పోయింది.**

**1.5 ట్రిలియన్ డాలర్ల మేరకు మదుపరుల సంపద ఆవిరైంది.**

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం, కరోనా వైరస్.. ఇలా కారణాలేమైతేనేం.. సామాన్యుల నుంచి అపర కుబేరుల దాకా దారుణంగా నష్టపోయారు. సెన్సెక్స్ అంటేనే భయపడే స్థాయికి చేరుకున్నారు. మరి, పెట్టుబడి పెట్టాలని ఆలోచించే మధ్యతరగతి వేతనజీవులు స్టాక్ మార్కెట్ వద్దే వద్దంటున్నారు. ఇతర పెట్టుబడి మార్గాల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇలాంటి వారందరికీ రియల్ రంగమో ప్రత్యామ్నాయంగా మారింది. అభివృద్ధికి ఆస్కారమున్న ప్రాంతాల్లో ప్లాట్లు, ఫ్లాట్లు కొనడం అలవర్చుకుంటున్నారు.

... కింగ్ జాన్సన్ కొయ్యడ

# రియల్ భరోసా

**రియల్ రంగంలో** పెట్టుబడి పెట్టడం అత్యంత సురక్షితమైనదిగా చెప్పొచ్చు. అలా అని, ఎక్కడ పడితే అక్కడ కొనకూడదు. తెలంగాణలో ప్లాట్లు, ఫ్లాట్ల మీద పెట్టుబడి పెట్టాలని భావించేవారు.. జీహెచ్ఎంసీ వంటి కార్పొరేషన్లు, హెచ్ఎండీఏ వంటి పట్టణాభివృద్ధి సంస్థలు, మున్సిపాలిటీలు, డీటీసీపీల నుంచి అనుమతి తీసుకున్న వెంచర్లు, అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టుల్ని మాత్రమే ఎంచుకోవాలి. అది కూడా తెలంగాణ రెరా అథారిటీ నుంచి తుది అనుమతి తీసుకున్నవాటిలో కొనుగోలు చేయడమే ఉత్తమం. వీటి అనుమతి లేకుండా, సగం ధరకే ఫ్లాట్లు అమ్ముతామంటే ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయకూడదు. అలా చేస్తే, మీ పెట్టుబడికి పూర్తి స్థాయి భరోసా ఉంటుందనే గ్యారెంటీ లేదు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నా ప్రయోజనం ఉండదు. చివరికీ, తెలంగాణ రెరా అథారిటీ కూడా మీకు సాయం చేయలేదనే విషయాన్ని మర్చిపోవద్దు.

### 2008లోనే మనం నిలబడ్డాం..

ప్రపంచవ్యాప్త మార్కెట్‌ను క్షుణ్నంగా గమనిస్తే.. స్టాక్ మార్కెట్ దారుణంగా దెబ్బతింటున్నది. ఆకాశాన్నంటిన బంగారాన్ని కొనుగోలు చేయడం సరైన నిర్ణయం కాదని నిపుణులు సైతం ఏకీభవిస్తున్నారు. ఇలాంటి తరుణంలో రియల్ రంగంలో పెట్టుబడి పెట్టడమే సరైన నిర్ణయమని చెబుతున్నారు. స్టాక్ మార్కెట్ తరహాలో రియల్ రంగం ఒకేసారి కుప్పకూలడమంటూ ఉండనే ఉండదు. ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా తట్టుకుని నిలబడుతుంది. ఈ విషయం మనకు 2008–09 సమయంలోనే నిరూపితమైంది. అమెరికాలో సబ్‌ప్రైమ్ వల్ల ఆర్థిక వ్యవస్థ కకావికలైనప్పటికీ, మన రియల్ రంగానికి అప్పట్లో పెద్దగా నష్టమేం వాటిల్లలేదు. పైగా, అప్పటి హైదరాబాద్ నిర్మాణ రంగం సగర్వంగా తలెత్తుకుని నిలబడింది. ప్లాట్లు, ఫ్లాట్ల ధరలూ పెద్దగా తగ్గలేదు. కాకపోతే ఆ తర్వాత బయటికొచ్చిన సత్యం స్కామ్, తెల్లాపూర్‌లో ఏలియెన్స్ నిర్మాణ సంస్థ చేతులెత్తేయడం వల్ల ఫ్లాట్ల అమ్మకాలపై ప్రతికూల ప్రభావం పడింది. కొంతకాలం తర్వాత మళ్లీ మార్కెట్ తేరుకున్నది. ఇక, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, గతంలో కంటే అధిక స్థాయిలో నిర్మాణ రంగానికి గిరాకీ పెరగడం గమనార్హం.

పెద్ద నోట్ల రద్దు తర్వాత అధిక శాతం ప్రజల ఆలోచనల్లో స్పష్టమైన మార్పు కన్పిస్తున్నది. బ్యాంకుల్లో దాచుకోవడం అభద్రతగా భావించడం మొదలెట్టారు. అందుకే, మధ్య తరగతి ప్రజానీకంతో సహా అపర కుబేరులు సైతం భూములు, ప్లాట్లు, ఫ్లాట్లలో పెట్టుబడుల్ని పెట్టడం ఆరంభించారు. తాజాగా, యస్ బ్యాంకు పతనం తర్వాత ప్రజల ఆలోచనల్లో మరింత మార్పు వచ్చేసింది. ఎందుకంటే, ఒకసారి స్థలం అంటూ కొనుగోలు చేస్తే.. దాన్ని ధర హఠాత్తుగా పడిపోవడమంటూ ఉండదు. ఆతర్వాత,



## సురక్షితమే

ఆయా స్థలంలోకి ప్రవేశించకూడదని అనేవారూ ఎవరూ ఉండరు. ప్లాటు కొనేసి రిజిస్టర్ చేసుకుంటే చాలు.. శాశ్వతంగా మన పేరిటే భద్రంగా ఉంటుంది.

- ఒక రేటు పెట్టి ప్లాటు కానీ ఫ్లాటు కానీ కొన్న తర్వాత.. రాత్రికి రాత్రే ధర పడిపోవడం జరగదు. విలువ కూడా తగ్గిపోదు. ఈ తరహా ప్రమాదం స్టాక్ మార్కెట్లో ఎక్కువగా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. అయితే, 2008లో మహేశ్వరం చుట్టుపక్కల ప్రాంతాల్లో కొంతకాలం దాకా ధర తగ్గిపోవడం కనిపించింది తప్ప, ఆతర్వాత సాధారణ స్థితికి చేరుకున్నది.
- ఫ్లాటు లేదా ప్లాటు కొన్న తర్వాత ఎప్పుడు కావాలంటే అప్పుడు విక్రయించవచ్చు. ఇందుకోసం కొంత సమయం పట్టొచ్చు. కాకపోతే, ఒకేసారి సొమ్మంతా చేతికొచ్చేస్తుంది. అందుకే, అభివృద్ధికి ఆస్కారమున్న ప్రాంతాల్లో, ప్రభుత్వ అనుమతులన్నీ పక్కాగా ఉన్న వాటిలో ప్లాటు కొనుగోలు చేసి, కొంత కాలం వేచి చూస్తే మంచి లాభాల్ని అందుకోవచ్చు.
- ప్లాటు లేదా ఫ్లాటు కొనేటప్పుడు ఆర్‌బీఐతో సంబంధం ఉండదు. కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉండదు. ఆర్థికమంత్రి మీ సొమ్ముకేం భయంలేదని ప్రకటనలతో ధైర్యం చెప్పనక్కర్లేదు. అసలు వారి పాత్రే ఉండదు. ఫ్లాటు కొని రిజిస్ట్రేషన్ చేసుకున్నాక మహా అయితే అపార్టుమెంట్ నిర్వహణ చూసే ఫెసిలిటీ మేనేజర్‌తో సంప్రదింపులు జరుపుతారంతే.
- గృహరుణ సాయంతో ఫ్లాటు కొంటే.. పన్ను రాయితీ లభిస్తుంది. ఒకవేళ మీకు ఏదైనా సొంతంగా కంపెనీ ఉన్నట్లయితే, ఆ సంస్థ పేరు మీద వాణిజ్య సముదాయంలో స్థలం కొన్నా పన్ను ప్రయోజనం పొందవచ్చు. పిల్లలకు బంగారు భవిష్యత్తును అందించాలని కోరుకునేవారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్లాట్లు లేదా ఫ్లాట్లను కొనడం ఉత్తమం.

## సరైన సమయమిదే

ప్లాటు అయినా ఫ్లాటు అయినా కొనుగోలు చేయడానికి ఇంతకు మించిన తరుణం లేదు. జీఎస్టీ రేటు తగ్గింది. గృహరుణాలపై వడ్డీ రేటు తగ్గుముఖం పట్టింది. కాకపోతే, స్థానిక సంస్థలు, రెరా అథారిటీ నుంచి అనుమతి తీసుకున్న ప్రాజెక్టుల్లో మాత్రమే ప్లాటు, ఫ్లాటు, విల్లా, వ్యక్తిగత గృహాన్ని కొనుగోలు చేయాలి. ఒకవేళ, ఫ్లాటు కొనడానికి మీ వద్ద అధిక సొమ్ము లేకపోతే, కనీసం వాయిదా పద్ధతిలోనైనా కొనడానికి ప్రయత్నించాలి.కాస్త పేరున్న రియల్టర్‌ను ఎంచుకుని, ఓపిక చేసుకుని అయినా, భవిష్యత్తులో అభివృద్ధికి ఆస్కారమున్న ఏరియాల్లో ప్లాట్లను ఎంచుకోవడం అన్నివిధాల శ్రేయస్కరం.



## కరోనాతో నష్టమేనా?

కరోనా వైరస్ వల్ల మనకు జరిగే నష్టం ఏమిటంటే.. మహా అయితే నిర్మాణాలు కొంత ఆలస్యం అవ్వొచ్చు. అదెలాగంటే, ప్రస్తుతం నిర్మాణ సంస్థలు చేపట్టే ఫ్లాట్లు, విల్లాలు, వ్యక్తిగత గృహాల్లో వినియోగించే బాత్ టబ్బులు, సింకులు, కమోడ్‌లు, టైళ్లు, ఫర్నీచర్ వంటివన్నీ అధిక శాతం చైనా నుంచి దిగుమతి అవుతాయి. ప్రస్తుతం కరోనా వైరస్ వల్ల అక్కడి మార్కెట్ తెరుచుకోవడం లేదు. దీంతో అవి మన వద్దకు చేరుకోవడానికి కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉన్నది. దీంతో, ఈ పనులు చేపట్టే భవన నిర్మాణ కార్మికులకు పనులు లభించకపోవచ్చు. ఈ సమస్య కూడా తాత్కాలికమే తప్ప శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. అంతేతప్ప, కరోనా వైరస్ వల్ల తెలంగాణ రియల్ రంగానికి వాటిల్లే నష్టమేం లేదని చెప్పొచ్చు.

# ఆధునిక ఆవాసాలు ఇక్కడే



హైదరాబాద్‌లో రూపుదిద్దుకుంటున్న నిర్మాణాల సంఖ్య తక్కువేం కాదు. మరి, వివిధ ప్రాంతాల్లో పలు నిర్మాణ సంస్థలు కడుతున్న అపార్టుమెంట్లు ఏవి? వాటి విస్తీర్ణమెంత? ఒక్కో ప్రాజెక్టులో ఫ్లాట్ల ధరలెంత చెబుతున్నారు? వంటి ముఖ్యమైన విషయాలు మీకోసం..

| ప్రాజెక్టు | నిర్మాణ సంస్థ | ఎక్కడ | విస్తీర్ణం(చ.అ) | ధర(రూ.లక్షల్లో) |
|---|---|---|---|---|
| కాంక్రీట్ వివంటా | కాంక్రీట్ ఇన్‌ఫ్రా | మదీనాగూడ | 1525–2020 | 88.5–117 |
| జీఎంఆర్ స్ప్రింగ్‌ఫీల్డ్స్ | ఆల్పైన్ ఇన్‌ఫ్రాటెక్ | కొంపల్లి | 1246–1276 | 47.3–48.5 |
| గోల్డెన్ ఓరియోల్ | ఫార్చ్యూన్ గ్రీన్ హోమ్స్ | పుప్పాల్‌గూడ | 1376–2102 | 68.8–105 |
| మయూరా | ఫార్చ్యూన్ గ్రీన్ హోమ్స్ | బాచుపల్లి | 1450–1560 | 72.5–78 |
| అపర్ణా సరోవర్ జెనిత్ | అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ | నలగండ్ల | 1505–1955 | 94.8–123 |
| సువెల సాయి సుఖ్‌ధామ్ | సువెల ప్రాజెక్ట్స్ | మియాపూర్ | 1215–1611 | 70.5–93.4 |
| కోటెక్ సిగ్నేచర్ | కోటెక్ ప్రాజెక్ట్స్ | మల్లంపేట్ | 1377–1400 | 52.6–53.5 |
| బిల్డ్‌వెల్ ఆక్రోపోలిస్ | బిల్డ్‌వెల్ బిల్డర్స్ | నాగోల్ | 1212–1372 | 49.7–56.3 |
| స్టెర్లింగ్ హైట్స్ | మోడీ బిల్డర్స్ | గుండ్లపోచంపల్లి | 1425–1566 | 44.2–48.8 |
| లెమన్ ట్రీ పార్క్ | రయాన్ కన్‌స్ట్రక్షన్స్ | బాచుపల్లి | 1365 | 56.9 |
| ఎస్ఆర్ ఫార్చ్యూన్ సిటీ | శ్రీసాయి కన్‌స్ట్రక్షన్స్ | మియాపూర్ | 1575–1750 | 75.8–83.7 |
| ఫ్లెమింగో | ఎన్ఎంఆర్ ప్రాజెక్ట్స్ | సరూర్‌నగర్ | 1290–1585 | 61.9–76.1 |
| ఆర్ట్ ఆఫ్ లివింగ్ | అనుహర్ హోమ్స్ | అల్కాపూర్ టౌన్‌షిప్ | 1252–1308 | 60.1–62.8 |
| ఫోర్ట్ వ్యూ టవర్స్ | ఆర్ఎన్ఆర్ డెవలపర్స్ | అత్తాపూర్ | 1430–1635 | 67.9–77.7 |
| వివా సిటీ | ఇన్‌కార్ స్మార్ట్ హోమ్స్ | కొండాపూర్ | 1475 | 88.5 |
| గజానన హోమ్స్ | శ్రీ గజానన కన్‌స్ట్రక్షన్స్ | కొంపల్లి | 1500–2370 | 57–90.1 |
| సాకేత్ ప్రణామమ్ | సాకేత్ గ్రూప్ | కొంపల్లి | 1725–1885 | 62.1–67.9 |
| ప్రైమ్ సోలిటైర్ | ప్రైమ్ కన్‌స్ట్రక్షన్స్ | మోకిలా | 1625–1670 | 61.8–63.5 |
| విహారి | వజ్ర నిర్మాణ | మణికొండ | 1260–1435 | 70.6–81.4 |
| హాల్‌మార్క్ విసినియా | హాల్‌మార్క్ బిల్డర్స్ | నార్సింగి | 1420–2205 | 80.9–125 |
| ఈఐపీఎల్ రివేరా | ఈఐపీఎల్ గ్రూప్ | మంచిరేవుల | 2025–2225 | 97.2–110 |
| అపురూప జగపతి హైట్స్ | అపురూప షెల్టర్స్ | ఉప్పల్ | 1220–1660 | 51.9–70.6 |
| ప్రణీత్ జాగృతి ఎలైట్ | జాగృతి కన్‌స్ట్రక్షన్స్ | కొల్లూర్ | 1469–2287 | 58.4–90.9 |

★ అవగాహన కోసమే ఈ పట్టిక. న్యాయపరమైన అంశాలు, ప్రభుత్వ అనుమతి, ధర గురించి తెలుసుకున్నాకే నిర్ణయం తీసుకోవాలి.



# నాలుగు హాట్ లొకేషన్లు

**దేశవ్యాప్తంగా** రియల్ రంగం ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొంటుంటే.. హైదరాబాద్‌లో మాత్రం సుస్థిరంగా ఉన్నది. ఐటీ, ఐటీఈఎస్, ఫార్మా వంటి రంగాల్లో ఉద్యోవకాశాలు పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతమున్న కంపెనీలతో బాటు కొత్త సంస్థలూ భాగ్యనగరంలో కార్యకలాపాల్ని నిర్వహించడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ క్రమంలో కొన్ని కీలకమైన ప్రాంతాలు స్థిరంగా ఉండటంతో పాటు మిగతా ఏరియాలు అభివృద్ధి చెందడానికి దోహదపడుతున్నాయి. ఈ క్రమంలో మాదాపూర్, కొండాపూర్, మియాపూర్, కొంపల్లి వంటివి ముందు వరుసలో నిలుస్తాయి.

- మాదాపూర్‌లో ఐటీ కారిడార్ రియల్ రంగం రూపురేఖల్ని మార్చేసింది. ఈ ప్రాంతమే ప్రధాన కేంద్రంగా గత కొన్నేండ్ల నుంచి నిర్మాణ రంగం అభివృద్ధి చెందింది. హైటెక్ సిటీకి చేరువగా ఉండాలన్న ఆలోచనతో చాలామంది ఇక్కడే ప్లాట్లు, ఫ్లాట్లు కొనడం అలవాటు చేసుకున్నారు. ప్రస్తుతం మాదాపూర్‌లో చదరపు అడుక్కీ ఏడు వేలకు అటుఇటుగా విక్రయిస్తున్నారు. అద్దె గృహాలకు ఎక్కడ్లేని ఆదరణ పెరుగుతున్నది. సాఫ్ట్‌వేర్ నిపుణులు ఇక్కడే నివసించడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

### అందుబాటులో కొంపల్లి..

నార్త్ హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, పారిశ్రామిక హబ్‌గా విరాజిల్లుతున్న కొంపల్లికి ఇటీవల కాలంలో ఆదరణ పెరుగుతున్నది. ఔటర్ రింగ్ రోడ్డుకు చేరువగా ఉండటమే కాకుండా ఇక్కడ్నుంచి బేగంపేట్, సికింద్రాబాద్‌కు సులువుగా రాకపోకల్ని సాగించొచ్చు. ప్రస్తుతం శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోవాలని భావించేవారికి ఇక్కడ ప్లాట్లు, ఫ్లాట్లు, వ్యక్తిగత గృహాలు, లగ్జరీ విల్లాలకు కొదవే లేదు. రెండు పడక గదుల ఫ్లాట్లు సుమారు రూ.40 లక్షలకు అటుఇటుగా కొంపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రస్తుతం దొరుకుతున్నాయి.

### కొండాపూర్ ఓకే..

మాదాపూర్ తర్వాత అటు హైటెక్ సిటీతో బాటు ఇటు గచ్చిబౌలికి కొండాపూర్ నుంచి సులువుగా రాకపోకలను సాగించొచ్చు. అందుకే, ఇక్కడ ఫ్లాట్లను తీసుకోవడానికి చాలామంది ఆసక్తి చూపెడుతున్నారు. ఇక్కడి అద్దె గృహాలకు మంచి ఆదరణ ఉన్నది. ఫ్లాట్లను కొనేవారి సంఖ్య కూడా పెరుగుతున్నది. ఈమధ్య కొండాపూర్‌లోనే 'మై హోమ్' సంస్థ మంగళ అనే ప్రాజెక్టును ప్రకటించి రికార్డు స్థాయిలో అమ్మకాల్ని పూర్తి చేసింది. స్టాండ్‌ఎలోన్ అపార్టుమెంట్లకు ఇక్కడ కొదవే లేదు.

### మెట్రో రాకతో మియాపూర్..

హైదరాబాద్ మెట్రో స్టేషన్‌ను ఏర్పాటు చేయడంతో మియాపూర్ రూపురేఖలు మారిపోయాయి. మెట్రో రైలు ప్రారంభోత్సవ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మియాపూర్ వరకూ రావడంతో భారతదేశం దృష్టి మొత్తం ఈ ప్రాంతం మీద పడింది. ఎడ్యుకేషన్, ఇండస్ట్రీయల్ హబ్‌గా స్థిరపడిన మియాపూర్ నుంచి హైటెక్ సిటీ, గచ్చిబౌలికి సులువుగా రాకపోకల్ని సాగించొచ్చు. ఇక్కడ ఫ్లాట్లు చదరపు అడుక్కీ రూ.5,000 అటుఇటుగా చెబుతున్నారు. గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న గేటెడ్ కమ్యూనిటీల్లో రేటు కొంచెం ఎక్కువ చెబుతున్నారు. స్టాండ్ ఎలోన్ అపార్టుమెంట్లలో తక్కువే ఉంటుంది.







# అన్నీ చూశాకే అడుగు ముందుకు




ఇల్లు కొనుగోలు చేసేటప్పుడు బదిలీ రుసుం, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించండి. అమ్మకందారులు ఆస్తి పన్ను, విద్యుత్తు, నీటి ఛార్జీలు, సొసైటీ ఛార్జీలు, నిర్వాహణ రుసుం చెల్లించారా లేదా అన్నది నిర్ధారణ చేసుకోవాలి.

- క్రయ ఒప్పంద పత్రం (సేల్ అగ్రిమెంట్)లో ఫ్లాటు మున్సిపల్ అప్రూవ్డ్ ప్లాన్, ఫ్లాట్ విస్తీర్ణం, ఉమ్మడి స్థలాల వివరాలు, ఫ్లాట్ మొత్తం ధర వంటి వివరాలన్నీ ఉండాలి.
- హౌసింగ్ సొసైటీ నిరభ్యంతర ధృవీకరణ పత్రం తీసుకోవడమే మేలు. ఎందుకంటే ఇంటికి సంబంధించిన అసలు యజమాని ఎవరు.. సొసైటీకి ఇంకా చెల్లించాల్సిన రుసుములు, వివాదాలు ఏమైనా ఉంటే ఇట్టే తెలుస్తాయి.
- ఆదాయపు పన్ను చెల్లించినట్లుగా ధ్రువీకరించే పత్రాన్ని బిల్డర్ నుంచి తీసుకోవాలి. లేదంటే ఆ తరువాత ఆ పన్ను మీరే చెల్లించాల్సి రావచ్చు.
- ఇంటికి సంబంధించిన అసలు పత్రాలనే తీసుకోవడం మరవొద్దు.
- రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలి. రిజిస్టరు చేయని అమ్మకపు పత్రం న్యాయస్థానాల్లో నిలువదని గుర్తుంచుకోండి.

# ఐపీఎల్ వాయిదా

### ఏప్రిల్ 15వరకు పొడిగిస్తూ బీసీసీఐ నిర్ణయం
### ప్రజారోగ్యం దృష్ట్యానే ఈ నిర్ణయమన్న బోర్డు
### ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు 3 రాష్ట్రాలు నిరాకరణ

**సగటు క్రీడాభిమానుల అంచనాలు.. అనుమానాలను నిజం చేస్తూ.. 'వేసవి క్రికెట్ పండుగ' ఐపీఎల్ వాయిదా పడింది. ఒకవైపు కరోనా మహమ్మారి ప్రాణాలు హరిస్తుంటే.. జనసమూహాలను ఒక్క చోట చేర్చి లేనిపోని ఉపద్రవాన్ని కొనితెచ్చుకోవడం సరికాదని భావించిన బీసీసీఐ 13వ సీజన్‌ను ఏప్రిల్ 15 నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. అభిమానులను అనుమతించకపోవడం.. విదేశీ ప్లేయర్లు అందుబాటులో లేకపోవడం.. మ్యాచ్‌లు నిర్వహించేందుకు మూడు రాష్ట్రాలు నిరాకరించడం. ఇలా అనేక సమస్యలను ఎదుర్కొంటున్న బీసీసీఐ ప్రస్తుతానికైతే రెండు వారాలు వాటి నుంచి బయటపడ్డా.. ఆ తర్వాత కూడా లీగ్ సజావుగా సాగుతుందా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి.**




### ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక ససేమిరా..

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆటల నిర్వహణకు మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి నిరాకరించాయి. మహమ్మారి ప్రబలకుండా ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించలేమని కుండబద్దలు కొట్టాయి. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీలకు సొంతగడ్డపై మ్యాచ్‌లు ఆడే అవకాశం లేకుండాపోయింది. అయితే వాయిదా వేసిన తేదీకి ఇంకా చాలా సమయం ఉండటంతో అప్పటివరకు పరిస్థితులు అదుపులోకి వస్తాయని బీసీసీఐ భావిస్తున్నది.



**న్యూఢిల్లీ:** ఊహించిందే జరిగింది. కరోనా వైరస్ రోజురోజుకు విస్తరిస్తుండటంతో.. ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 13వ సీజన్‌ను వాయిదా వేశారు. విదేశీ ఆటగాళ్లకు అనుమతి నిరాకరణ.. ఖాళీ కుర్చీల మధ్య మ్యాచ్‌లు.. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వ్యతిరేకత.. ఇలా గత రెండు రోజులుగా ఐపీఎల్ విషయంలో మల్లగుల్లాలు పడ్డ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) చివరకు లీగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం మార్చి 29 నుంచి సీజన్ ప్రాంభం కావాల్సి ఉండగా.. రెండు వారాలు పొడిగిస్తూ.. ప్రారంభ తేదీని ఏప్రిల్ 15గా నిర్ణయించింది. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ చూసినా.. కొవిడ్-19 గురించే చర్చ సాగుతున్న తరుణంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ కార్యదర్శి జై షా పేర్కొన్నాడు. 'కరోనా వైరస్ ప్రబలుతుండటంతో ముందస్తు జాగ్రత్తలో భాగంగా వచ్చే నెల 15 వరకు ఐపీఎల్‌ను వాయిదా వేయాలని బీసీసీఐ నిర్ణయించింది'అని జై షా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ఐదు తటస్థ వేదికలు!**

ఖాళీ స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహించాల్సి రావడంతో పాటు.. అనవసర రిస్క్ వద్దనే ఉద్దేశంతోనే బీసీసీఐ ఈ చర్యలకు పూనుకుంది. తాజాగా ప్రకటించిన తేదీల ప్రకారం ఏప్రిల్ 15న లీగ్ ప్రారంభమయ్యే అంశంలోనూ పూర్తి స్పష్టత కొరవడింది. 'లీగ్‌తో సంబంధం ఉన్న ప్రతీ ఒక్కరి ఆరోగ్యం గురించి బీసీసీఐ ఆందోళన చెందుతున్నది. అభిమానులతో పాటు ఆటగాళ్లు, ఫ్రాంచైజీలందరికీ సురక్షిత క్రికెట్ అనుభవం దక్కేందుకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటున్నది. ప్రస్తుతం బీసీసీఐ.. కేంద్ర క్రీడా, ఆరోగ్య మంత్రిత్వ శాఖలతో కలిసి పనిచేస్తున్నది. ఏప్రిల్ 15 తర్వాత లీగ్ ప్రారంభమైతే.. విదేశీ ఆటగాళ్లు లేకుండా మ్యాచ్‌లు జరుగడం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు' అని జై షా అన్నారు.

### ఎఫ్‌టీపీకి ఇబ్బందే..

ఐపీఎల్ తాజా సీజన్‌ను ఏప్రిల్ 15కు మార్చితే.. ఐసీసీ ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్(ఎఫ్‌టీపీ)కు ఇబ్బంది కలిగే ప్రమాదం ఉంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29న ప్రారంభమయ్యే లీగ్ మే 24తో ముగియాల్సింది. అంటే 56 రోజుల పాటు సాగే సీజన్.. రెండు వారాలు వాయిదా పడితే.. షెడ్యూల్ ప్రకారం 40 రోజులు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఆ తర్వాత.. మిగతా జట్లకు అంతర్జాతీయ టూర్ ప్లాన్స్ ఉంటాయి కాబట్టి కీలక ఆటగాళ్లు తిరుగుముఖం పట్టే అవకాశాలున్నాయి. మరి ఐసీసీలో పెద్దన్న పాత్ర పోషించే బీసీసీఐ తన మాట చెల్లుబాటు చేసుకుంటూ.. అంతర్జాతీయ షెడ్యూల్‌లో మార్పులకు ప్రయత్నిస్తుందా చూడాలి.



'ప్రజల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం. అందుకే ప్రస్తుతానికి ఐపీఎల్‌ను వాయిదా వేశాం. ఈ అంశంపై ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు అవుతుంది. కాస్త సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది'

- గంగూలీ, బీసీసీఐ అధ్యక్షుడు

### భారత్, దక్షిణాఫ్రికా సిరీస్ రద్దు

భారత్, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్ రద్దయ్యింది. వైరస్ అంతకంతకు ప్రమాదకరంగా మారుతున్న క్రమంలో తాము సిరీస్‌లో కొనసాగలేమంటూ దక్షిణాఫ్రికా క్రికెటర్లు అనాసక్తి ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో సిరీస్‌లో మిగిలిన రెండు వన్డేలను రద్దు చేస్తున్నట్లు బీసీసీఐ శుక్రవారం ప్రకటనలో పేర్కొంది. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాలను అనుసరించి ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని బీసీసీఐ అధికారి ఒకరు పేర్కొన్నారు. అయితే భారత్, దక్షిణాఫ్రికా మధ్య తిరిగి మూడు వన్డేల సిరీస్‌ను రీషెడ్యూల్ చేస్తామని బోర్డు తెలిపింది.శుక్రవారం లక్నోకు చేరుకున్న సఫారీ జట్టు ఢిల్లీ నుంచి తమ దేశానికి బయల్దేరి వెళ్లనుంది.



కరోనా ఎఫెక్ట్



### ఈపీఎల్ వాయిదా

**లండన్:** ప్రముఖ సాకర్ లీగ్‌లలో ఒకటిగా పేరొందిన ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్(ఈపీఎల్) వచ్చే నెల 4వరకు వాయిదా పడింది. ప్రమాదకర కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా ఆటగాళ్ల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని లీగ్‌ను వాయిదా వేస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటించారు. 'షేర్‌హోల్డర్లతో ఈ రోజు సమావేశం జరిగింది. ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని వైద్య సలహాలు, సూచనల మేరకు లీగ్ వాయిదా వేసేందుకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నాం' అని లీగ్ నిర్వాహకులు తెలిపారు. లీసెస్టర్ సిటీకి చెందిన ముగ్గురు ఆటగాళ్లు కరోనా వైరస్ లక్షణాలతో స్వీయ నిర్బంధంలోకి వెళ్లారు.



### ప్లేయర్ల ప్రాణాలతో చెలగాటాలా..?

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్).. షట్లర్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని ఆటగాళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఈ సమయంలో ఆట కోసం పర్యటనలు కొనసాగించడం ఎంత మాత్రం మంచిది కాదు. కానీ సమాఖ్య మాత్రం దీన్ని పట్టించుకోకపోవడం ఆశ్చర్యంగా ఉంది' అని డెన్మార్క్‌కు చెందిన ప్రపంచ 8వ ర్యాంకర్ విట్టింగుస్ పేర్కొన్నాడు. సైనా కూడా బీడబ్ల్యూఎఫ్ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. విట్టింగుస్ ట్వీట్‌కు బదులిస్తూ.. 'నాకు కూడా అర్థం కావడం లేదు' అని పేర్కొంది.



### టీటీ టోర్నీలన్నీ రద్దు

**హాంకాంగ్:** ప్రపంచ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్).. ఆటకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను ఏప్రిల్ నెలాఖరు వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. 'విశ్వవ్యాప్తంగా కొనసాగతున్న టోర్నీలను ఉన్న పళంగా రద్దు చేస్తున్నాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో).. కొవిడ్-19ను మహమ్మారిగా ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఐటీటీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది.

### సీఎస్‌కే ప్రాక్టీస్ రద్దు

**చెన్నై:** కరోనా వైరస్ గుబులు రేపుతున్న కారణంగా చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) తమ ప్రాక్టీస్‌ను రద్దు చేసుకుంది. శనివారం నుంచి సీఎస్‌కే ఆటగాళ్లు చిదంబరం మైదానంలో ప్రాక్టీస్ చేయరని టీఎన్‌సీఏ కార్యదర్శి రామస్వామి తెలిపారు. మరోవైపు ఇన్నాళ్లు మూసివున్న చిదంబరం స్టేడియంలోని మూడు స్టాండ్లను శుక్రవారం తిరిగి ప్రేక్షకులకు అందుబాటులోకి తెచ్చారు.

# మళ్లీ నిరాశే..

### క్వార్టర్స్‌లో సింధు ఓటమి
### ఆల్ ఇంగ్లండ్‌లో ముగిసిన భారత షట్లర్ల పోరాటం



**బర్మింగ్‌హామ్:** ప్రపంచ చాంపియన్ పీవీ సింధు ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సింధు శుక్రవారం 21-12, 15-21, 13-21తో నాలుగో సీడ్ నజోమి ఒకుహార (జపాన్) చేతిలో ఓటమి పాలైంది. దీంతో ఆల్‌ఇంగ్లండ్ ఓపెన్‌లో భారత్ పోరాటం ముగిసినట్లైంది. గంటా ఎనిమిది నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్‌ను సునాయాసంగా నెగ్గిన తెలుగమ్మాయి.. ఆ తర్వాత వరుసగా రెండు గేమ్‌లు ఓడి క్వార్టర్స్‌లోనే ఇంటిదారి పట్టింది. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్లో ఒకుహారను మట్టికరిపించి విజేతగా నిలిచిన సింధు.. ఈసారి అలాంటి ప్రదర్శన కొనసాగించలేకపోయింది.

**ఆరంభం అదిరినా..**

ప్రిక్వార్టర్స్‌లో అదరగొట్టిన సింధు.. క్వార్టర్ ఫైనల్‌ను కూడా దూకుడుగా మొదలుపెట్టింది. తొలి గేమ్ ఆరంభంలోనే 3-0, 7-2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కాసేపటికి కోలుకున్న ఒకుహార పోరాడటంతో సింధు ఆధిక్యం 8-5కు తగ్గింది. ఈ దశలో చక్కటి క్రాస్ కోర్టు షాట్లతో రెచ్చిపోయిన సింధు ఆధిక్యాన్ని 18-9కి పెంచుకోవడంతో పాటు గేమ్‌ను తన ఖాతాలో వేసుకొని ముందంజలో నిలిచింది. ఈ గేమ్‌లో సింధు మునుపటి వాడి కనబర్చింది. సుదీర్ఘ ర్యాలీలతో ఆకట్టుకోవడంతో పాటు ప్రత్యర్థిని బ్యాక్‌లైన్‌కు పరిమితం చేస్తూ ఫలితం రాబట్టింది. ఆ తర్వాతి రెండు గేమ్‌ల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన సింధు చివరకు మూల్యం చెల్లించుకుంది.

# హ్యాట్రిక్ కొట్టేదెవరో..

### నేడు ఐఎస్‌ఎల్ ఫైనల్




రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

**గోవా:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) తుది అంకానికి చేరింది. ఐదు నెలలుగా అభిమానులను అలరిస్తున్న ఐఎస్‌ఎల్ ఆరో సీజన్ ఫైనల్ శనివారం జరుగనుంది. కొవిడ్-19 కారణంగా ప్రేక్షకులకు అనుమతి లేకపోవడంతో ఖాళీ కుర్చీల మధ్య ఏటీకే, చెన్నయిన్ ఎఫ్‌సీ మూడో టైటిల్ కోసం పోటీ పడనున్నాయి. ఏటీకే 2014, 16లో టైటిల్ నెగ్గితే.. చెన్నయిన్ 2015, 2017-18లో ట్రోఫీ చేజిక్కించుకుంది. మరి లీగ్‌లో తొలి హ్యాట్రిక్ నమోదు చేసేదెవరో నేడు తేలనుంది. ఈ సీజన్‌లో ప్రేక్షకులను అనుమతించకుండా మ్యాచ్‌లు నిర్వహించడం ఇది రెండోసారి. ఇంతకు ముందు నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ, బెంగళూరు ఎఫ్‌సీ మధ్య గువాహటి వేదికగా జరుగాల్సిన మ్యాచ్‌కు కూడా అభిమానులను అనుమతించలేదు. అప్పట్లో పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అసోంలో నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో తలుపులు మూసి మ్యాచ్ నిర్వహించారు.

### హారికకు ఏడో స్థానం

**లుసానే:** ఫిడే మహిళల గ్రాండ్ ప్రిలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఏడో స్థానంలో నిలిచింది. శుక్రవారం మరియా ముజుచుక్ (ఉక్రెయిన్)తో జరిగిన ఫైనల్ రౌండ్‌ను హారిక 'డ్రా' చేసుకుంది. ప్రపంచ మాజీ చాంపియన్ ముజుచుక్‌తో పోరును 25 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించిన తెలుగమ్మాయి చివరకు 5.5 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచింది. జార్జియా ప్లేయర్ నానా జనిడ్జే 7 పాయింట్లతో అగ్రస్థానంలో దక్కించుకోగా.. రష్యాకు చెందిన అలెగ్జాండ్రా గొరిచ్‌కినా (7 పాయింట్లు) సెకండ్ ప్లేస్‌కు పరిమితమైంది. టోర్నీ ఆరంభంలో వరుస విజయాలతో దూసుకెళ్లిన హారిక.. ఆరో, ఎనిమిదో రౌండ్లలో ఓటమి పాలవడంతో చివరకు ఏడోస్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది.



కోహ్లీ



రాహుల్

### మాస్కుల్లో క్రికెటర్లు

**లక్నో:** ముందస్తు షెడ్యూల్ ప్రకారం దక్షిణాఫ్రికాతో రెండో వన్డే ఆదివారం జరుగాల్సి ఉండటంతో టీమ్‌ఇండియా ఆటగాళ్లు శుక్రవారమే లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భారత కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ లోకేశ్ రాహుల్ ఎయిర్‌పోర్ట్‌లో మాస్కులతో దర్శనమిచ్చారు. అయితే కొవిడ్-19 వ్యాప్తిని అరికట్టడంలో భాగంగా బీసీసీఐ.. సఫారీలతో మిగిలిన రెండు వన్డేలను రద్దు చేయడంతో ఆటగాళ్లంతా తమ స్వస్థలాలకు పయనమయ్యారు.

# సౌరాష్ట్ర సౌరభం

### తొలిసారి రంజీట్రోఫీ నెగ్గిన ఉనాద్కత్ సేన




**రాజ్‌కోట్:** ప్రతిష్ఠాత్మక రంజీ ట్రోఫీలో కొత్త విజేత ఆవిర్భవించింది. గతేడాది తుదిమెట్టుపై బోల్తాకొట్టిన సౌరాష్ట్ర ఈసారి ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా విజృంభించి రంజీ ట్రోఫీ కైవసం చేసుకుంది. బ్యాట్స్‌మెన్ బాధ్యతాయుతమైన పోరాటానికి.. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కత్ బౌలింగ్ మెరుపులు తోడవడంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన సౌరాష్ట్ర ఎట్టకేలకు ట్రోఫీని ఒడిసిపట్టింది. మరోవైపు పదమూడేండ్ల తర్వాత రంజీ ట్రోఫీ ఫైనల్ చేరిన బెంగాల్‌కు నిరాశ తప్పలేదు. 1989-90 సీజన్ తర్వాత ఇప్పటి వరకు ఆ జట్టు రంజీ విజేతగా నిలువలేకపోయింది. ఓవర్‌నైట్ స్కోరు 354/6తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్.. మరో 27 పరుగులు చేసి మిగిలిన నాలుగు వికెట్లు కోల్పోయింది. ఉనాద్కత్ (2/96) ధాటికి అనుస్టుప్ మజుందార్ (63) క్రితం రోజు స్కోరుకు ఐదు పరుగులే చేసి వెనుదిరిగాడు. ఆ తర్వాత ఆకాశ్‌దీప్ (0), ముఖేష్ కుమార్ (5), ఇషాన్ పొరెల్ (1) నిలువలేకపోగా.. ఆర్నాబ్ నంది (40 నాటౌట్) ఒంటరి పోరాటం వృథా అయింది. దీంతో సౌరాష్ట్రకు 44 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఐదో రోజు ఆట ముగిసే సమయానికి 105/4తో నిలిచింది.

### ఇంగ్లండ్, లంక సిరీస్ వాయిదా

**లండన్:** కరోనా వైరస్ కారణంగా ఇంగ్లండ్, శ్రీలంక మధ్య రెండు టెస్టుల సిరీస్ శుక్రవారం వాయిదా పడింది. ఈనెల 19 నుంచి ఇరు జట్ల మధ్య తొలి టెస్టు మొదలుకానుండగా, వైరస్ విజృంభణ దృష్ట్యా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) జాగ్రత్తలకు సిద్ధమైంది. శ్రీలంక క్రికెట్ బోర్డుతో చర్చల అనంతరం టెస్టు సిరీస్‌ను వాయిదా వేసుకున్నామని ఈసీబీ పేర్కొంది. వెంటనే ఆటగాళ్లను స్వదేశానికి బయల్దేరాల్సిందిగా ఈసీబీ ఆదేశాలు జారీ చేసింది. కరోనా వైరస్‌తో ఆటగాళ్లు, సహాయక సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యం తమకు ముఖ్యమని, వారిని త్వరలో కుటుంబసభ్యులతో కలిసేటట్లు చేస్తామని ఈసీబీ అధికారి తెలిపారు.



రూట్

# ఆస్ట్రేలియా బోణీ



విలియమ్సన్

ఫించ్





**సిడ్నీ:** ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా.. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో 71 పరుగుల తేడాతో గెలుపొందింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా శుక్రవారం సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ఖాళీ కుర్చీల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో మొదట ఆసీస్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లకు 258 పరుగులు చేసింది. వార్నర్ (67; 9 ఫోర్లు), ఫించ్ (60; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), లబుషేన్ (56) అర్ధశతకాలు బాదారు. కివీస్ బౌలర్లలో సోధి 3, శాంట్నర్, ఫెర్గూసన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం టార్గెట్ ఛేజింగ్‌లో న్యూజిలాండ్ 41 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటైంది. గప్టిల్ (40) టాప్ స్కోరర్.

**అలవాటులో పొరపాటు..**

మ్యాచ్ ఆరంభానికి ముందు టాస్ వేసేందుకు మైదానంలోకి వచ్చిన ఇరు జట్ల కెప్టెన్‌లు ఫించ్, విలియమ్సన్ షేక్‌హ్యాండ్ ఇచ్చుకునేందుకు చేతులు ముందుకు చాపారు. ఆ తర్వాత కాసేపటికి తేరుకొని చిరు మందహాసంతో మోచేతులను టాప్ చేసుకొని ముందుకు సాగారు. ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) కాస్త హాస్యాన్ని జోడించి ట్విట్టర్‌లో పంచుకుంది.

**రిచర్డ్‌సన్‌కు కరోనా నెగిటివ్**

ఆసీస్ పేసర్ కేన్ రిచర్డ్‌సన్‌కు కొవిడ్-19 నెగిటివ్ అని నిర్ధారణ అయింది. గొంతులో మంటగా ఉండటంతో సీఏ అతడికి కరోనా పరీక్షలు నిర్వహించింది. 'తాజా పరీక్షల్లో రిచర్డ్‌సన్‌కు కరోనా వైరస్ నెగిటివ్ అని తేలింది. అతడు హోటల్ నుంచి మైదానానికి వెళ్లేందుకు అనుమతి లభించింది' అని సీఏ పేర్కొంది.

**అభిమానుల్లేక..**

కరోనా కరణంగా అభిమానులను స్టేడియంలోకి అనుమతించకపోవడంతో శుక్రవారం మ్యాచ్‌లో ఓ సరదా సన్నివేశం చోటు చేసుకుంది. ఆసీస్ ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో సోధి వేసిన బంతిని ఫించ్ మిడ్‌వికెట్ మీదుగా బౌండ్రీకి తరలించాడు. బంతి నేరుగా వెళ్లి స్టాండ్స్‌లో పడగా.. ఆ సమయంలో ప్రేక్షకులు లేకపోవడంతో ఆక్కడే ఫీల్డింగ్ చేస్తున్న ఫెర్గూసన్ స్టాండ్స్‌లోకి వెళ్లి ఖాళీ కుర్చీల మధ్య నుంచి బంతిని మైదానంలోకి విసిరాడు.